వానుక
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

మీ నమ్మకమే మా తరగని సంపద
KAPIL GROUP
కపిల్ చిట్స్
Visit Us: www.kapilchits.com
కపిల్ చిట్స్ మీ కలలకు సాకారం

epaper.vaartha.com WWW.VAARTHA.COM
విజయవాడ
: fb.com/vaartha Digital
Published from Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
27-12-2025 శనివారం సంపుటి: 31 సంచిక: 326 పేజీలు: 12 వెల: 6.50



## రవికుమార్ కుటుంబ సభ్యుల ఆస్తులపై
# హైకోర్టుకు ఏసిబి నివేదిక
### పరకామణి చోరీ కేసులో కీలక పరిణామం

**విజయవాడ,డిసెంబరు 26,ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) పరకామణిలో జరిగిన చోరీ కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసుకు సంబంధించిన నిందితుడు రవికుమార్‌తో పాటు ఆయన కుటుంబసభ్యుల ఆస్తులపై ఏసీబీ (అవినీతి నిరోధకశాఖ) ఒక మధ్యంతర నివేదికను విడుదలచేసింది. ఈ నివేదికను ఏసీబీ డీజీ ఇవాళ శుక్రవారం ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు సమర్పించారు. ఈ నివేదికను స్వీకరించిన హైకోర్టు, దానిని సవివరంగా పరిశీలించిన అనంతరం తగిన ఉత్తర్వులుజారీచేస్తామని స్పష్టం చేసింది. అలాగే ఈ వ్యవహారంలో ఎఫ్ఐఆర్ నమోదు చేయాల్సిన అవసరముందా లేదా అనే అంశాన్ని పరిశీలించాలని సీఐడీకి న్యాయస్థానం ఆదేశాలు జారీచేసింది. పరకామణిలో జరిగిన చోరీవ్యవహారంపై హైకోర్టులో శుక్రయవారం విచారణ కొనసాగింది. ఈ సందర్భంగా న్యాయమూర్తి కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ కేసుకు సంబం ధించిన దర్యాప్తు చాలా వరకు పూర్తి అయ్యిం దని, అయితే కొన్ని అంశాలపై ఇంకా విచారణ మిగిలి ఉందని పేర్కొన్నారు. అలాగే సుప్రీం కోర్టు ఇచ్చిన గత తీర్పుల ప్రకారం, ఈ కేసులో పరిస్థితుల ఆధారంగా మరో ఎఫ్ఐఆర్ నమోదు చేయాల్సిన అవకాశం ఉందని హైకోర్టు అభిప్రా యపడింది. ఈ అంశాన్ని కూడా సీఐడీ పరిశీలించాలని సూచించింది. ఈ కేసుకు సం బంధించిన తదుపరి విచారణను 2026 జనవరి 5వ తేదీకి ఏపీ హైకోర్టు వాయిదా వేసింది. అప్పటికి ఏసీబీ నివేదికపై పూర్తి స్థాయిలో నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని న్యాయవర్గాలు భావిస్తున్నాయి.

## అమరావతిలో వివిధ సంస్థలకు
# 49.50 ఎకరాలు

**విజయవాడ, డిసెంబరు 26,ప్రభాతవార్తప్రతినిధి:** రాజధాని అమరావతి నగరంలో వేర్వేరు సంస్థలకు కొత్తగా 49.50 ఎకరాలు కేటాయించారు. దీనికి సంబంధించి పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి సురేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. బాసిల్ ఉడ్ స్కూలుకు నాలుగు ఎకరాలు, శాంటామారియా (సెయింట్ మేరీస్)కు 7.97 ఎకరాలు ఎకరం రూ.50 లక్షలు చొప్పున ఫ్రీహోల్డ్ పద్ధతిలో కేటాయించారు. సిఐఐ గ్లోబల్ లీడర్ షిప్ సెంటర్కు 15 ఎకరాలు, కాగ్‌కు 5 ఎకరాలు, ఎన్టీపిసికి 1.50 ఎకరాలు, జ్యుడీషియల్ అకాడమీకి 4.83 ఎకరాలు, కాస్మోస్కు 5 ఎకరాలు, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు, పిఎన్బీ, ఐడిబిఐ 40 సెంట్లు చొప్పున భూమి కేటాయించారు. ఎన్ఎసికి 5 ఎకరాలు 60 ఏళ్ల లీజుకు ఎకరం 4.1 కోట్ల చొప్పున ప్రీమియం నిర్ణయించారు. గతంలో వేర్వేరు సంస్థలకు కేటాయించిన 42.30 ఎకరాలకు సంబంధించి సర్వే నెంబర్లలో స్వల్ప మార్పులు చేశారు. బ్యాంకులు, వేర్వేరు ప్రభుత్వరంగ సంస్థల ఉద్యోగుల ఇళ్ల స్థలాలకు 12.66 ఎకరాలు ఎకరం రూ.4.1 కోట్ల చొప్పున ప్రీమియం నిర్ణయించి ఇచ్చారు. 2014-19 మధ్యలో భూములు కేటాయించిన సంస్థలకు >>2

# 'సూపర్ పవర్' ఖాయం

## వేల యేళ్ల క్రితమే ప్రపంచానికి నాగరికతను పరిచయం చేసిన దేశం మనది
## ఆర్ఎస్ఎస్ చీఫ్ చేస్తున్న కృషి శ్లాఘనీయం
## తిరుపతిలో భారతీయ విజ్ఞాన్ సమ్మేళన్ ప్రారంభ సదస్సులో సిఎం చంద్రబాబు



శుక్రవారం తిరుపతిలో భారతీయ విజ్ఞాన్ సమ్మేళన్‌ను జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభిస్తున్న సిఎం చంద్రబాబు. చిత్రంలో ఆర్ఎస్ఎస్ చీఫ్ మోమన్ భగవత్,కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ తదితరులు

**తిరుపతి, డిసెంబరు 26 ప్రభాతవార్త:** భారతదేశం త్వరలోనే సూపర్ పవర్ కావడం ఖాయమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. తిరుపతిలో భారతీయ విజ్ఞాన్ సమ్మేళన్ ప్రారంభ సదస్సుకు సిఎం చంద్రబాబు శుక్రవారం హాజరయ్యారు. సభాప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భగవత్‌తో కలిసి సందర్శించారు. స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన వివిధ యుద్ధ పరికరాల నమూనాలను సీఎం చంద్రబాబు ఆసక్తిగా తిలకించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి సిఎం సభను ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ 'సంస్కృతి, సంప్రదాయాలను నిలబెడుతూ దేశాభివృద్ధి కోసం ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భగవత్ కృషి చేస్తున్నారు. మన దేశం, భారతీయత గురించి చర్చించుకోవడానికి భారతీయ విజ్ఞాన్ సమ్మేళన్ మంచి వేదిక. ప్రాచీన కాలంలోనే భారతదేశం >>2



# పాఠశాలలకు జనవరి 10 నుంచి సంక్రాంతి సెలవులు

**విజయవాడ,డిసెంబరు 26,ప్రభాతవార్తప్రతినిధి:** సంక్రాంతి పండుగ సందర్భంగా ఏపి ప్రభుత్వం విద్యార్థులకు తీపి కబురు చెప్పింది. ఈ మేరకు రాష్ట్రం లోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు సెలవులను ఖరారు చేస్తూ విద్యాశాఖ ఉత్తర్వులు జారీ >>2

# టోకెన్లు ఉంటేనే 'వైకుంఠం'

## తొలి మూడురోజులు కఠినంగా అమలు
## జనవరి 2నుండి అందరికి 'సర్వదర్శనం'
## సిఫారసులు స్వీకరించరన్న టిటిడి



**తిరుమల,డిసెంబరు 26ప్రభాతవార్తప్రతినిధి:** వైఖానస ఆగమోక్తంగా నిత్యకైంకర్యాలు జరిపించుకునే తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో పవిత్రమైన వైకుంఠద్వార దర్శనానికి డిసెంబర్ 30, 31,జనవరి 1మూడురోజులు టోకెన్లు ఉన్న భక్తులనే ఆలయం లోపలకు అనుమతించేలా టిటిడి చర్యలు తీసుకుంది. ఆ రోజులతో బాటు జనవరి 8వరకు ఎలాంటి సిఫార్సులేఖలు కూడా స్వీకరించరు. వైకుంఠ ఏకాదశి పర్వదినం డిసెంబర్ 30న ద్వాదశి 31నటోకెన్ కలిగిన భక్తులతోబాటు రాజ్యాంగహోదాలోని ప్రముఖులు స్వయంగా వస్తేనే దర్శనాలు కల్పిస్తారు. జనవరి 2నుండి 8 వరకు సామాన్యభక్తులకు సర్వదర్శనంలో వారం రోజులు(జనవరి 8వరకు) వైకుంఠద్వార దర్శనాలు కల్పిస్తారు. గోవిందమాల >>2

### రక్తం చిందిన రోడ్లు
# ఆళ్లగడ్డవద్ద ప్రమాదంలో నలుగురు మృతి
## నల్లపాడు వద్ద మరో ఘటనలో ముగ్గురు దుర్మరణం

**నంద్యాల/గుంటూరు, డిసెంబరు 26 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో శుక్రవారం రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఏడుగురు మృతి చెందగా, మరో ఐదుగురు గాయపడ్డారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. మృతులు, క్షతగాత్రులంతా తెలంగాణ వాసులు. వివరాల్లోకి వెళితే నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ మండలం బత్తలూరు సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. క్వాలిస్ వాహనం ప్రమాదవశాత్తు డివైడర్‌ను ఢీకొట్టి, అవతలి వైపు వెళ్తున్న ప్రైవేటు ట్రావెల్ బస్సును ఢీకొంది. ఈ ఘటనలో క్వాలిస్ వాహనం నుజ్జునుజ్జు అయ్యింది. క్వాలిస్‌లో ఉన్న నలుగురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. విషయం తెలిసిన వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్వాలిస్‌లో ఇరుక్కున్న మృతదేహాలను తొలగించి ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వారికి వైద్య చికిత్స అందిస్తున్నారు. మృతులు, క్షతగాత్రులు హైదరాబాద్ వాసులుగా >>2



27-12pg2exHMNWJQE 2_27-12pg2exHMNWJQE.qxd 26/Dec/25 11:40 PM Page 1






రాష్ట్రీయ బాలపురస్కారం అవార్డులు అందజేస్తున్న ద్రౌపది ముర్ము,పక్కన అవార్డు గ్రహీత ఏపీకి చెందిన పారా అథ్లెట్ శివానీ

## పారా అథ్లెట్ శివానీకి రాష్ట్రీయ బాలపురస్కారం

**విజయవాడ,డిసెంబరు 26,ప్రభాతవార్తప్రతినిధి:** దేశ రాజధాని ఢిల్లీలో వీర్ బాల్ దివస్ ఘనంగా నిర్వహించారు. వివిధ రంగాల్లో అత్యుత్తమ విజయాలు సాధించిన పిల్లలకు ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల్ పురస్కారాలను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అందజేశారు. తెలుగు రాష్ట్రాల నుంచి ఇద్దరు ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ అందుకున్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదగా ఏపీకి చెందిన పారా అథ్లెట్ శివాని రాష్ట్రీయ బాల పురస్కార్ అందుకున్నారు. శివాని స్వస్థలం ఆంధ్రప్రదేశ్ కర్నూలు జిల్లా మద్దికెర గ్రామం. గత నాలుగేళ్లగా జావెలిన్ త్రో, షాట్‌పుట్‌లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అత్యుత్తమ్మ ప్రతిభ కనబరుస్తున్నందుకు శివానిని ఈ పురస్కారానికి ఎంపిక చేశారు. కర్నూలు జిల్లా మద్దికెరకు చెందిన శివానికి పుట్టుకతోనే ఆమె కుడిచేయి మోచేతి వరకే ఉంటుంది. అయినప్పటికీ ఆమె తల్లిదండ్రులు ఆమె భవిష్యత్‌క కోసం ఎంతో కష్టపడ్డారు. చిన్నప్పటి నుంచి చదువుతో పాటు క్రీడల్లో కూడా ఎంతో ఉత్సాహం కనబరిచేది. నవోదయా స్కూల్ ప్రిన్సిపాల్ ప్రోత్సాహంతో హైదరాబాద్‌లోని ఆదిత్యమెహతా ఫౌండేషన్‌లో శివాని పారా అథ్లెటిక్స్‌లో శిక్షణ తీసుకుంటోంది. 2023లో విశాఖలో జరిగిన దివ్యాంగుల పోటీల్లో జావెలిన్ త్రో, షాట్‌పుట్‌లో శివాని బంగారు పతకాలు సాధించింది. ఆపై జాతీయ స్థాయి క్రీడలకు ఎంపికై అత్యుత్తమ ప్రతిభ కనబరిచింది. జాతీయస్థాయిలోనే కాకుండా అంతర్జాతీయ స్థాయిలోనూ శివాని పతకాలను సాధించింది. దుబాయిలో జరిగిన పారా యూత్ ఏసియన్ గేమ్స్, ఢిల్లీలో జరిగిన గ్రాండ్ ప్రిక్స్ పోటోల్లో కూడా పాల్గొని తన సత్తా చాటింది శివాని. అలాగే తెలంగాణకు చెందిన పడకంటి విశ్వనాథ్ కార్తికేయకు రాష్ట్రపతి ముర్ము రాష్ట్రీయ బాల పురస్కార్ అందించారు. విశ్వనాథ్ కార్తికేయ తెలంగాణ మేడ్చల్ మల్కాజ్‌గిరి వాసి.

## అక్రమ ఆలయ నిర్మాణంపై హైకోర్టు సీరియస్

### పలువురు అధికారుల సస్పెన్షన్, ఆర్డీవో, డీఎల్పీఓలకు షోకాజ్ నోటీసు జారీ చేసిన కలెక్టర్

**భీమవరం(విజయవాడ) డిసెంబరు 26,ప్రభాతవార్తప్రతినిధి:** పెంటపాడు మండలం ప్రతిపాడు గ్రామంలో ప్రభుత్వ/జిల్లా పరిషత్ రహదారి భూమిపై అనధికారంగా విగ్రహ ప్రతిష్ఠ, శివాలయం నిర్మాణం జరగడంపై పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ చాదలవాడ నాగరాణి తీవ్రంగా స్పందించారు. హైకోర్టు ఆదేశాలను అమలు చేయడంలో విఫలమైన పలువురు అధికారులను సస్పెండ్ చేస్తూ ఆమె ఆదేశాలు జారీ చేశారు. ఈ వ్యవహారంలో కలెక్టర్, పశ్చిమ గోదావరి ఎస్పీకి రాసిన లేఖలో తక్షణమే స్థానిక సీఐ, ఎస్ ఐ లపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పర్యవేక్షణలో లోపాలపై తాడేపల్లిగూడెం ఆర్డీవోకు, అలాగే డీఎల్పీవోకు షోకాజ్ నోటీసులు జారీ చేసి, కోర్టు ఆదేశాలను అమలు చేయడంలో ఎందుకు విఫలమయ్యారో వివరణ కోరినట్లు కలెక్టర్ తెలిపారు. తాడేపల్లిగూడెం ఆర్డీవో సమర్పించిన నివేదికను పరిశీలించిన కలెక్టర్, పనులు నిలిపివేయాలని ఆదేశాలు ఇచ్చినప్పటికీ, క్షేత్రస్థాయిలో అధికారులు తగిన చర్యలు తీసుకోలేదు. ఈ భూమి జిల్లా పరిషత్‌కు చెందినదని, విగ్రహ ప్రతిష్ఠకు లేదా ఆలయ నిర్మాణానికి ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని ఆర్డీవో నివేదికలో పేర్కొన్నారు. హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు, జిల్లా పరిపాలన పునరావృత సూచనలు ఉన్నప్పటికీ, ఆర్.ఎస్. నం.7 13బి (0.13 సెంట్లు) ప్రభుత్వ భూమిపై అక్రమ నిర్మాణం కొనసాగింది. దీనివల్ల హైకోర్టులో దావాలు నమోదయ్యాయు. ఈ నేపథ్యంలో ప్రతిపాడు గ్రామ పంచాయతీ కార్యదర్శి జె. నాగేశ్వరరావు, డిప్యూటీ ఎంపీడీవో వై.వి.ఆర్. వరప్రసాద్, గ్రామ రెవెన్యూ అధికారి వసంసెట్టి ఉమాదేవి, పెంటపాడు తహసీల్దార్ టీ. రాజా రాజేశ్వరి విధుల్లో నిరక్ష ్యం వహించారని పేర్కొంటూ కలెక్టర్ సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేశారు. పోలీసు, పంచాయతీరాజ్, రెవెన్యూ శాఖల క్షేత్రస్థాయి యంత్రాంగం సమన్వయం లేకపోవడం వల్లే హైకోర్టు ఆదేశాల ఉల్లంఘన జరిగిందని కలెక్టర్ వ్యాఖ్యానించారు. అవసరమైన బందోబస్తు, రక్షణ కల్పించడంలో విఫలమవడం జిల్లా పరిపాలనను దావాలకు గురిచేసిందని తెలిపారు. ఈ నిరక్ష ్యం ప్రభుత్వ ఉద్యోగులకు తగినది కాదని, విధుల పట్ల బాధ్యతారాహిత్యంగా పరిగణించబడుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రజా భూముల రక్షణ, న్యాయస్థాన ఆదేశాల అమలు విషయంలో ఇకపై ఎలాంటి సడలింపులు ఉండవని హెచ్చరిస్తూ, సస్పెండ్ అయిన అధికారులపై శాఖాపరమైన విచారణలు ప్రారంభించాలని స్పష్టం చేసారు.

## 50యేళ్లు దాటిన మత్స్యకారులకు పెన్షన్

### మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి

**విజయవాడ,డిసెంబరు 26,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మత్యకారులకు శుభవార్త తెలిపింది. మత్స్యకారుల సంక్షేమం కోసం అనేక నిర్ణయాలు తీసుకుంటున్న ఏపీ ప్రభుత్వం తాజాగా మత్స్యకారుల జీవనోపాధిని మెరుగుపరచడానికి మరో మరో కీలక నిర్ణయాన్ని తీసుకుంది. ఇక ఈ విషయాన్ని రాష్ట్ర మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి ప్రకటించారు. ఈ మేరకు ఆయన కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. మత్స్యకారులకు 50 సంవత్సరాలు వయసు నిండిన తర్వాత పెన్షన్ సౌకర్యం కల్పిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం కింద కేంద్రం సహకారంతో మత్స్యకారులకు రాయితీ పైన వివిధ రకాల పరికరాలను అందిస్తున్నామని, అందులో భాగంగానే ఇంజన్లు, తెప్పలు, వలలు, పడవలు వంటివి ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. అర్హులైన మత్స్యకారులు గ్రామ వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చని వెల్లడించారు. మత్స్యకారులకు రాయితీ పైన వివిధ రకాల పరికరాలు ఈ పథకంలో భాగంగా ఓబిసి వర్గాలకు 40 రాయితీ లభిస్తుందని, ఎస్సీ ఎస్టీ వర్గాలకు 60 శాతం రాయితీని ప్రభుత్వం అందిస్తుంది. రాయితీ క్రింద వేటకు సంబంధించిన సబ్సిడీ పరికరాలు పొందాలి అంటే మత్స్యకారులకు సొంత బోటుతో పాటు సంబంధిత లైసెన్సు తప్పనిసరి. రాయితీ పోను మిగిలిన మొత్తాన్ని మత్స్యకారులు డిమాండ్ డ్రాఫ్ట్ రూపంలో చెల్లించాల్సి ఉంటుంది. ప్రభుత్వ మత్స్యకారుల సంక్షేమం కోసం అనేక పథకాలను తీసుకువస్తుందని చెప్పిన ఆయన మత్స్యకారులకు 40 శాతం సబ్సిడీతో ఆటోలు ఇవ్వడానికి చర్యలు తీసుకుంటున్నట్టు వెల్లడించారు. ఉదాహరణకు రెండు లక్షల రూపాయల విలువైన ఆటో కొనుగోలు పైన 80 వేల వరకు సబ్సిడీ లభిస్తుందని తెలిపారు. గతంలో మత్స్యకారుల కుటుంబాలకు 4500 రూపాయల ఆర్థిక సహాయం అందిస్తే, ప్రస్తుతం వేటకు వెళ్లే మత్స్యకారులకు 20 వేల రూపాయలకు అది పెంచామని పేర్కొన్నారు.



శుక్రవారం న్యూఢిల్లీలో జరిగిన బాలల సమ్మేళనంలో పాల్గొన్న ప్రధాని మోడీ

## కలలతో ఎదగండి

### 'రేపటి పౌరుల'తో ప్రధాని మోడీ

**దేశ అభివృద్ధి బాణాలు మీరే..**

**జెన్‌జడ్, జెన్ అల్ఫా తరాలకు ప్రధాని పిలుపు**

**న్యూఢిల్లీ, డిసెంబరు 26:** జెన్ జెడ్, జెన్ అల్ఫా తరాలు తమ కలలతో ఎదగాలని, సూత్రాలపై దృష్టి పెట్టాలని, భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశ హోదా వైపు నడిపించాలని ప్రధానమంత్రి నరేంద్రమోడీ పిలుపునిచ్చారు. యువతకు వివిధ రంగాల్లో అపార మైన అవకాశాలు ఉన్నాయని అన్నారు. వీర్ బల్ దివాస్ సందర్భంగా శుక్రవారం ఢిల్లీలోని భారత్ మండపంలో నిర్వహించిన బాలల సమ్మేళనంలో యువ భారతీయులనుద్దేశించి ప్రధాని నరేంద్రమోడీ మాట్లాడుతూ, సాహిబ్జాదాస్-జోరావర్ సఇంగ్, ఫతేసింగ్‌ల అసమాన ధైర్యసాహసాలు, జాతీయ ఆదర్శాల నుండి ప్రేరణ పొందాలని యువతకు పిలుపునిచ్చారు. వయస్సుతో సంబంధం లేకుండా పెద్ద సవాళ్లను ఎదుర్కోవాలని మోడీ యువతకు సలహా ఇచ్చారు. సంస్కృతంలో ఒక శ్లోకాన్ని ఉటంకిస్తూ, "ఒక చిన్న పిల్లవాడు జ్ఞానం గురించి మాట్లాడితే, మనం దానిని స్వీకరించాలి" అని సూచించారు. "మీరు చిన్న వయసులోనే పెద్ద పనులు చేయగలరు. మీరు దాన్ని సాధించారు. కానీ ఈ విజయాలను భిన్నంగా చూడాలి. మీ కలలను ఆకాశానికి ఎత్తండి. దేశం దృఢ సంకల్పంతో మీతో ఉంది" అని ప్రధాని పేర్కొన్నారు. "గతంలో, యువత కలలు కనడానికి భయపడేవారు, ఎందుకంటే పాత వ్యవస్థ నిరాశా వాతావరణాన్ని కలిగించింది. కానీ ఇప్పుడు, దేశం ప్రతిభ కోసం వెతుకుతోంది. 140 కోట్ల మంది పౌరుల శక్తితో బలోపేతం చేయబడిన వేదికలను అందిస్తుంది" అని ప్రధాని అన్నారు. ఈ సందర్భంగా ఇంటర్నెట్, స్టార్టప్ మిషన్లు, కేంద్రీకృత వృద్ధికి వేదికల వంటి వనరులను ప్రస్తావించారు. నైపుణ్యాభివృద్ధి, ఇంటర్న్ షిప్‌లు, క్రీడా ప్రోత్సాహం, ఫిన్‌టెక్, తయారీ, యువ భారత్ వేదికల వంటి విధానాలకు యువత కేంద్రంగా ఉండటంతో, వ్యక్తిగత విజయం ఇతరులకు స్ఫూర్తినివ్వాలని అన్నారు. స్వల్పకాలిక ప్రజాదరణ (పాపులారిటీ) వల్ల యువత పరధ్యానానికి గురికావద్దని ప్రధాని మోడీ సలహా ఇచ్చారు. దేశ నిర్మాణానికి సహకరించిన మహానుభావుల నుంచి, గొప్పవ్యక్తులనుంచి ఆదర్శాలను, మంచి విషయాలను నేర్చుకోవాలని సూచించారు.

## టోకెన్లు ఉంటేనే 'వైకుంఠం'

>> భక్తులు కూడా దర్శన టిక్కెట్లు, టోకెన్లు ఉంటేనే ఆలయంలోనికి అను మతిస్తారు. ఈనెల 30వతేదీ నుండి జనవరి 8వరకు పదిరోజులు స్వయంగా వచ్చే విఐపిలకు మినహాయించి మరెవ్వరికీ విఐపి దర్శనాలు ఉండవు. శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో వైకుంఠ ద్వార దర్శనాలకు సమయం సమీపిస్తోంది. ఇందుకు సంబంధించి టిటిడి అధికారులు పూర్తి ఏర్పాట్లు చేశారు. ధనుర్మాసంలో వైకుంఠ ఏకా దశి 30వతేదీ, ద్వాదశిని 31వతేదీ నిర్ణయిం చారు. కలియుగవైకుంఠవాసుడు కొలువైన ఆల యంలో 30వతేదీ తెల్లవారుజామున 1.30గం టలకు వైకుంఠద్వారం తెరచుకోనుంది. భక్తులకు సంతృప్తికర దర్శనం చేయించేలా టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు, టిటిడి ఇఒ అనిల్‌కుమార్‌సిం ఘాల్, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి స్వయంగా పర్యవేక్షిస్తూ అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. పదిరోజులపాటు దాదాపు 9లక్షల మంది భక్తులు ఆరోజుల్లో వైకుంఠద్వార దర్శనం చేసుకునేలా చూడనున్నారు. తొలిమూడురోజులు దర్శన టోకెన్లు లేని భక్తులను ఆలయం లోపలకు అనుమతించరు. రాజ్యాంగ పరిధిలోని ప్రోటోకాల్ విఐపిలు స్వయంగా వస్తేనే పరిమితంగా బ్రేక్ దర్శనాలు జారీ చేస్తారు. భారీ క్యూలైన్లు నివారించి గరిష్ట సం ఖ్యలో భక్తులకు వైకుంఠ ద్వార దర్శనాలు చేయించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తులకు కేటాయించిన టైమ్‌స్లాట్ టోకెన్లలో నిర్ధేశిత సమయానికే క్యూలైన్లలోనికి చేరుకోవాలని సూచిస్తున్నారు. 3వేలమంది యువ శ్రీవారిసేవకులను, అవసరమైన పోలీసులను నియమించు కునివారి సేవలను క్యూలైన్ల నిర్వహణకు వినియోగించుకోనున్నారు. ఇప్పటికే ఆన్‌లైన్‌లో వైకుంఠద్వార దర్శనాలకు సంబంధించి 300రూపాయలు ప్రత్యేక ప్రవేశ దర్శనం 1.20 లక్షలు టిక్కెట్లు, శ్రీవాణి విఐపి బ్రేక్ దర్శనాలను రోజుకు వెయ్యి టిక్కెట్లు వారంరోజులకు ఎని మిదివేల టిక్కెట్లు ఆన్‌లైన్‌లో భక్తులు అందు కున్నారు. అందరికీ మహాలఘులో వైకుంఠ ద్వార దర్శనం కల్పిస్తారు. 30వతేదీ ఉదయం స్వర్ణరథం, 31నఉదయం చక్రస్నాన మహోత్సవం జరుగుతాయి.

## 'సూపర్ పవర్' ఖాయం

>> విజ్ఞానాన్ని సము పార్జించిన దేశంగా పరిఢవిల్లింది. ఎన్నో వేల ఏళ్ల క్రితమే అర్బన్ ప్లానింగ్ అంటే ఏమిటో హరప్పా నాగరికత ద్వారా చాటి చెప్పాం. 2900 ఏళ్ల క్రితమే యోగాభ్యాసం చేశాం ఇప్పుడు 150 దేశాలు యోగాను పాటిస్తున్నాయి. యోగా పాటిస్తే మానసిక ప్రశాంతత లభిస్తుంది. ప్రధాని మోడీ నేతృత్వంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని రికార్డు స్థాయిలో నిర్వహించాం. 2600 ఏళ్ల క్రితమే భారత దేశం ఆయుర్వేదం ద్వారా వైద్య సేవలు అందించింది. పూర్వ కాలంలోనే ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన తక్షశిల విశ్వ విద్యాలయం నిర్మించుకున్న దేశం మన భారత దేశం. 1600 ఏళ్ల క్రితమే నలంద యూనివర్శిటీ ద్వారా ఆధునిక విద్యను అందించిన ఘనత మనది... జీరోను భారతీయులే కనుగొన్నారు. మెదడుకు పదును పెట్టే చదరంగ క్రీడను కనిపెట్టిన ఘనత కూడా మన భారతీయులదే. వివిధ కీలక రంగాల్లో నైపుణ్యం సాధించిన నిపుణులు మన భారత దేశం సొంతం. అస్ట్రానమీలో ఆర్యభట్ట, గణితంలో భాస్కరాచార్య, వైద్యంలో చరక, ధన్వంతరి, ఆర్థిక శాస్త్రంలో కౌటిల్యుడు వంటి గొప్ప వారున్నారు. వీళ్లందరూ మనకు స్ఫూర్తిని కలిగించేలా చరిత్ర సృష్టించారు' అని ముఖ్య మంత్రి గుర్తు చేశారు.

**2 వేల ఏళ్ల క్రితమే అగ్రదేశంగా భారత్..** 'మన భారతీయ విజ్ఞానాన్ని ప్రపంచానికి చాటి చెప్పేందుకు మరింత విస్తృత పరిచేందుకు భారతీయ విజ్ఞాన్ సమ్మేళన్ అద్భుతంగా కృషి చేస్తోంది. దక్షి ణ భారత దేశంలో ఏడవ భారతీయ విజ్ఞాన్ సమ్మేళనాన్ని తిరుపతిలో నిర్వహించడం ఆనందంగా ఉంది. పవిత్ర ప్రాం తమైన తిరుపతిలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు వేంకటేశ్వర స్వామి ఆశీస్సులు ఉంటాయి. అమెరికా, ఇటలీ, ఫ్రాన్స్, ఇంగ్లండ్, స్పెయిన్, జర్మనీ, రష్యా, జపాన్ వంటి దేశాల్లో 2 వేల ఏళ్ల క్రితం భారత దేశానికంటే ఎంతో వెనుకబడి ఉన్నాయి. 2 వేల ఏళ్ల క్రితం ప్రపంచంలోనే భారత దేశం 40 శాతం జీడీపీని కలిగి ఉండేది. నాలెడ్జ్ ఎకానమీలో భారత్ ఎప్పుడూ సూపర్ పవర్ గానే ఉండేది కానీ విదేశీ పాలన, స్వాతం త్రం వచ్చాక మనం చేసుకున్న కొన్ని పాలసీల వల్ల దేశం ఇబ్బంది పడింది. 1991లో ఆర్థిక సంస్కరణలు వచ్చాయి. ఐటీ రెవల్యూషన్ అంది పుచుకున్నాం. వివిధ దేశాల్లోని ప్రముఖ సం స్థలకు భారతీయులే ప్రాతినిధ్యం వహిస్తున్నారు. 2047 నాటికి భారత దేశం ప్రపంచంలో నెంబర్1 స్థానంలో నిలుస్తుంది. ప్రతి జంట ముగ్గురు పిల్లలు కనాలని మోహన్ భగవత్ చెబుతున్నారు... నేనూ అదే చెబుతున్నా. ఇప్పుడు మన జనాభానే ఆస్తిగా మారారు. కొన్ని దేశాలు వయోభారం సమస్యతో ఇబ్బంది పడుతున్నాయి. మనకు ఆ ఇబ్బంది లేదు. తిరుగులేని యువశక్తితో కూడిన దేశం మనది. ఈ సంపదే మన దేశాన్ని అగ్ర భాగంలో నిలుపుతుంది. భారతదేశం నెంబర్1 స్థానంలోకి వెళ్లనున్న సందర్భంలోనే పేదధనిక మధ్య అంతరాలు తగ్గే వ్యవస్థను రూపొందించుకోవాల్సి న అవసరం ఉంది. గంగాకావేరీ నదుల అనుసంధానం అనేది జరగాలి... అప్పుడు నీటి భద్రత కలుగుతుంది. సైన్స్, టెక్నాలజీ రంగాల్లో భారత దేశం ఛాంపియన్. దేశాభివృద్ధికి వాజ్ పేయి పునాదులు వేశారు... ఇప్పుడు ప్రధాని నరేంద్ర అద్భుతంగా అభివృద్ధి చేస్తున్నారు. వినూత్న ఆలోచనలు చేయాలి... కొత్త ఆవిష్కరణలు చేపట్టాలి. భారత దేశం భవిష్యత్తులో సూపర్ పవర్ గా మారబోతోంది. ఇదే సమయంలో దేశాన్ని ప్రపంచ దేశాల ముందు ప్రత్యేకంగా నిలబట్టేంది మన విలువలు, సంప్రదాయాలే. ఆ దిశగా మోహన్ భగవత్ కృషి చేస్తున్నారు. విలువలు, నైతికత వంటి అంశాలనుపెంపొందించేందుకు మోహన్ భగవత్ గ్రౌండ్ ప్రిపేర్ చేస్తున్నారు. భారతదేశంలో అందరికీ భద్రత కల్పిం చేలా మన కుటుంబవ్యవస్థ ఉంటుంది. మన పురాణాల గురించి పిల్లలకు సోదాహరణంగా వివరించాలి. మన పురాణ పురుషుల గొప్పదనాన్ని యువతకు తెలియచెప్పాలి." అని ముఖ్యమంత్రి చెప్పారు. ఏపిలో టెక్నాలజీ సహా వివిధ రంగాల్లో అభివృద్ధి ప్రణాళికలు చేపడుతున్నాం. క్వాంటం, ఏఐ వంటివాటితో పాటు గ్రీన్ ఎనర్జీ రంగంలో ఏపిని అభివృద్ధి చేస్తున్నాం. త్వరలోనే ఏపి నుంచి క్వాంటం కంప్యూటర్ ఆపరేట్ చేయబోతున్నాం అని సిఎం చంద్రబాబు వెల్లడించారు. ఈ సందర్భంగా ఇండియాస్‌నాలెడ్జ్ సిస్టమ్స్ అనే పుస్తకాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి జితేంద్రసింగ్, రెవిన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్ర సాద్, ప్రొఫెసర్ భారత్, డాక్టర్ సతీష్ రెడ్డి, సంస్కృత విద్యాపీఠం కులపతి జిఎస్ఆర్కే శాస్త్రి పాల్గొన్నారు.

## 10 నుంచి సంక్రాంతి సెలవులు

>> చేసింది. జనవరి 10వ తేదీ నుంచి 18 వరకు అంటే ఏకంగా 9రోజుల పాటు అన్ని సెలవులు ఇస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. పండుగ తర్వాత జనవరి 19నుంచి పాఠశాలలు తిరిగి ప్రారం భమవుతాయని విద్యార్థులు, వారి తల్లి దండ్రులకు సూచించారు. ఇక కళాశా శాలల సెలవులపై అధికారిక ప్రకటన వెలువరించాల్సి ఉంది. అటు తెంగాణ లోనూ స్కూళ్ళకు ఇవే తేదీల్లో సెలవులు ప్రకటించే అవ కాశం ఉంది. సంక్రాంతి పండుగ ఈ సెలవులు రావడం వల్ల విద్యార్థులు తమ సొంత ఊర్లకు వెళ్ళడానికి, కుటుంబంతో గడపడానికి మంచి అవకాశం లభిస్తుంది.

## రక్తం చిందిన రోడ్లు

>> క్యాటరింగ్ సిబ్బందిగా గుర్తించారు. యాత్రకు వెళ్తే వారి కోసం వంట చేసేందుకు వెళ్లిన క్యాటరింగ్ చేస్తుంటారు. మృతులు గుండెరావు, శ్రవణ్, నరసింహా, బస్సీగా గుర్తించారు. అలాగే గాయపడిన వారు శివసాయి,



సిద్ధార్థలు. హైదరాబాద్ నిజాం కాలేజీలో విద్యనభ్యసిస్తున్నారు. గత 15 రోజులుగా యాత్ర చేస్తున్న బస్సుకు వంట చేసేందుకు గుండెరావు టీం వెళ్లి, తిరిగి వస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుందని పోలీసులు తెలిపారు. గుంటూరు జిల్లా నల్లపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలోని అంకిరెడ్డిపాలెం వద్ద జాతీయ రహదారిపై ఆగి ఉన్న కారును ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఢీకొంది. ఈ ఘటనలో ముగ్గురు ప్రాణాలు కోల్పోగా, మరో ముగ్గురికి గాయాలయ్యాయి. మృతులను తెలంగాణలోని సూర్యాపేటకు చెందిన సుశీల(64), వెంకయ్య(70), మహేష్(28)గా గుర్తించారు. తిరుపతి నుంచి తిరిగి వస్తుండగా ఈఘటన చోటుచేసుకుంది. మృతదేహాలను నల్లపాడు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## 49.50 ఎకరాలు

>> సంబంధించి 16.19 ఎకరాల్లో స్వల్ప మార్పులు చేశారు. ఇందులో డిఎవి స్కూలుకు ఎకరం రూ.50లక్షల చొప్పున ఇచ్చారు. ఎఫ్సి ఐకి ఎకరం రూ.4 కోట్లు చొప్పున ఫ్రీహోల్డ్ పద్ధ తిలో కేటాయించారు. కాంథారి హోటల్సు ఎక రం రూ.1.50కోట్లు, కినారా గ్రూపునకు ఎకరం రూ.1.50 కోట్లు చొప్పున ఫ్రీహోల్డ్ పద్ధతిలో ఇచ్చారు.

## క్రికెటర్ వైభవ్ సూర్యవంశీకి బాలపురస్కారం

**న్యూఢిల్లీ, డిసెంబరు 26:** ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కారాన్ని యువ క్రికెటర్ వైభవ్ సూర్యవంశీ అందుకున్నారు. రాష్ట్రపతి ముర్ము చేతుల మీదుగా 14 ఏళ్ల ఆ క్రికెటర్ అవార్డును స్వీకరించారు. ఢిల్లీలో శుక్రవారంజరిగిన పురస్కారాల ప్రధాన కార్యక్రమంలో ధైర్యసాహసాలు, కళలు, సంస్కృతి, పర్యావరణం, ఇన్నోవేషన్, సైన్స్ అండ్ టెక్నాలజీ, క్రీడల్లో ఉత్తమ ప్రదర్శన కనబరిచిన వారికి బాల పురస్కారాన్ని ప్రతి ఏడాది అందజేస్తారు. రాష్ట్రపతి భవన్‌లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అవార్డు స్వీకరించే క్రమంలో క్రికెటర్ వైభవ్ ఇవాళ మ్యాచ్‌కు దూరం అయ్యాడు. వాస్తవానికి బీహార్, మణిపూర్ మధ్య ఇవాళ విజయ్ హజారే ట్రోఫీ మ్యాచ్ జరుగుతున్నది. కానీ ఆ మ్యాచ్‌లో వైభవ్ ఆడడం లేదు. 5 నుంచి 18 ఏళ్ల ఉన్నవారికి బాల్ పురస్కారాలు అందజేస్తారు. వైభవ్‌తో పాటు మొత్తం 19 మంది పిల్లలకు వివిధ రంగాల్లో అవార్డులను అందజేయనున్నారు. మీరు సాధించిన ఘనత యావత్ దేశానికి ప్రేరణగా నిలుస్తుందని, ఇవాళ గుర్తింపు పొందిన ప్రతి చిన్నారి చాలా ముఖ్యమైన , విలువైన వ్యక్తులు అని, అలాంటి నైపుణ్యం ఉన్న పిల్లల వల్లే ప్రపంచవ్యాప్తంగా దేశానికి గుర్తింపు వస్తున్నదని రాష్ట్రపతి ముర్ము అన్నారు.

## అంతర్జాతీయ సైబర్ నేరగాళ్ల అరెస్ట్

### కీలక నిందితుడు వియత్నాం దేశీయుడు

### పెద్ద ఎత్తున 14సిమ్ బాక్సులు, 1500 సిమ్ కార్డులు, పలు కంప్యూటర్లు, ఇతర సాంకేతిక పరికరాలు స్వాధీనం: సిఐడి డిజి ఆసిఫ్ ఖాన్



శుక్రవారం మీడియా సమావేశంలో మాట్లాడుతున్న సిఐడి డిజి ఆసిఫ్‌ఖాన్

**విజయవాడ,డిసెంబరు 26,ప్రభాతవార్తప్రతినిధి:** సైబర్ నేరాలకు పాల్పడే ముఠా గుట్టురట్టు చేసిం ది ఏపీసీఐడీ. ఈ ముఠాలో కీలకమైన వియ త్నాం దేశీయుడితో పాటు మరికొందర్ని అరెస్టు చేసింది. పెద్ద ఎత్తున 14 సిమ్ బాక్సులు, 1500 సిమ్ కార్డులు, పలు కంప్యూటర్లు, ఇతర సాంకేతిక పరికరాలు స్వాధీనం చేసుకున్నట్లు సీఐడీ డీజీ ఆసిఫ్ ఖాన్ తెలిపారు. ఈ తరహా మోసం ద్వారా సైబర్ నేరాలకు పాల్పడి భారీ మొత్తాల్లో సొత్తు కొల్లగొట్టడమే కాకుండా, కాల్స్ రూటింగ్ ద్వారా టెలికం కంపెనీలకు పెద్ద ఎత్తున నష్టం కలిగిం చినట్లు సీఐడీ దర్యాప్తులో తేల్చింది. కాంబోడియా కేంద్రంగా సైబర్ నేరాలకు పాల్పడే ముఠా దీని వెనక ఉన్నట్లు గుర్తించింది. నిందితుల నుంచి వేల సంఖ్యలో సిమ్ కార్డులతో పాటు, పలు కంప్యూటర్‌లు, ఇతర సాంకేతిక పరికరాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను, వారి నుం చి స్వాధీనం చేసుకున్న పరికరాలు శుక్రవారం డిఐజీ(సిఐడిబ్లాక్) కార్యాలయంలో మీడియా ఎదుట ప్రదర్శించారు. దీనిపై సీఐడీ డీజీ ఆసిఫ్ ఖాన్ మీడియాతో మాట్లాడుతూ సైబర్ నేరాలకు పాల్పడుతున్న ఇంటర్నేషనల్ మోసగాడిని అరెస్టు చేశా మన్నారు. ఈ మోసాలకు పాల్పడేందుకు అనేక రకాల అధునాతన సాంకేతిక పరికరకాలు వాడుతున్నారని తెలిపారు. వారి నుంచి అనేక పరిక రాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇంటర్నే షనల్ కాల్స్‌ను లోకల్ కాల్‌గా మార్చి చూపుతున్నారని దీంతో చాలా మంది కాల్స్ మాట్లాడటం ద్వారా మోసపోతున్నారని చెప్పారు. దేశ వ్యాప్తంగా రూ. పది వేల కోట్ల వరకు మోసం చేశా రని ఒక్క ఏపీలో ఇరవై కోట్లు వరకు మోసం చేశారన్నారు. ఈ విధంగా అనేక దేశాల వారిని మోసం చేశారని ఒకేసారి 64 సిమ్‌లతో వీరు కాల్స్ చేస్తున్నారని సీఐడీ డీజీ చెప్పారు. వేలకోట్ల రూపాయలు మోసాల ద్వారా దోచుకున్నారని తెలిపారు. సిమ్ బాక్స్ ద్వారా, మాడ్యూల్స్ ద్వారా వీరు ఆపరేషన్ చేస్తున్నారన్నారు. ఎక్కడ నుంచి కాల్ చేసేది తెలియకుండా మోసాలకు పాలిటెలిగ్రామ్ యాప్ ద్వారా వీరు మోసపూరిత లింక్‌లు పంపిస్తున్నారని అన్నారు. ఫేక్ కేవైసీ చేసి ఈ ముఠా సిమ్ కార్డులు సంపాదిస్తున్నారని చెప్పారు. ఏ సిమ్ ఎప్పుడు ఎలా ఆపరేట్ చేయాలో టెలిగ్రామ్ యాప్ ద్వారా వారికి సంకేతాలు పంపుతారని.. ఇదంతా పెద్ద ఆర్గనైజ్ క్రైంగా జరుగుతుందని వివరించారు. ఇందులో చాలా మందికి భాగస్వామ్యం ఉందన్నారు. కొంతమంది తెలిసి, మరికొందరు తెలియక ఈ ముఠాతో భాగస్వామ్యం అవుతున్నారని.. ప్రజలు కూడా వీటిపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. అజ్ఞాత వ్యక్తులు నుంచి వచ్చే కాల్స్ పట్ల అలెర్టుగా ఉండాలన్నారు. ఒక్క చోటే కూర్చుని అనేక దేశాల ప్రజలను మోసం చేస్తున్నారు. టెలిగ్రామ్ యాప్ ద్వారా వీరు మోసపూరిత లింక్‌లు పంపిస్తున్నారు. ఈ ముఠా ఫేక్ కేవైసీ చేసి సిమ్ కార్డులు సంపాదిస్తున్నారని, ఏ సిమ్ ఎప్పుడు ఎలా ఆపరేట్ చేయాలో టెలిగ్రామ్ యాప్ ద్వారా వారికి సంకేతాలు పంపుతారు. ప్రజలు కూడా వీటిపై అవగాహన పెంచుకోవాలి. అజ్ఞాత వ్యక్తులు నుంచి వచ్చే కాల్స్ పట్ల అలెర్టుగా ఉండాలి అన్నారు. వాయిస్ ఓవర్ ఇంటర్నెట్ ప్రొటోకాల్ (వీవోఐపీ)ను ఉపయోగించుకుని ఇంటర్నేషనల్ కాల్స్‌ను సిమ్ బాక్స్ అనే పరికరంలోకి పంపిస్తారు. ఒక్కో సిమ్ బాక్స్‌లో భారతదేశానికి సంబంధించిన వందల సిమ్‌లు ఉంటాయి. ఇవన్నీ ఈ ముఠాలు నకిలీ చిరునామాలు, గుర్తింపు కార్డుల వివరాలతో సేకరించినవే. ఈ సిమ్ బాక్సుల ద్వారా అంతర్జాతీయ కాల్స్ అన్నీ లోకల్ సిమ్ నుంచి బయటకు వెళ్తాయి. కాంబోడియా, చైనా సహా పలు దేశాల్లో పాగా వేసిన అంతర్జాతీయ సైబర్ నేర ముఠాలు అక్కడి నుంచి మన దేశంలోని అనేక మందికి ఫోన్ కాల్స్ చేసి సైబర్ మోసాలకు పాల్పడుతున్నాయి. డిజిటల్ అరెస్టుల పేరిట బెదిరింపులు సహా ఇతరత్రా నేరాలు చేస్తున్నాయి. సిమ్‌బాక్సుల వల్ల సైబర్ నేరగాళ్లు విదేశాల నుంచే కాల్స్ చేసినప్పటికీ మన దేశంలోని బాధితులకు అవి స్థానిక ఫోన్ నంబర్లలానే కనిపిస్తాయి. దీనివల్ల అసలైన నేరగాళ్లు దర్యాప్తు సంస్థలకు చిక్కకుండా మోసగిస్తున్నారు.



## బిసి స్కాలర్ షిప్‌లకు రూ.90 కోట్లు మంజూరు

### మంత్రి సవిత

**విజయవాడ,డిసెంబరు 26,ప్రభాతవార్తప్రతి నిధి:** వివిధ ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ విద్యా సంస్థల్లో చదువుతున్న బీసీ విద్యార్థులకు కూటమి ప్రభుత్వం తీపి కబురు అందించింది. 2025-26 విద్యా సంవత్సరంలో భాగంగా పీఎం యశ్వసి పథకం కింద రెండో విడతగా కళాశాల, పాఠశాల ఓబీసీ, ఈబీసీ, డీఎన్టీ విద్యార్థులకు స్కాలర్ షిప్పుల నిమిత్తం రూ.90.50 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసిందని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు . ఈ మేరకు శుక్రవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. 2025-26 విద్యా సంవత్సరానికి గానూ రెండో విడతగా రూ.69.40కోట్లను పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్‌ల కోసం కూటమి ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఈ నిధులు కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో చదువుతున్న బీసీ, ఈబీసీ, డీఎన్‌టీ విద్యార్థులకు ఉపకరిస్తాయన్నారు. ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్‌లకు గానూ రెండో విడతగా రూ. 21.10 కోట్లను విడుదల చేసిందన్నారు. పాఠశాల స్థాయిలో చదువుతున్న అర్హులైన బీసీ, ఈబీసీ, డీఎన్‌టీ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందించనున్నామన్నారు. రెండు ఉత్తర్వుల ద్వారా రూ.90.50 కోట్లను వెనుకబడిన తరగతుల విద్యార్థుల విద్యాభివృద్ధికి ప్రభుత్వం కేటాయించిందన్నారు. బీసీ బిడ్డల విద్యకు సీఎం చంద్రబాబునాయుడు అధిక ప్రాధాన్యమిస్తున్నారన్నారు. ఇందులో భాగంగా పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌లు, ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్ లు మంజూరు చేశారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా తల్లికి వందనం పథకం నిధులు అన్ని వర్గాలతో పాటు బీసీ విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమ చేశామన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర కిట్లు పంపిణీ చేశామన్నారు. మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా సన్నబియ్యంతో భోజనం అందిస్తున్నామన్నారు. ఇంటర్ విద్యార్థులకు కూడా మధ్యాహ్నభోజన పథకాన్ని అమలు చేస్తున్నామన్నారు. బీసీ విద్యార్థులకు ఉన్నత విద్యావకాశాలు కల్పించాలన్నదే సీఎం చంద్రబాబు నాయుడు లక్ష ్యమని మంత్రి సవిత ఆ ప్రకట నలో తెలిపారు.

## వారం - వర్జ్యం

27-12-2025, శనివారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
పుష్యమాసం, దక్షిణాయణం
హేమంత ఋతువు, శుక్లపక్షం
సప్తమి మ.1.10
పూర్వాభాద్ర ఉ.9.09, మూల కార్తె
వర్జ్యం : సా.4.58-6.43
దు.ఉ.6.35-8.08
రాహుకాలం - ఉ.9.00-10.30

## వార్తాఫలం

**మేషం:** ఉద్యోగస్తులు తమ తోటివారితో అప్రమత్తతో మెలగాలి. ఆర్థిక పరిస్థితి మెరుగు పడుతుంది. వృత్తి, వ్యాపారాలు విస్తరిస్తారు.

**వృషభం:** పెదవి దాటడం వలన ఇబ్బందులను కొని తెచ్చుకోవడం అవుతుంది. దూర ప్రాంతాల నుండి ఆహ్వానాలు అందుకుంటాయి.

**మిథునం:** డాక్యుమెంట్లు, భూమి స్థిరాస్తుల సంబంధితమైన రావలసిన సౌకర్యాలు, ధనప్రాప్తి ఇబ్బందులకు గురిచేస్తారు. వాహన సౌఖ్యం.

**కర్కాటకం:** సంకుచిత మనస్తత్వము గల వ్యక్తులకు దూరంగా ఉండండి. మౌనం శ్రీరామరక్ష అవుతుంది. ఆభరణాలు కొనుగోలు చేస్తారు.

**సింహం:** ఓర్పు, నేర్పులు మేలు చేస్తాయి. యుక్తితో సమస్యల వలయాల నుండి బయట పడతారు. సోదరుల కలయిక.

**కన్య :** సన్నిహితుల సహాయంతో నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. ఇంటా బయట అనుకూలం. వస్త్రలాభం.

**తుల :** జీవిత భాగస్వామితో స్వల్ప విభేదాలు ఏర్పడతాయి. దీర్ఘ కాలిక ఋణాలు తీరుతాయి. నూతన ఒప్పందాలు కుదురుతాయి.

**వృశ్చికం:** కుటుంబంలో శుభకార్యాల ప్రస్తావన ఉంటుంది. ఇతరుల విషయంలో జోక్యం వద్దు. వాహన సౌలభ్యం కలదు.

**ధనుస్సు:** సమయస్ఫూర్తితో మెలగడం చెప్పదగినది. బంధువుల నుండి మాట సహాయం అందుకుంటారు.

**మకరం :** వివాదాలకు, కోపతాపాలకు దూరంగా ఉండండి. ఆహార నియమాలు పాటించండి. ప్రకృతి వైద్యం మేలుచేస్తుంది.

**కుంభం:** చిన్ననాటి మిత్రుల నుండి శుభ వార్తలు అందుకుంటారు. భూ వివాదాలు పరిష్కార దశకు చేరుకుంటాయి.

**మీనం:** ఉద్యోగాలలో ఎదురైన ఆటంకాలను అధిగమిస్తారు. కోర్టుకేసుల నుండి బయట పడతారు. ఆరోగ్యం పట్ల మెలుకువ అవసరం.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

27-12Pg3exHMNWJQEKCRP-3-VJA_27-12Pg3exHMNWJQEKCRP.qxd--26/Dec/25--11:32 PM--Page-1



## ఆదోని మెడికల్ కాలేజీ టెండర్‌పై ప్రభుత్వ వివరణ

**కిమ్స్ ఆసుపత్రి ఎలాంటి బిడ్ వేయలేదని మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పష్టీకరణ**

**విజయవాడ,డిసెంబరు 26,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో పబ్లిక్‌ప్రైవేట్ పార్టనర్‌షిప్ పద్ధతిలో నిర్మించ తలపెట్టిన ఆదోని మెడికల్ కాలేజీ టెండర్ వ్యవహారంలో నెలకొన్న అనుమానాలను ప్రభుత్వం తొలిగించింది.ఈ అంశంపై మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పష్టతను ఇచ్చారు. ఆదోని కాలేజీకి కిమ్స్ ఆసుపత్రి బిడ్ వేసిందని తొలుత ప్రకటించిన ప్రభుత్వం, ఆ తర్వాత కిమ్స్ యాజమాన్యం దానిని ఖండించడంతో ఇరకాటంలో పడింది. ఈ వివాదంపై తాజాగా మంత్రి సత్యకుమార్ స్పష్టతనిచ్చారు. కిమ్స్ ఆసుపత్రిలో పనిచేస్తున్న డాక్టర్ ప్రేమ్ చంద్ షా తన వ్యక్తిగత హోదాలో టెండర్ దాఖలు చేశారని, అయితే ఆయన కిమ్స్‌లో పనిచేస్తుండటంతో సంస్థే బిడ్ వేసిందని పొరపాటు పడ్డామని మంత్రి వివరించారు. "ఇది కేవలం ఒక చిన్న కమ్యూనికేషన్ గ్యాప్ మాత్రమే. కిమ్స్ సంస్థ ఎలాంటి బిడ్ వేయలేదు" అని ఆయన స్పష్టం చేశారు. అంతకుముందు, ప్రభుత్వం నాలుగు మెడికల్ కాలేజీలకు టెండర్లు పిలవగా, ఒక్క ఆదోని కాలేజీకి మాత్రమే కిమ్స్ నుంచి బిడ్ వచ్చిందని ప్రచారం జరిగింది.

## బాక్సింగ్ క్రీడలతో శారీరక దృఢత్వంతోపాటు మానసిక ఆత్మస్థైర్యం పెంపు

**కాగజ్‌నగర్ రూరల్, డిసెంబరు 26, ప్రభాతవార్త:** బాక్సింగ్ క్రీడలతో శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఆత్మస్థైర్యం పెంపొందిస్తాయని కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ చిత్తరంజన్ అన్నారు. శుక్రవారం బాక్సింగ్ డే సందర్భంగా కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ పట్టణంలోని నేషనల్ ఫిట్‌నెస్ జిమ్, శివ బాక్సింగ్ క్లబ్‌లను సందర్శించారు. యువతకు ఉచిత బాక్సింగ్ శిక్షణ అందిస్తూ రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు సిద్ధం చేస్తున్న కానిస్టేబుల్ నివాస్‌ను ఈ సందర్భంగా ఎస్పీ అభినందించారు. ముందుగా అడిషనల్ ఎస్పీ హనుమాన్ చిత్రపటానికి పూలమాల వేసి, కొబ్బరికాయ కొట్టి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం క్లబ్‌లో శిక్షణ పొందుతున్న బాక్సర్లను పరిచయం చేసుకుని, బాక్సింగ్ పోటీలను ప్రారంభించారు.

# రౌడీయిజం చేస్తే రాష్ట్ర బహిష్కరణ



తిరుపతిలో నూతన పోలీస్ జిల్లా కార్యాలయం ప్రారంభిస్తున్న సిఎం చంద్రబాబు

**సాంకేతిక పరిజ్ఞానంతో నేరనియంత్రణ అవసరం తిరుపతిలో కొత్త డిపిఒ ప్రారంభోత్సవంలో సిఎం చంద్రబాబు**

**తిరుపతి,డిసెంబర్ 26ప్రభాతవార్తప్రతినిధి:** రకరకాల మనస్తత్వాలతో నేరాలు చేసే నేరస్తులకంటే పోలీసులు తెలివిగా వ్యవహరించాలని ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు అన్నారు. వారెన్ని డ్రామాలు ఆడినా సాంకేతిక పరిజ్ఞానంతో పట్టుకోవాలని ఆదేశించారు. ఈ విషయంలో విజిబుల్ పోలీసింగ్ ఇన్విజిబుల్ పోలీస్ అనే విధానాన్ని అనుసరించాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. సాంకేతికతను వాడుకుని నేరనియంత్రణ చేయాలన్నారు. డ్రోన్ల ద్వారా పెట్రోలింగ్ నిర్వహించి విజువల్ ఆధారాలను సేకరించాలని సూచించారు. అత్యాధునిక సౌకర్యాలతో నిర్మించిన తిరుపతిజిల్లా పోలీసు కార్యాలయం (డిపిఒ)నూతన భవనాలను రాష్ట్రహోంమంత్రి వంగలపూడి అనిత, డిజిపి హరీశ్‌కుమార్‌గుప్తా,అనంతపురం డిఐజి షిమోషిబాజ్‌పేయి, తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడుతో కలసి సిఎం చంద్రబాబు నూతన జిల్లా పోలీసు కార్యాలయాన్ని శుక్రవారం మధ్యాహ్నం ప్రారంభించారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ రౌడీయిజం చేస్తే రాష్ట్ర బహిష్కరణే శరణ్యమన్నారు. రాజకీయ ముసుగులో నేరాలు చేస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు.ప్రపంచంలోనే అతిపెద్ద ధార్మికక్షేత్రానికి తిరుపతికి,తిరుమలకు వచ్చే భక్తులకు భరోసాగా పోలీసులు నిలవడం అభినందనీయమన్నారు. ప్రపంచం నలుమూలల నుండి వచ్చే భక్తులకు భద్రతాభావం కల్పించాల్సిన బాధ్యత పోలీసులదేనని సిఎం స్పష్టం చేశారు. కలియుగవైకుంఠం శ్రీవేంకటేశ్వరస్వామి నెలకొన్న ఈ ప్రాంతం పవిత్రతను కాపాడేలా పోలీసులు చర్యలు చేపట్టాలని సిఎం ఆదేశించారు. వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని పోలీసు వ్యవస్థ అత్యంత అప్రమత్తంగా వుండాలని నిర్దేశం చేశారు.భక్తులకు ఎక్కడా చిన్న అసౌకర్యం కలగకుండా, ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జాగ్రత్త వహించాలని ఆదేశాలిచ్చారు.

- రౌడీయిజంపై ఉక్కుపాదం:సిఎం

రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణ విషయంలో రాజీ పడేప్రసక్తే లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు తిరుపతిలో హెచ్చరించారు. కొందరు రాజకీయ ముసుగులో ఉండి రౌడీయిజం చేస్తామంటే కుదరదని, సెటిల్‌మెంట్లు బెదిరింపులకు పాల్పడితే కఠినంగా వ్యవహరిస్తామని అన్నారు. రౌడీయిజం చేసే వారిని రాష్ట్రబహిష్కరణ చేస్తామని హెచ్చరిక చేశారు. అక్రమాలకు పాల్పడితే సొంత పార్టీ వారైనా సరే జైలుకు పంపిన చరిత్ర తమదని సిఎం వ్యాఖ్యానించారు. గత ప్రభుత్వ హయాంలో శాంతిభద్రతలు పూర్తిగా భ్రష్టుపట్టాయని, తిరుమల పవిత్రతను దెబ్బతీశారని విమర్శించారు. రోడ్లు బ్లాక్‌చేయడంచ రప్పారప్పా లాడించడం ఏమిటో ఎవరికీ అర్ధంకావడం లేదన్నారు. బంగారుపాళ్యంలో మామిడికాయలు తొక్కించారని, గుంటూరులో ఓ వ్యక్తిని కాన్వాయ్‌క్రింద తొక్కించి పొదల్లో పారేసి పోయారని అన్నారు. ఈ తరహా ఘటనల్లో సిసికెమెరాలు, డ్రోన్ల ద్వారా ఆధారాలు పెట్టుకోవాలన్నారు.

## ప్రజా క్షేమమే ముందు...రాజకీయాలు తర్వాత

**- ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్**



**విజయవాడ, డిసెంబర్ 26:** మాత్రమే కాదు...అసలైన రాజనీతిజ్ఞుడు.ప్రతి పక్ష నాయకుడూ ఆయన నుంచి స్ఫూర్తి పొందాలని ఏపీ డీ సీం పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.. ఆయన మార్గనిర్ధేశకత్వం లోనే ప్రజాక్షేమం ముందూ...రాజకీయాలు ఆ తర్వాతే అని గట్టిగా నమ్ముతున్నా...ఇదే మన ధర్మం' అని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వాజ్‌పేయి జన్మదినం సందర్భంగా ఎక్స్ వేదికగా చేసిన ట్విట్ లో వ్యాఖానించారు.'అధికారం ఆట కొనసాగుతూ ఉంటుందని, పార్టీలు వస్తాయని,పోతాయని,ప్రభుత్వాలు ఏర్పడతాయి,కూలతాయని...కానీ దేశం ఉండాలని, ఆ దేశంలో ప్రజాస్వామ్యం అమరంగా ఉండి తీరాలని వాజ్‌పేయి 1996లో పార్లమెంట్ ప్రసంగంలో చెప్పిన మాటలు ఎప్పుడూ గుర్తుంటాయి. అవి ప్రజాస్వామ్య విలువల పట్ల మన భాధ్యతను ఎప్పుడూ గుర్తు చేస్తుంటాయి. ఆయన పోఖ్రాన్ అణుపరీక్షలతో భారత్ వ్యూహాత్మక బలాన్ని నొక్కి చెప్పారు. స్వర్ణ చతుర్భుజి,జాతీయ రహదారులతో దేశవ్యాప్తంగా అనుసంధానం పెంచారు. ఆయన ఆదర్శాలు ఇప్పటికే మార్గనిర్ధేశం చేస్తున్నాయి'అని పవన్ కళ్యాణ్ కొనియాడారు.

## వీఆర్ఎస్ నిర్ణయం వెనక్కి తీసుకుంటే తీవ్ర చర్యలుంటాయని బెదిరించారు

**మాజీ ఐపిఎస్ ప్రవీణ్ ప్రకాష్ వెల్లడి**

**విజయవాడ,డిసెంబరు 26,ప్రభాతవార్త ప్రతినిధి** :'స్వచ్ఛంధ పదవీ విరమణ(వీఆర్ఎస్) ధరఖాస్తు వెనక్కి తీసుకుంటే తీవ్ర పరిణామాలుంటాయని అప్పట్లో తనను కొందరు బెదిరించారని మాజీ ఐఎఎస్ అధికారి ప్రవీణ్ ప్రకాష్ తెలిపారు. ఒక యూ ట్యూబ్ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ విషయం చెప్పారు. 'సర్వీసు నుంచి వెళ్ళిపోయావు అదే నీకు శిక్ష.మళ్ళీ సర్వీసులోకి వస్తానని డ్రామాలు చేస్తే...తీసుకుంటాం.కానీ ఆ తర్వాత తీవ్రమైన చర్యలుంటాయి' అని కొందరు తనకు బెదిరింపు సందేశాలు పంపినట్లు ప్రవీణ్ ప్రకాష్ పేర్కొన్నారు. అయితే వారి పేర్లను ఆయన వెల్లడించలేదు. బెదిరింపులు వచ్చిన తర్వాత కూడా తాను అప్పటి సిఎస్ నీరబ్‌క ఉమార్ ప్రసాద్‌ను కలిసి తన మనసులో మాట చెప్పానని,ఆయన కూడా వద్దని సలహా ఇచ్చారని తెలిపారు. నువ్వు ధరఖాస్తు చేసినా ప్రభుత్వం తిరస్కరిస్తుందని నీరబ్‌కుమార్ తనతో చెప్పినట్లు ప్రవీణ్ ప్రకాష్ పేర్కొన్నారు. '2024లో కూటమి అధికారం లోకి వచ్చాక నాకు పోస్టింగ్ ఇవ్వలేదు. 21 రోజుల్లోనే వీఆర్ఎస్‌కి ధరఖాస్తు చేశాను. నా నిర్ణయం మా ఇంట్లో ఎవరికీ ఇష్టం లేదు. నా తల్లిదండ్రులు తీవ్ర ఒత్తిడికి లోనయ్యారు. అది చూడలేక వీఆర్ఎస్ నిర్ణయాన్ని పున :పరిశీలించాలని ప్రభుత్వాన్ని కోరాలనుకున్నాను' అని తెలిపారు.

## బాలకళాకారుల నృత్యప్రదర్శనలు అద్భుతం

**తిరుపతి,డిసెంబర్ 26ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీకృష్ణనటరాజాలయం తిరుపతి నృత్యదర్శకుడు కొండారవి నేతృత్వంలో మహతి కళాక్షేత్రంలో బాకళాకారుల నృత్యప్రదర్శనాలు అద్భుతంగా సాగుతున్నాయి. శుక్రవారం సాయంత్రం మహతి కళాక్షేత్రంలో శాస్త్రీయ జానపద నృత్యాలు ఎంతో ఆహ్లాదంగా జరిగాయి. నృత్యోత్సవాల్లో పాల్గొన్న చిన్నారులందరికీ బాలపురస్కారాలు, జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు.ఈనాటి బాలకళాకారులే రేపటి ప్రతిభగల కళాకారులుగా ఎదుగుతారని, మన సంస్కృతి సంప్రదాయాలు ఈ నృత్యోత్సవాల ద్వారా ప్రేక్షకులకు తెలియజేస్తున్నారని తిరుపతి జిల్లా రవాణాశాఖ అధికారి కొర్రపాటి మురళీమోహన్ తెలిపారు.రాయలసీమ రంగస్థలి కళాసంస్థ ఛైర్మన్ గుండాల గోపీనాధరెడ్డి ,కెవన్ రాజ తదితరులు పాల్గొన్నారు.

## పిపికి కేంద్ర సాయం - ఆరోగ్యమంత్రి సత్యకుమార్‌యాదవ్

**కేంద్ర మంత్రి జెపి నడ్డాకు లేఖ**

**విజయవాడ,డిసెంబరు 26,ప్రభాతవార్తప్రతినిధి:** వైద్య కళాశాలలు, ఆరోగ్య సేవల రంగంలో ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్య (పీపీపీ) విధానానికి సహకారం అందిస్తామని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది,ఈ విధానాన్ని కేంద్రం ఇప్పటికే అనుసరిస్తుంది.వైద్యరంగంలో పీపీపీ విధానం ప్రాధాన్యాన్ని, కేంద్రం అమలు చేస్తున్న పథకాల్ని వివరిస్తూ రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ మంత్రి జేపీ నడ్డా ఒక లేఖ రాశారు.పీపీపీ విధానంలో చేపట్టే ప్రాజెక్టుల్లో కేంద్రం మూలధన వ్యయంలో 30 నుంచి 40 శాతం వరకు , నిర్వహణ వ్యయంలో 25 శాతం వరకు నిధులుగా అందిస్తుందని వెల్లడించారు. ఇప్పటికే ఉన్న వైద్య కళాశాలల ఆధునికీకరణ, కొత్త వాటి నిర్మాణం, సహా ఆరోగ్యరంగ మౌలిక వసతుల అభివృద్ధికి వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ (వీజీఎఫ్) కింద ఈ సంవత్సరం అక్టోబరు నుంచి ఇప్పటివరకు రూ.2వేల కోట్ల విలువైన ప్రాజెక్టులను కేంద్రం సూత్రప్రాయంగా ఆమోదించినట్లు ఆయన పేర్కొన్నారు.

ఈ రంగంలో పీపీపీ విధానాన్ని కేంద్రం ప్రోత్సహిస్తోందని, రాష్ట్ర ప్రభుత్వాలూ దీన్ని అందిపుచ్చుకోవాలని ఆయన సూచించారు. అందులోని ముఖ్యాంశాలను వైద్య, ఆరోగ్యశాఖ మీడియాకు విడుదల చెసింది. దేశంలో ఇప్పటివరకు రూ.2వేల కోట్లతో ప్రాజెక్టులు వీజీఎఫ్ కింద ఆమోదించినట్లు ఆయన వివరించారు. వైద్య కళాశాలల నిర్మాణం, ఆసుపత్రుల అభివృద్ధి, రోగనిర్ధారణ సేవలు, సంచార వైద్యం, డయాలసిస్‌లను పీపీపీ విధానంలో ప్రారంభించామన్నారు. 20 రాష్ట్రాల్లో 919 డయాలసిస్ సెంటర్లు పీపీపీ పద్ధతిలో నడుస్తున్నాయన్నారు. పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా వైద్య కళాశాలల నిర్మాణం, ఆసుపత్రుల ఆధునికీకరణ, ఇతర మౌలిక సదుపాయాల కల్పనతో పాటు నాణ్యమైన క్లినికల్, నాన్‌క్లినికల్ సేవలు అందించినట్లు నడ్డా తెలిపారు.

## ఆ మూడురోజులు భక్తుల రద్దీనియంత్రణ సాధ్యమేనా?

**- టోకెన్లు లేకున్నా కొండకు రమ్మని పిలుపు! - సౌకర్యాలపై కనిపించని వ్యూహాత్మక అడుగులు**

**ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:** సాధారణరోజుల్లోనే తిరుమలకు లక్షమందివరకు భక్తులు చేరుకొంటున్న తరుణంలో పవిత్రమైన వైకుంఠద్వార దర్శనాలకు మరింతమంది భక్తులు రెట్టింపుసంఖ్యలోతరలివచ్చే అవకాశం స్పష్టమవుతోంది. భారీగా భక్తులు డిసెంబర్ 30,31,జనవరి 1తేదీల్లో ఆ మూడురోజులు ప్రత్యేక పర్వదినాల్లో తిరుమలపైకి చేరుకుంటే అందరికీ దర్శనం చేయించకపోయినా కనీసం కొండంతా నిరీక్షించే భక్తజనానికి వసతి,అన్నప్రసాదాలు, తాగునీరు సౌకర్యాలు కల్పించడం మాత్రం మాటల్లోచెప్పలేనిదికాదనేది అంచనావేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆ మూడురోజులు తిరుపతి అలిపిరిలోనే టోకెన్లు లేని భక్తులను కొంతవరకు నియంత్రించడం తప్పనిసరి పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఇప్పటికే ఈ యేడాధి ఆఖరులో ఆపదమొక్కులవాడు అనాధరక్షకుడు తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనం కోసం భారీగా తరలిరావడంతో ఏడుకొండలు జనసంద్రంగా మారింది.వచ్చిన వారంతా ఎక్కడబడితే అక్కడ నిరీక్షిస్తుండటం, ఆలయం ముందు ప్రత్యేక షెడ్లలో తలదాచుకోవడం, ఆలయం వెలుపల క్యూలైన్లలో పడిగాపులు కాస్తుండటం కనిపిస్తోంది. ఇప్పటికే చాలావరకు వీరికి సేవలందించలేక శ్రీవారి సేవకులు, సిబ్బంది కొంత ఇబ్బందులు పడుతున్నారు. అలాంటిది మరో మూడురోజుల్లో మొదలుకానున్న పవిత్రమైన వైకుంఠ ఏకాదశి(30వతేదీ), ద్వాదశి(31న),త్రయోదశి(జనవరి 1నూతన ఆంగ్ల సంవత్సరం)రోజుల్లో ఆన్‌లైన్‌లో ఇడిప్‌లో జారీచేసిన 1.89లక్షల టోకెన్లు అందుకున్న భక్తులకు మాత్రమే ఆలయంలోనికి అనుమతిఉంటుందని టిటిడి అధికారులు ప్రకటించారు. మరీ టోకెన్లు లేకున్నా తిరుమలకు ఊహించలేనంత మంది భక్తులు తమిళనాడు, కర్నాటక తెలుగురాష్ట్రాల నుండి తరలివస్తే వారికి ఎక్కడ సదుపాయాలు కల్పించగలరనేది కూడా టిటిడి పాలకమండలి, టిటిడి అధికారులు సమాలోచనలు చేస్తున్నా సాధ్యపడదనేది టిటిడి ఉద్యోగుల వాదనలు. మరీ తొలిమూడురోజులు ఎటువంటి టోకెన్ లేని భక్తులను తిరుమలకు రమ్మని పిలవడం శుభపరిణామమే అయినా వారికి దర్శనాలు కల్పించలేమనేది స్పష్టంగా తెలియజేయాల్సిన అవసరం కూడా ఉంది. ఇందుకు తిరుపతి అలిపిరి ప్రవేశద్వారం, కాలినడక మార్గాలు, సప్తగిరి తనిఖీకేంద్రం ప్రాంతాల్లో టిటిడి ఉద్యోగులు, పోలీసులు, విజిలెన్స్‌సిబ్బంది జాగరూకతతో వ్యవహరించి భక్తులకు అవగాహన కల్పించడం ఇప్పుడు ముందున్న ప్రధాన సమస్య. మరీ అలా సామాన్యభక్తులు సంయమనంతో వ్యవహరిస్తారా అనేది కూడా టిటిడి అధికారుల్లో ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ప్రతి ఏటా వైకుంఠ ఏకాదశి,ద్వాదశి రోజుల్లో తిరుమలకు భారీగా చేరుకుంటే భక్తులు తమను దర్శనాలకు అనుమతించడంలేదని నిరసనలు తెలియజేసిన సందర్భాలు ప్రతి ఏడాది చవిచూస్తున్నవే. అలాంటిది అందరినీ తిరుమలకు రమ్మని పిలిస్తే మరీ టోకెన్ లేని భక్తులకు దర్శనాల మాటమాత్రం దేవుడెరుగని వదిలేస్తారా?లేక వ్యూహాత్మకంగా, ప్రణాళికాబద్ధంగా కదులుతారా అనేది మరో మూడురోజుల్లో తేలిపోనుంది. అయితే టిటిడి అధికారులు, పోలీసు అధికారులు కూడా ఈ ఏడాది జనవరిలో తిరుపతిలో వైకుంఠద్వార దర్శన టోకెన్లు జారీ సమయంలో చోటుచేసుకున్న అవాంఛనీయ ఘటనలతో పూర్తిగా ఆన్‌లైన్‌లోనే దర్శనం.

## భీమవరం నూతన డీఎస్పీగా రఘువీర్ విష్ణు బాధ్యతల స్వీకరణ

**- డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజుతో మర్యాదపూర్వక భేటీ**

**విజయవాడ,డిసెంబరు 26,ప్రభాతవార్తప్రతినిధి:** పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం సబ్‌డివిజన్ నూతన డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (డీఎస్పీ)గా రఘువీర్ విష్ణు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆయన ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ స్పీకర్, ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజును భీమవరంలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఉండి నియోజకవర్గంలో శాంతిభద్రతల పరిరక్షణపై రఘురామ దిశా నిర్దేశం చేశారు. శాంతిభద్రతల విషయంలో ఎలాంటి ఒత్తిళ్లకు లొంగకుండా, రాజీ పడకుండా పనిచేయాలని ఆయన స్పష్టం చేశారు. శుక్రవారం ఉదయం బాధ్యతలు స్వీకరించిన వెంటనే డీఎస్పీ రఘువీర్ విష్ణు, డిప్యూటీ స్పీకర్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నియోజకవర్గ భద్రతపై వీరి మధ్య చర్చ జరిగింది. నేరాల నియంత్రణ, పర్యవేక్షణ కోసం ఉండి నియోజకవర్గం మొత్తం సీసీ కెమెరాల నిఘా నీడలోకి తీసుకురావాలని నిర్ణయించినట్లు రఘురామ తెలిపారు. "నియోజకవర్గం మొత్తం సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తాం. శాంతిభద్రతల విషయంలో రాజీ పడొద్దు" అని డీఎస్పీకి స్పష్టం చేశారు. దీంతో పాటు భీమవరం పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణపైనా చర్చించారు. నూతన డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన రఘువీర్ విష్ణు గతంలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ)లో పనిచేశారు. అంతేకాకుండా ఐక్యరాజ్యసమితి శాంతి పరిరక్షక దళంలో భాగంగా కొసావోలో కూడా సేవలు అందించిన అనుభవం ఆయనకుంది. నిన్నటి వరకు పనిచేసిన డీఎస్పీ జయసూర్యను డీ సీఎం పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు ప్రభుత్వం బదిలీ చేసింది .

## బివి ఛానల్, 13 షేర్ ఛానల్ ఆధునీకరణ పనులకు రంగం సిద్ధం

**విజయనగరం , డిసెంబర్ 26 (ప్రభాతవార్త ప్రతినిధి )** గజపతినగరం నియోజకవర్గంలో సుదీర్ఘకాలంగా సాగునీటి తరలింపునకు ఇబ్బందిగా మారిన బివి ఛానల్, 13 షేర్ చానల్ ఆధునీకరణ పనులకు రంగం సిద్ధమైంది. సుదీర్ఘకాలంగా పెండింగ్ లో ఉన్న కెనాల్ ఆధునీకరణ పనులను ఈ ప్రాంత ప్రజల కోరిక మేరకు పరిష్కరించేందుకు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ నీటిపారుదల శాఖ అధికారులతో కలిసి గజపతినగరం మండలం గంగచోళ్లపెంట గ్రామపంచాయతీ పరిధిలోని పట్రువాడ గ్రామం వద్ద సాగునీటిని తరలించే ఇరిగేషన్ ఛానల్ ను శుక్రవారం మంత్రి అధికారులతో కలిసి పరిశీలించారు. ఇరిగేషన్ కెనాల్ అలైన్మెంట్ ను మార్చి, కేనాల్ ను ఆధునికరించి బివి ఛానల్ ద్వారా సాగయ్యే 11 వందల ఎకరాలకు, 13 షేర్ ఛానల్ ద్వారా 14 వందల ఎకరాలకు ఆయకట్టును స్థిరీకరించే ప్రయత్నాలను మంత్రి ప్రారంభించారు. ఈ రెండు చానళ్లను ఆధునీకరించడం ద్వారా ఈ ప్రాంతంలో సాగునీటి ఇబ్బందులను రూపుమాపి రెండవ, మూడవ పంటలకు సాగునీరు అందించే అవకాశం కలుగుతుందని, ఈ పనులకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి అనుమతి సాధించి త్వరగా పరిష్కరిస్తామని తెలిపారు.

# తిరుమల సమాచారం

## మానసిక సంతృప్తే నిజమైన సంతోషం

**- ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్‌భగవత్**



**తిరుమల, డిసెంబర్ 26ప్రభాత వార ప్రతినిధి:** మనిషికి నిజమైన సంతోషం మానసిక సంతృప్తిలోనే ఉందని ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్‌సింగ్ భగవత్ అన్నారు. మనిషికి సుఖ దు:ఖాలు తాత్కాలికమేనని మనసుకు తృప్తిలేకపోతే ఆనందం ఉండదని అభిప్రాయపడ్డారు. శుక్రవారం ఉదయం తిరుమలలో ఆలయం వద్దకు చేరుకున్న మోహన్‌భగవత్‌కు టిటిడి ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్, అదనపు ఇఒ వెంకయ్యచౌదరి ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం స్వాగతం పలికారు. తొలుత ధ్వజస్తంభానికి నమస్కరించి శ్రీవారిని దర్శించుకున్నారు. మొక్కులు చెల్లించుకున్నారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. టిటిడి ఇఒ సింఘాల్ ,అర్చకులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. తిరుపతిలో జరిగే కార్యక్రమానికి విచ్చేసిన ఆర్ఎస్ఎస్ చీఫ్ శుక్రవారం ఉదయం శ్రీవారిని దర్శించుకుని వెళ్ళారు.

## అందరిపై శ్రీవారి ఆశీస్సులుండాలి: ప్రముఖులు



**తిరుమల,డిసెంబర్ 26ప్రభాతవార్తప్రతినిధి:** రాబోయే నూతన ఆంగ్ల సంవత్సరంలో కలియుగప్రత్యక్షదైవమ్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులు ప్రజలందరిపై కలగాలని ,అందరూ సుఖసంతోషాలతో ఉండాలని ప్రముఖులు కోరుకున్నారు. శుక్రవారం తమిళనాడు గవర్నర్ టి.రవి,ఏపి డిజిపి హరీశ్‌కుమార్‌గుప్త, మాజీక్రికెటర్ వెంకటేశ్‌ప్రసాద్, బిసిసిఐ ఉపాధ్యక్షుడు రాజీవ్‌శుక్ల వేర్వేరుగా ఉదయం విఐపి బ్రేక్ దర్శనాల సమయంలో వెంకన్నను దర్శించుకున్నారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. టిటిడి ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## జనసంద్రంగా తిరుమల - సర్వదర్శనానికి 26 గంటలు



**తిరుమల,డిసెంబర్ 26ప్రభాతవార్తప్రతినిధి:** వారాంతం సెలవులు ,ధనుర్మాసంలో శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనానికి భక్తులతో తిరుమల జనసంద్రంగా మారింది. శుక్రవారం ఉదయానికి భక్తులు పోటెత్తుతున్నారు. భారీగా భక్తులు దేశంనలుమూలల నుండి తరలిరావడంతో తిరుమలలోని వైకుంఠమ్ 1,2 క్యూకాంప్లెక్స్‌లు,నారాయణగిరి షెడ్లు నిండిపోయాయి. ఆలయం వెలుపల క్యూలైన్లు మూడుకిలోమీటర్లు శిలాతోరణం వరకు చేరాయి.శ్రీవారి సాధారణ సర్వదర్శనానికి 26గంటలు సమయం పడుతోంది. టైమ్‌స్లాట్ టోకెన్లు భక్తులకు 10గంటలు సమయం పడుతుండగా ప్రత్యేక ప్రవేశ దర్శనాల భక్తులకు ఏడు గంటలు సమయం కేటాయిస్తున్నారు. పెరిగిన విపరీత రద్దీతో తిరుమలలో శ్రీవారి సేవకులతో భక్తులకు నిరంతరాయంగా అన్నప్రసాదాలు, పాలు, టీ పంపిణీ చేస్తున్నారు. సాయంత్రం వరకు 43వేలమంది భక్తులకు మహాలఘు దర్శనం చేయించారు.

## భారీగా పెరిగిన చికెన్, కోడిగుడ్ల ధరలు

**- డిమాండ్‌కు తగ్గ ఉత్పత్తి లేకపోవడంతో పెరిగిన ధరలు**

**విజయవాడ,డిసెంబరు 26,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో కోడిగుడ్ల ధరలు భారీగా పెరిగాయి. అదే రీతిలో కోడి మాంసం ధరలు రోజు రోజుకు ప్రియంగా మారుతున్నాయి. మార్కెట్‌లో డిమాండ్ ఒక్కసారిగా పెరగడం,ఫీడ్ ధరలు అధికమవడం,రవాణా ఖర్చులు పెరగడం వంటి కారణాలతో కోడి మాంసం ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. ఈ ధరల పెరుగుదల సామాన్య ,మధ్యతరగతి ప్రజలపై ఆర్థికంగా తీవ్ర ప్రభావం చూపుతోంది. గతంతో పోలిస్తే కిలో కోడి మాంసం ధరలు గణనీయంగా పెరగగా,కోడిగుడ్ల ధరలు కూడా మరింత భారంగా మారాయి. ధరల పెరుగుదల కారణంగా మధ్యతరగతి కుటుంబాలు చికెన్ కొనేందుకు భయపడుతున్నారు.రాబోయే రోజుల్లో ధరలు మరింత పెరిగే అవకాశముందని వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వరుసగా పండుగలు రావడంతో చికెన్,గుడ్డుకు ఒక్కసారిగా భారీ డిమాండ్ పెరగడంతో పాటు డిమాండ్‌కు తగినంత ఉత్పత్తి లేకపోవడం వల్ల గత నెల రోజులుగా ధరలు విపరీతంగా పెరిగాయని వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. వచ్చే నెలలో సంక్రాంతి పండుగ ఉండటంతో మరో నెల రోజుల పాటు ఈ ధరల పెరుగుదల కొనసాగవచ్చని వ్యాపార నిపుణులు అంచనా వేస్తున్నారు.

## పవన్ కల్యాణ్ వ్యక్తిగత హక్కులకు ఢిల్లీ హైకోర్టు రక్షణ

**- ఆయన పేరు, ఫొటో, వాయిస్‌ను వాణిజ్యపరంగా వాడొద్దని ఆదేశం**
**- ఫ్లిప్‌కార్ట్, అమెజాన్ వంటి సంస్థలకు కీలక సూచనలు**
**- ఏఐ, డీప్‌ఫేక్‌ల ద్వారా కంటెంట్ సృష్టిపైనా ఆంక్షలు**

**విజయవాడ,డిసెంబరు 26,ప్రభాత వార్తప్రతినిధి:** టాలీవుడ్ పవర్ స్టార్, ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు ఢిల్లీ హైకోర్టులో భారీ ఊరట లభించింది. ఆయన పేరు, చిత్రం, గొంతు, వ్యక్తిగత గుర్తింపులను ఎలాంటి అనుమతి లేకుండా వాణిజ్య ప్రయోజనాల కోసం దుర్వినియోగం చేయకుండా పలు ఆన్‌లైన్ సంస్థలు, ఏఐ ప్లాట్‌ఫారమ్‌లు, వెబ్‌సైట్లపై మధ్యంతర ఉత్తర్వులు (యాడ్‌ఇంటరిమ్ ఇంజంక్షన్) జారీ చేసింది. తన వ్యక్తిగత, ప్రచార హక్కులకు (పర్సనాలిటీ అండ్ పబ్లిసిటీ రైట్స్) భంగం కలుగుతోందని ఆరోపిస్తూ పవన్ కల్యాణ్ దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ మన్మీత్ ప్రీతమ్ సింగ్ అరోరాతో కూడిన ఏకసభ్య ధర్మాసనం ఈ ఎక్స్‌పార్టీ ఆదేశాలు ఇచ్చింది. మూడు దశాబ్దాలుగా సినీ, రాజకీయ రంగాల్లో ఉన్న పవన్ కల్యాణ్‌కు గణనీయమైన వాణిజ్య బ్రాండ్ విలువ ఉందని, ఆయన వ్యక్తిగత హక్కులను కాపాడాల్సిన అవసరం ఉందని కోర్టు అభిప్రాయపడింది. పలు సంస్థలు పవన్ కల్యాణ్ అనుమతి లేకుండా ఆయన ఫొటోలతో టీ షర్టులు, కప్పులు, పోస్టర్లు వంటివి అమ్ముతున్నాయని, ఏఐ టూల్స్ ద్వారా ఆయన గొంతు, ఫొటోలను వాడుతున్నారని, సోషల్ మీడియాలో ఫేక్ పేజీలు నిర్వహిస్తున్నారని పవన్ తరఫు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. దీనివల్ల పవన్‌కు పూడ్చలేని నష్టం వాటిల్లుతుందని ధర్మాసనం పేర్కొంది.

ఈ నేపథ్యంలో ఫ్లిప్‌కార్ట్, అమెజాన్, మీషో వంటి ఈకామర్స్ వేదికల నుంచి అలాంటి ఉత్పత్తులను తక్షణమే తొలగించాలని ఆదేశించింది. వాటిని అమ్ముతున్న విక్రయ దారుల కేవైసీ వివరాలను పిటిషనర్‌కు అందించాలని సూచించింది. పవన్ పేరును దుర్వినియోగం చేస్తున్న వెబ్‌సైట్ లింకులను వారం రోజుల్లోగా తొలగించాలని స్పష్టం చేసింది. అయితే, ఫ్యాన్ పేజీలకు మాత్రం కొన్ని షరతులతో మినహాయింపు ఇచ్చింది. అవి ఫ్యాన్ పేజీ అని స్పష్టమైన డిస్‌క్లెయిమర్ ఇవ్వాలని, లేనిపక్షంలో వాటిని కూడా నిలిపివేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను ఫిబ్రవరి 9వ తేదీకి వాయిదా వేసింది.

## విజయవాడ- హైదారాబాద్ జాతీయ రహదారిపై భారీ రద్దీ

**విజయవాడ,డిసెంబరు 26,ప్రభాత వార్తప్రతినిధి:** క్రిస్మస్ సెలవులు ముగియడంతో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి భారీ ట్రాఫిక్ రద్దీతో నిండిపోయింది. క్రిస్మస్ అనంతరం ఆఫీసులు, కాలేజీలు, పాఠశాలలు తిరిగి ప్రారంభం కావడంతో ఒకేసారి లక్షలాది మంది హైదరాబాద్ వైపు ప్రయాణం చేయడంతో రహదారిపై వాహనాల ఒత్తిడి విపరీతంగా పెరిగింది. ప్రత్యేకంగా పంతంగి, చౌటుప్పల్, కోర్లపాడు టోల్ గేట్ల వద్ద కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. నేషనల్ హైవే 65పై ఔటర్ రింగ్ రోడ్ నుంచి అబ్దుల్లాపూర్‌మెట్, హయత్‌నగర్, చౌటుప్పల్ వరకు ట్రాఫిక్‌తో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విజయవాడ సమీపంలో ఫ్లైవోరు దిగువన.

గొల్లపూడి ఎ1 సెంటర్,ఇబ్రహింపట్టణం రింగ్‌సెంటర్, కీసర టోల్‌ప్లాజా,గట్టుభీమవరం టోల్‌ప్లాజా దగ్గర వాహనాలు నిలిచాయి. కొన్ని ప్రాంతాల్లో గంటల తరబడి వాహనాలు కదలని పరిస్థితి నెలకొంది.

వార్త


గౌరవం అన్నది పదవులు హోదాలు పొందడంలో లేదు. పదవులు గౌరవాదులకు మనం అర్హులం అనే భావనలోనే గౌరవం ఉంటుంది.

-అరిస్టాటిల్

# స్వచ్ఛమైన గాలికి పన్నుల అవరోధమా!

రాజధాని అయినా, ఓ కుగ్రామమైనా, ఊరంతా పొగమంచు లేదా కాలుష్యం ఒకే తెరగా కమ్మేస్తోంటే ఎన్నాళ్లు ఊరుకుంటాం? దానికి పరిష్కారమేమిటో అంతుచిక్కకపోతే ఏంచేయాలి? ఇవన్నీ న్యాయస్థానాలను, పాలకుల్ని వేధిస్తున్న ప్రశ్నలు. ఢిల్లీలో కాలుష్య స్థాయి ఆందోళనకరంగా ఉందని అందరూ చెప్తున్న మాటే! శాస్త్రజ్ఞులు, కాలుష్య మండలి అధికారులు సైతం ఒకే మాట. ఢిల్లీలో కాలుష్యం పెచ్చుపెరిగిపోతే ఊరు మొత్తం ఇంట్లో కూర్చోవాల్సిందే. ఢిల్లీ కాలుష్యస్థాయిని గుర్తించడంలో ఎవరి అంచనా వారిది. ఒకేసారి 20 సిగరెట్లు కాలిస్తే మానవ దేహం ఎంత ఇన్‌ఫెక్షన్‌కు గురౌతుందో అంతేస్థాయిలో ఉందని ఒక అంచనా గతంనుంచే వస్తోంది. ఢిల్లీలో రెండు రోజులుంటే తనకు ఇన్‌ఫెక్షన్ సోకడం ఖాయమని కేంద్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ అంటున్నారు. ఎవరెంత బాగా బాధపడితే వారంతగా తన బాధను వ్యక్తం చేయగలుగుతారన్నది నిజం. అందుకే ఆయన ఫీలింగ్‌ను ఆయన చెప్పారు. ఒక పుస్తకావిష్కరణ సభలో ఆయన పలు విషయాలపై తన సొంత అభిప్రాయాలను నిర్ద్వంద్వంగా ప్రకటించారు. తన రవాణా శాఖవల్లే 40శాతం కాలుష్యం ఏర్పడ్తోందని అన్నారు. యేటా 22 లక్షల కోట్ల ఖర్చుతో శిలాజ ఇంధనాలు దిగుమతి చేసుకుంటున్న దేశం మనదని అయినా ఎక్కడో లోపం ఉందేమోనన్న సందేహం వ్యక్తం చేశారు. ఇదోరకమైన జాతీయ వాదమా! అని ప్రశ్నించారు. అంత భారీస్థాయిలో డబ్బు ఖర్చుపెట్టి దేశాన్ని కలుషితం చేస్తున్నాము. ప్రత్యామ్నాయ ఇంధనాలు, జీవ ఇంధనాలలో మనం స్వయం సమృద్ధిని సాధించలేమా? అన్నది ఆయనకు మిలియన్ డాలర్ల ప్రశ్నగా ఉదయించింది. శ్వాస పీల్చుకోలేక ఎగశ్వాసను దింపుకోలేక శ్వాసనాళాలు గడబిడ చేస్తున్నాయని తెలిసినా ఢిల్లీ ప్రజలపై 'ఎయిర్‌ప్యూరిఫైయర్లపై 18శాతం పన్ను వేసిన జీఎస్‌టి కౌన్సిల్ ఔదార్యాన్ని ఢిల్లీ హైకోర్టు ప్రస్తావించి అక్షింతలు వేసింది. ఢిల్లీలో గాలి నాణ్యత అత్యంత ప్రమాదకరస్థాయికి పడిపోయి జనం స్వచ్ఛమైన గాలికోసం ఎదురుచూస్తున్నఢిల్లీ ప్రజలకు ఈ విధమైన పన్ను శరాఘాతంలా మారింది. అంటే మూలిగే నక్కపై తాటిపండు పడిన చందాన ఇబ్బంది జరిగింది. ఎయిర్ ప్యూరిఫైయర్‌లు జీవరక్షక సాధనాలే తప్ప విలాస వస్తువులుగా ఎంతమాత్రం భావించలేం. అలాంటి పరిస్థితుల్లో వాటిపై 18 శాతం జిఎస్‌టి ఆక్షేపణీయం. ఈ మాటలన్నది ఎవరో కాదు సాక్షాత్తూ న్యాయమూర్తులే. ఒకపక్క జిఎస్‌టి భారతీయుడికి ప్రాణవాయువు అని కేంద్ర ప్రభుత్వం ఊదరకొడుతూ విస్తృత స్థాయిలో ప్రచారం చేసుకుంటూ మరోపక్క వినియోగదారుల జేబుకు చిల్లుపెట్టే స్థాయికి ఆవిభాగం చేరిందంటే నమ్మలేం. కానీ అది నిజం. వైద్యపరికరాలు ప్రాణాన్ని నిలబెడతాయి కనుక వాటి మీద ఐదు శాతం జిఎస్‌టి పన్నునే వసూలు చేస్తున్నారు. వైద్య పరికరాల జాబితాలో ఉండాల్సిన వస్తువుకు బయట ఎసిల మాదిరి విలాస వినియోగ వస్తువుగా ఎందుకు గుర్తించడం లేదని ధర్మాసనం నిలదీసింది. బుధవారం తమ ముందుకొచ్చిన వాదనలో ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దేవేంద్ర కుమార్ ఉపాధ్యాయ, జస్టిస్ తుషార్ రావుతో కూడిన ధర్మాసనం జిఎస్‌టి కౌన్సిల్ ఆలోచనను దుయ్యబట్టింది. ఈ సందర్భంగా చేసిన వ్యాఖ్యలు ఆలోచింపచేసేవిగా ఉన్నాయి.ప్రజలకు స్వచ్ఛమైన గాలినందించాల్సిన అధికారులు విఫలమయ్యారు. ప్రతి మానవుడు రోజుకి 21వేల సార్లు శ్వాసిస్తాడు. విషతుల్యమైన ఢిల్లీ కాలుష్యాన్ని పీల్చడంవలన ఊపిరితిత్తులు ఏమేరకు పాడవుతాయో అంచనా వేసుకోవచ్చు. అత్యవసర పరిస్థితిని గుర్తించైనా ఎయిర్ ప్యూరిఫైయర్‌లకు 'పన్ను' మినహాయింపు నివ్వచ్చునని ధర్మాసనం శాసించింది. ఇప్పటికిప్పుడు జిఎస్‌టి కౌన్సిల్‌సమావేశం జరపడం సాధ్యంకాదని హైకోర్టు ధర్మాసనానికిప్రభుత్వ ప్రతినిధులు కోర్టుకు నివేదించారు. భౌతికంగా సమావేశమై నిర్ణయాలు తీసుకోలేని సందర్భాలలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశమై నిర్ణయం తీసుకోవచ్చునని హుకుం జారీచేసింది. ఢిల్లీ కాలుష్య స్థాయిల తీవ్రత రీత్యా ఎయిర్ ప్యూరిఫైయర్‌లను 'మెడికల్ డివైస్'గా నిర్ణయించి జిఎస్‌టి 18 శాతం నుంచి ఐదు శాతానికి తగ్గించాలని లేదా పన్ను మినహాయించాలని కోరుతూ సుప్రీంకోర్టు న్యాయవాది కపిల్ మదన్ దాఖలు చేసిన పిటిషన్‌పై ధర్మాసనం కూలంకషంగా విచారించింది. ఈ పిటిషన్ ఆద్యంతమూ ఢిల్లీ కాలుష్యం, దాని వలన సమస్యలు, పర్యావసనాలు తదితర అంశాలపై వాదనలు జరిగాయి. ఎప్పటిలాగే ప్రభుత్వం తరపున కొంత సమయం కావాలని కోరినప్పుడు ధర్మాసనంలోని న్యాయమూర్తి ఒకరు సమయం అంటే ఎంతకాలం వేలాది మంది మరణించినప్పుడా? అని నిర్ద్వంద్వంగా ప్రశ్నించారు. ప్రతి పౌరునికి పరిశుభ్రమైన గాలి కావాలి. దానిని ఇవ్వలేని పరిస్థితి ఉంది. అలాంటప్పుడు ప్రజలకు ఎయిర్ ప్యూరిఫైయర్‌లు అందుబాటులో ఉంచడం అత్యంత ఆవశ్యకమని ధర్మాసనం అభిప్రాయపడింది. ఢిల్లీ కాలుష్యంపై ఆందోళన చెందని వారుండరు. పలుసందర్భాల్లో సుప్రీంకోర్టు కూడా అన్నిటికీ అతీతమై దీర్ఘకాలిక పరిష్కారం కావాలని సూచించింది. శుక్రవారం ఉదయం హానికరమైన పొగ మంచు ఢిల్లీలోని దాదాపు అన్ని ప్రాంతాలను కమ్మేసింది. దృశ్యనాణ్యత బాగాపడిపోయింది. ఢిల్లీలో ఎన్‌సిఆర్ పరిధిలో గాలి నాణ్యత సూచీని అంచనా వేయగా గురువారం ఏక్యూఐ 220గా నమోదైనట్లు కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి వెల్లడించింది. వీటన్నిటిని అధిగమించాలంటే సమస్య వచ్చినప్పుడు ఆందోళన చెందడం కన్నా పటిష్ట ప్రణాళికలు, నిర్ణయాలతో సమస్య నుంచి గట్టెక్కడం అవసరం.

అదృష్టం కోసం కాచుకు కూర్చునే వ్యక్తి రాత్రిభోజనం తనకు ఎక్కడ దొరుకుతుందనేది ఖచ్చితంగా చెప్పలేడు.



ఫ్రాంక్లిన్

ధైర్యం, పట్టుదల, ఆత్మ విశ్వాసం ఈ మూడింటితోనే చాలా మంది సామాన్యులు నాయకులైనారు.



మహాత్మా గాంధీ

# రాజకీయ అవినీతే అసలు సమస్య!

**ప్రజలందరి ముందు వికృతరూపం దాల్చి నాట్యం చేసేది మరొక రకపు అవినీతి. అది ప్రజలకే కాదు పాలకులకు కూడా స్పష్టంగా తెలుసు. ప్రభుత్వం అప్రతిష్టపాలయ్యేది కూడా ఈ అవినీతితోనే. తెలుగు రాష్ట్రాల్లో ఈ అవినీతి అదుపు తప్పిపోతున్నది. చీకటిలో మూడోకంటికి తెలియకుండా జరుగుతున్న అవినీతిని అరికట్టలేకపోతే పోయారు కనీసం ప్రజలను వేధిస్తూ కళ్లముందు బాహాటంగా జరుగుతున్న అవినీతిని నియంత్రించకపోతే అప్రతిష్టపాలుకాక తప్పదు. రాజకీయ అవినీతిని అదుపుచేయకుండా ఎన్ని లక్షల కోట్లు అప్పు చేసినా పన్నుల రూపేణా ప్రజల ముక్కుపిండి ఎన్నివేల కోట్లు వసూల్ చేసి సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినా ఆశించిన ఫలితాలు చేకూరవు.**

దామెర్ల సాయిబాబ

'పరంబు పంజైన పసులకాపరీ తప్పు, ప్రజలు దుర్జనులైన ప్రభువుల తప్పు, భార్య గయ్యాలి అయిన ప్రాణనాధుని తప్పు,తనయుడు దుష్టుడైన తండ్రితప్పు, కూతురు చెడిన మాత తప్పు, సైన్యంబు చెదిరిన సైన్యనాధుని తప్పు..అంటూ ఎవరు తప్పుచేస్తే ఎవరు బాధ్యులో ఏనాడో ధర్మపురి లక్ష్మినరసింహస్వామి శతకంలో శేషప్ప కవి చెప్పారు. దేశంలో అవినీతి, అక్రమాలు,ఆశ్రిత పక్షపాతాలు పెరిగిపోతున్నాయని,అందరూ ఆవేదన వ్యక్తం చేస్తూనే ఉంటారు. ఈ వ్యవస్థ ఇలా దిగజారిపోవడానికి ఎవరు బాధ్యులో తెలియనివారు లేరు. ఈ పార్టీ, ఆపార్టీ అనికాదు తర, తమ బేధాలు లేకుండా ఎవరు అధికారంలో ఉన్నా తిలాపాపం తలాపిడికెడు అన్నట్లు మానవతా విలువలు మంటగల్పుతున్నారు. దేశంలోని అవినీతి అంతకంతకు పెరిగిపోతున్నది. పాలకులు అభివృద్ధి పేరుతో ఎన్నిలక్షల కోట్లు అప్పు తెస్తున్నారో అదేస్థాయిలో అవినీతి విజృంభిస్తున్నది. ప్రపంచ బ్యాంకు, ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు ఒకటేమిటి ఎక్కడ అప్పు దొరుకుతుందో దుర్భిణి పెట్టి వెతికి అక్కడికి వెళ్లి రకరకాల విన్యాసాలు చేసి వారిని ఒప్పించి, మెప్పించి అప్పులు తెచ్చుకుంటున్నారు. అప్పులు తేవడమే గొప్పగా చెప్పుకునే దురదృష్టపు రోజులు దాపురించాయి. నిర్మాణాత్మకమైన అభివృద్ధికి అప్పులు అవసరమే.అందులో మరో అభిప్రాయానికి తావులేదు. అవి ఎలాతీర్చాలో నిర్దిష్టమైన ప్రణాళిక, పథకాలుండాలి. వేలాది రూపాయలు ఏటా వడ్డీరూపేణా ఇప్పటికే చెల్లిస్తున్నారు. ఇటు పన్నులు రూపేణా ప్రజల ముక్కుపిండి వసూలు చేస్తున్న డబ్బు, అటు అప్పులు తెస్తున్న వేలాదికోట్ల రూపాయలు అవినీతి, అక్రమార్కుల పాలు కాకుండా చూడాల్సిన గురుతర బాధ్యత పాలకులపై ఉంది. అప్పులు పెరిగి అందుకు తగ్గట్టుగా ఆదాయం రాకపోతే పరిస్థితి ఎలాఉంటుందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. పొరుగునున్న శ్రీలంకను చూశాం. ఇప్పటికీ ఆ దేశం కోలుకోలేకపోతున్నది. అభివృద్ధి, అవినీతి రెండూ కలిసి పయనించలేవు. అభివృద్ధి ముందుకు నడుస్తుంటే అవినీతితూట్లు పొడుస్తూ వెనక్కి గుంజుతుంటుంది.దిగజారిపోతున్న మానవతా విలువలు అవినీతిని పెంచిపోషిస్తున్నాయి.అంతోఇంతో నిజాయితీతో జీవనం సాగిస్తున్న అధికారులను అసమర్థులుగా పరిగణించే పరిస్థితులు దాపురించాయి. ఎలుకలనుచూసి పిల్లి తప్పుకున్నట్లుగా అవినీతిపరుల ముందు నీతివంతులు తలవంచుకునే నికృష్టపు రోజులు వచ్చాయి. మరొకపక్క రాష్ట్రాల పరిధుల్లో ఎసిబి కానీ, కేంద్రస్థాయిలో సిబిఐ విజిలెన్స్ కొత్తగా ఏర్పడ్డ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ తదితర విభాగాలు రాజకీయ ఒత్తిడిల నుంచి బయటపడలేకపోతున్నాయి. అన్నింటికంటే మించి రాజకీయ అవినీతి శృతిమించిపోతున్నది. ఆవు చేలో మేస్తే దూడగట్టుపై మేస్తుందన్నట్లు కొందరు రాజకీయ నాయకుల అవినీతి అధికారులకు మార్గాన్ని చూపెడుతున్నది. అధికారుల్లో ఉన్న అవినీతి ఒక ఎత్తైతే కీలకపదవులు నిర్వహిస్తున్న కొందరు పెద్దలు ప్రజాసేవ ముసుగులో చెలామణి అవుతున్న మరికొందరు రాజకీయ నాయకులు, దళారుల వల్లనే పరిస్థితి అదుపు తప్పుతున్నదేమోననిపిస్తున్నది. వారి రాజకీయ అధికారం ధాటికి నిజాయితీ, సమర్థులైన అధికారులు సైతం నిస్సహాయంగా ఉండిపోతున్నారు. అవినీతి మూలంగా స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు భారత్ ఎన్ని లక్షలకోట్ల రూపాయలు కోల్పోయిందో అంచనాలకే అందదు.అవినీతినిఅంతం చేయాల్సిన కీలక పదవుల్లో ఉన్నకొందరు రాజకీయ నాయకులే చట్టానికి చుట్టాలై చక్రం తిప్పుతున్న సంఘటనలు గతంలో ఎన్నో బయటపడ్డాయి. పశ్చిమబెంగాల్‌లో మాజీ మంత్రి ఒకరు ఉపాధ్యాయ నియామక కుంభకోణంలో కోట్లాది రూపాయలు దిగమింగి తన ఆప్తమిత్రురాలు ఇంట్లో

ఒక్క మాట

గుట్టుచప్పుడు కాకుండా దాచిన వైనాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ రట్టుచేసింది. ఆ మధ్య కర్ణాటకలో బాధ్యత కలిగిన మంత్రే తన చావుకు కారణమని తనను ఏ రకంగా డబ్బు కొరకు వేధించారో వివరిస్తూ ఒక యువ గుత్తేదారు ఆత్మహత్య చేసుకున్నాడు. దాంతో విధిలేని పరిస్థితుల్లో ఆ మంత్రి రాజీనామా చేయాల్సివచ్చింది. ఇక సబ్బుల తయారీకి అవసరమైన ముడిసరుకుల టెండర్ ఆమోదముద్ర పొందడానికి లంచం ముట్టచెప్పాల్సిందేనని గుత్తేదారుకు ఆ ప్రాంత శాసనసభ్యుడు తన కుమారుడికి అప్పగించడంతో ఏకంగా నలభైలక్షల రూపాయలు తీసుకుంటూ లోకాయుక్త పోలీసుల ఉచ్చులో చిక్కుకున్నాడు. ఇక సాక్షాత్తు హైకోర్టు న్యాయమూర్తి ఇంట్లో జరిగిన అగ్నిప్రమాదంలో లక్షలాది రూపాయల నోట్ల కట్టలు బయటపడ్డాయి. రాజ్యాంగం కల్పించిన రక్షణ వల్ల ఆయనపై ఎఫ్ఐఆర్ కూడా వెంటనే నమోదు చేయలేని నిస్సహాయక పరిస్థితి. దీంతో ఆ డబ్బు ఎక్కడి నుంచి వచ్చింది?ఎందుకోసం ఎవరు ఇచ్చారు? తదితర ప్రశ్నలకు జవాబు లేకుండా పోయింది. ఇటీవల ఒడిశాలో సబ్‌కలెక్టర్‌గా పనిచేస్తున్న ఐఎఎస్ అధికారి పదిలక్షల లంచం తీసుకుంటూ పట్టుబడ్డాడు. ఆయన ఇంట్లో సోదా చేసి నలభై లక్షలకుపైగా నగదును అధికారులు కనుగొన్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఎంతో మంది ఉన్నతాధికారులపై గతంలోనూ, ఇప్పుడు కూడా అవినీతి ఆరోపణలు తరచుగా వినిపిస్తూనే ఉన్నాయి. ఎసిబి దర్యాప్తు చేసి చర్యలకు సిద్ధమైనా ప్రభుత్వం అనుమతించక ఆగిపోయిన సంఘటనలు కోకొల్లలు. ఇప్పుడే కాదు గతం నుంచి ఈ సంప్రదాయం కొనసాగుతూనే ఉన్నది. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విజిలెన్స్ కమిషన్ రాంచంద్రన్ సమాల్‌పై ఏకంగా విలేకరుల సమావేశం పెట్టి వెల్లడించిన విషయాలు అందుకు అద్దం పడుతున్నాయి. అప్పుడే కాదు నేటికీ కొందరు సీనియర్ రాజకీయ నాయకులు, మరికొందరు ఉన్నతాధికారులు అవినీతిలో మునిగి తేలుతున్నారు. కాంట్రాక్టుల కోసం ఏకంగా మంత్రులే బహిరంగంగా పోటీపడుతూ విమర్శనాస్త్రాలను కురిపిచుకుంటే ఏమనుకోవాలి? ఎవరికి చెప్పుకోవాలి? ఇక కిందిస్థాయిలో పరిస్థితి అదుపుతప్పిపోతున్నదేమోననిపిస్తున్నది. తాజాగా ఈవారంలో మహబూబ్‌నగర్‌లో రోడ్డు రవాణాకు సంబంధించిన అధికారిపై ఎసిబి అధికారులు చేసిన దాడుల్లో బహిరంగ మార్కెట్ విలువ ప్రకారం రెండువందల కోట్లకు పైగా ఆదాయానికి మించిన ఆస్తులు కనుగొన్నట్లు ప్రకటించారు. ఇక రెవెన్యూ, ఎక్సైజ్, రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్, విద్యుత్ తదితర శాఖల్లో అవినీతి తారస్థాయికి చేరినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఎసిబికి పట్టుపడుతున్న కేసులు కూడా ఇందుకు అద్దంపడుతున్నాయి. తెలంగాణలో ఇద్దరు ముగ్గురు మంత్రులు కోట్లాది రూపాయలు అక్రమాస్తులు కూడబెట్టుకున్నారని సాక్ష్యాత్తు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ మొన్న గురువారం రోజు బహిరంగంగానే ఆరోపించారు.అంతేకాదు కేంద్ర నిఘా విభాగాల దృష్టిలోఉన్నాయని, వాళ్లు జైలుకు వెళ్లడం తప్పదన్నట్లుగా వ్యాఖ్యానించారు. వాస్తవంగా చూసినా ఈ యేడాది ఎసిబి అధికారులు తెలంగాణ రాష్ట్రంలో గతంలో ఎన్నడూ లేని విధంగా రెండువందల ఇరవై కేసులకుపైగానూటయాభై మందిని అధికారులను అరెస్టు చేశారు. ఇవన్నీ ప్రత్యక్షంగా డబ్బు తీసుకుంటూ పట్టుబడిన కేసులే. ప్రజలు ఇచ్చిన సమాచారం మేరకే చిక్కిన కేసులుగానే చెప్పొచ్చు. అవినీతిలో మరోరకం మూడో మనిషి కంటికి కనపడదు. ఇచ్చిపుచ్చుకునే చేతులు రెండూఅదృశ్యంగానే ఉంటాయి.మూడో నేత్రానికి దృశ్యగోచరమయ్యే అవకాశం ఉండదు. సమయం, సందర్భాన్ని బట్టి వదంతులు,ఆరోపణలు, నిజానిజాలు, వ్యక్తిగత గుణగణాలు, గత, ప్రస్తుత పరిస్థితులను బట్టి వనరులు, తాహతును అంచనా వేసుకొని ఎవరికివారే ఊహాజనితమైన నిర్ణయానికి రావాల్సిందే తప్ప ప్రత్యక్ష సాక్షులతో రుజువు చేయడం అసాధ్యం. ఇది పైస్థాయిలో అయితే మరింత కష్టం. ముడుపులు ఇచ్చినవారు ఇచ్చినట్లు కానీ, తీసుకున్నవారు తీసుకున్నట్లు కానీ ఏ పరిస్థితుల్లోనూ బయటకు చెప్పరు. ఎవరైనా ఆరోపణలు చేసినా ఇద్దరు కలిసి ఖండించడమే కాదు తమ పరువుకు భంగం కలిగించారంటూ న్యాయస్థానం మెట్లెక్కడానికి కూడా వెనుకాడరు. ఇక ప్రజలందరి ముందు వికృతరూపం దాల్చి నాట్యం చేసేది మరొకరకపు అవినీతి. అది ప్రజలకే కాదు పాలకులకు కూడా స్పష్టంగా తెలుసు. ప్రభుత్వం అప్రతిష్టపాలయ్యేది కూడా ఈ అవినీతితోనే. తెలుగు రాష్ట్రాల్లో ఈ అవినీతి అదుపు తప్పిపోతున్నది. చీకటిలో మూడోకంటికి తెలియకుండా జరుగుతున్న అవినీతిని అరికట్టలేకపోతే పోయారు కనీసం ప్రజలను వేధిస్తూ కళ్లముందు బాహాటంగా జరుగుతున్న అవినీతిని నియంత్రించకపోతే అప్రతిష్టపాలుకాక తప్పదు. అవినీతిని అదుపుచేయకుండా ఎన్ని లక్షల కోట్లు అప్పు చేసినా పన్నుల రూపేణా ప్రజల ముక్కుపిండి ఎన్ని కోట్లు వసూలు చేసి సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినా ఆశించిన ఫలితాలు చేకూరవు. ●

# నేతన్న 'భరోసా'తో ఉజ్జ్వల భవిష్యత్

చిలగాని జనార్ధన్

శిక్షణ, ఉత్పత్తి, మార్కెటింగ్, తద్వారా వచ్చేలాభాలు.. పరిశ్రమ ఏదైనా ఈ మూల సూత్రాలపైనే భవితవ్యం ఆధారపడి ఉంటుంది. మారుతోన్న కాలానుగుణంగా డిమాండ్ ఉన్న వస్తువుల ఉత్పత్తితో పాటు మార్కెటింగ్ చేసి లాభాల బాటలో సాగకుంటే ఎప్పుడోకప్పుడు పతనం తప్పదు. గత బీఆర్‌ఎస్ పాలనతో తీసుకున్న కొన్ని నిర్ణయాలు చేనేత రంగ భవిష్యత్‌ను ప్రశ్నార్థకంగా మార్చేసింది. శరవేగంగా మారుతోన్న కాలానుగుణంగా వస్త్ర పరిశ్రమల్లో మార్పులను అంచనా వేయలేక, కేవలం ప్రభుత్వంపైనే ఆధారపడడం వల్ల నేడు చేనేత రంగం తీవ్ర సంక్షోభంలో కొట్టుమిట్టాడుతోంది. ఈ సవాల్‌ను స్వీకరించిన ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త ఆలోచనలతో ప్రణాళిక సిద్ధం చేస్తుంది. రాష్ట్రంలోని వస్త్ర పరిశ్రమను గట్టెక్కించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తుంది. చేనేత కార్మికులకు శిక్షణ, పెట్టుబడికి వడ్డీలేని రుణాలు, డిమాండ్ ఉన్న వస్త్రాలు కార్మికులు తయారు చేయడం లేదనే విమర్శలున్నాయి. చేనేత వస్త్రాలు కొనుగోలు చేయాలని ఉన్నా అందుబాటులో లేకపోవడంతో మార్కెట్‌లో కొనుగోలు చేసి ధరిస్తున్నారు ఉద్యోగులు. గతంలోనూ శిక్షణ కేంద్రం ద్వారా మార్కెట్‌కు అనుగుణంగా చేనేత ఉత్పత్తులు జరిగేవి. మార్కెటింగ్ ద్వారా లాభాలు కూడా వచ్చేవి. కరీంనగర్ ఉమ్మడి జిల్లాలోని సిరిసిల్లలో 1990లో చేనేత శిక్షణ కేంద్రాన్ని అప్పటి ప్రభుత్వం ప్రారంభించింది.



2006 తరువాత దీన్ని కరీంనగర్‌కు మార్చారు.రాజకీయ, నాటకీయ పరిణామంలో భాగంగా 2014 డిసెంబరు చివరన తిరిగి సిరిసిల్లకు కేంద్రాన్ని తరలించి మూసి వేశారు. కేంద్ర ప్రభుత్వ పరిధిలో హైదరాబాద్ వీవర్ సర్వీసింగ్ సెంటర్‌కూడాఉంది. ఇది కూడా నామమాత్రం.గత ప్రభుత్వాల నిర్లక్ష్యం ఇందుకు అద్దం పడుతుంది. అత్యాధునిక పద్ధతిలో డిమాండ్ ఉన్న వస్త్రాలు కార్మికులకు శిక్షణ ఇచ్చి ఆయా రకాల ఉత్పత్తులతో లాభాలు ఆర్జించే అవకాశాలున్నా,ఆ దిశగా చర్యలేవీ చేపట్టడం లేదు. దీంతో మార్కెట్ పోటీకి అనుగుణంగా వస్త్రోత్పత్తులు జరగని పరిస్థితులు ఏర్పడ్డాయి. పదేళ్లక్రితంవరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా క్లస్టర్లుగా ఏర్పాటు చేసి చేనేత కార్మికులకు శిక్షణ కార్యక్రమాలు చేపట్టేవి. గత పదేళ్లుగా ఈ ఊసే లేదు. దీనికితోడు టెస్కోను విస్తరించి బ్రాండ్ ఇమేజ్‌ను పెంచే విధంగా కృషి కూడా జరగలేదు. తెలంగాణలోని పేరెన్నిక గల వస్త్రాలు మంచి డిమాండ్ ఉండేది. కరీంనగర్ జిల్లాకు చెందిన కొత్తపల్లి దోవతులు, చీరలు పోచంపల్లి చీరలు, కాటన్ షర్టింగ్..ఇలా పలు వస్త్రాలు ఎంతధరైనా చెల్లించి కొనుగోలు చేసేవారు. ప్రభుత్వాలు ఏర్పాటు చేసే ఎగ్జిబిషన్‌కు మంచి స్పందన ఉండేది. గతంలో అప్కో ట్రేడ్‌మార్క్‌తో వస్త్రాలు విరివిగా అమ్ముడుపోయేవి. దురదృష్టవ శాత్తు గత పదేళ్ల కాలంలో టెస్కో పూర్తి స్థాయిలో నిర్వీర్యమైంది. ప్రస్తుతం టెస్కోగుర్తింపు,నాణ్యత, నమ్మకాన్ని మార్కెట్‌లో పెంచాల్సిన అసరం ఎంతైనాఉంది. ఆ దిశగా కృషి జరగాలి. చేనేత సంఘాల్లో ఉత్పత్తి అయ్యే వస్త్రాల నాణ్యతను గుర్తించేలా టెస్టింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేయాలి.ఇందులోని నిపుణులు సర్టిఫైడ్ చేసి నాణ్యతను గుర్తించి మార్కెట్‌లో విక్రయాలు చేయించాలి. ●

# విద్య ఇక్కడ..ఉద్యోగాలు విదేశాల్లోనా!

దాడిశెట్టి శ్యామ్ కుమార్

భారతదేశంలో ఉత్తమమైన విద్యాభ్యాసంలో పరిపూర్ణత సాధించిన కొందరు విద్యావంతులు దేశంలో సామాజిక ఆర్థికశాస్త్ర సాంకేతిక రంగాల్లో ప్రతిభను చాటుతున్న అప్పటికి,కొన్ని దశాబ్దాలుగా దేశంలోని ప్రముఖ సాంకేతిక కళాశాలలో అభ్యసించిన విద్యార్థులు మరికొందరు ప్రతిభ నైపుణ్యం కలిగి ఉండి విదేశాల్లో ఉద్యోగుల కొరకు వెళ్తున్న క్రమంలో స్వదేశానికి ఉపయోగపడవలసిన అత్యున్నతమేధాశక్తిని విదేశాలు అందిపుచ్చుకుంటూ ఉన్నాయా అనే సంశయం కలగకమానదు. కారణాలు ఏవైనా విదేశాల్లో వేతనాలు ఎక్కువగా ఉంటున్నాయా లేక ఉద్యోగ అవకాశాలు అధికంగా ఉంటున్నాయా అనే భావనతోనైనా కావచ్చేమో నిజమైనా కాకపోయినా భారతదేశంలోని శాస్త్ర ఆధునిక సాంకేతిక నైపుణ్యం కలిగినటువంటి చాలామంది విద్యావంతులు విదేశాల వైపు మొగ్గు చూపుతున్నారా అనే సంశయం కలగక మానదు. భారతదేశానికి స్వతంత్రం వచ్చే నాటికి దేశంలోని ప్రజలలో అక్షరాస్యత శాతం చాలా తక్కువగా ఉండేదని గణాంకాలు చెప్తున్నాయి. దేశంలో ఆర్థిక వ్యవస్థ కూడా అంతంత మాత్రంగానే ఉండడం ఒకవైపు, పేదరికం మరోవైపు. ఆర్థిక వ్యవస్థ అనుకున్న రీతిలోలేకపోవడం వల్ల అధిక స్థాయిలో విద్యా ప్రమాణాలను అందరికీ అందించడంలో కొంత ఆలస్యంగా జరిగిందనే భిన్న వాదనలు సమాజంలో లేకపోలేదు. తద్వారా ప్రజలు ఎక్కువగా వ్యవసాయ రంగం మీద ఆధారపడి జీవించేవారు. అనంతరం జరిగిన పరిణామ క్రమంలో గణనీయంగా విద్యకు ప్రాముఖ్యత అవసరం కావడం దేశాభివృద్ధిలో అక్షరాస్యతక్రమం ప్రధానంగా మారింది. ప్రభుత్వాలు విద్యకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వడంతో క్రమేణా దేశంలో అనేక రాష్ట్రాల్లో ప్రతిభావంతులైన బోధకుల చేత విద్య అభ్యసించిన వారిసంఖ్య క్రమక్రమంగా పెరుగుతూ భారత దేశ జనాభాలో గణనీయంగా అక్షరాస్యత శాతం పెరుగుతూ వస్తున్నది.ఎక్కువగా ఇంజనీరింగ్ విద్యావ్యవస్థకు భారతదేశంలో ఉన్న అన్ని యూనివర్సిటీలు ఉత్తమమైన నాణ్యమైన విద్యను అందిస్తున్నాయి. దీనివల్ల ఇంజినీరింగ్ వ్యవస్థ అనేది భారతదేశంలో విస్తృతంగా ఉపాధి అవకాశాలు ఉన్న వ్యవస్థగా మారింది. ఇంజినీరింగ్ చదువుకున్న విద్యార్థులు డిగ్రీలు పుచ్చుకొని స్వదేశంలోనే కాకుండా ఇతర దేశాల్లోనూ ఉపాధి అవకాశాలను పొందుతున్నారు.అయితే చాలావరకు భారతదేశంలోని ఇంజినీరింగ్ చదివి ప్రతిభా నైపుణ్యం ఉన్న వారిని స్వదేశంలో ఉపాధి కంటే విదేశాల్లో ఉపాధి అవకాశాలు ఆకర్షించయో ఏమోకానీ చాలామంది ఉన్నత విజ్ఞానవంతులు కూడా భారత దేశాన్నివిడిచి ఆసియా దేశాలు,అమెరికా, ఆస్ట్రేలియా ,యూరప్ లాంటి అనేక దేశాల్లో ఉన్న ప్రముఖ సంస్థల్లో పారిశ్రామిక వాణిజ్య వ్యవస్థలలో చేరడానికి స్వదేశంలో చదివిన నాణ్యమైన విద్య విదేశాల్లో ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుందనే భిన్నాభిప్రాయాలు లేకపోలేదు. దీనితో భారతదేశంలో ఉన్న సాంకేతిక విద్యావ్యవస్థకు అగ్రదేశాలు, పాశ్చాత్య దేశాల్లో కూడా మంచి విలువలు ఉంటున్నాయి అనే వాదనలు బలపడుతూ వస్తున్నాయి. ప్రాచీన కాలం నుండి అనేక సంస్కృతి సాంప్రదాయాలకు ఆచార వ్యవహారాలకు నిలయమై ఉన్న భారత దేశంలో బహుముఖ ప్రజ్ఞ కలిగినటువంటి అనేకమంది విజ్ఞానవేత్తలు, జ్ఞానులు తత్వవేత్తలు,రాజకీయ వేత్తలు మరెందరో ప్రముఖులు భారతదేశ ప్రాచీన ఆధునిక చరిత్రలో సుస్థిరంగా నిలిచిపోయి భారత దేశం ప్రఖ్యాతి ఔన్నత్యాన్ని విశ్వవ్యాప్తం చేసినవారు లేకపోలేదు.ప్రాచీన కాలం నుండి కూడా భారతదేశం విద్యాపరంగా ప్రపంచవ్యాప్తంగా మూల బిందువుగా ఉండేదనినలందా, తక్షశిల లాంటి విశ్వవిద్యాలయాల్లో అనేక దేశాల నుండి అభ్యాసకులు వచ్చి విద్యను అభ్యసించి వెళ్లే వారని చరిత్రకారులు చెపుతారు. కానీ భిన్నంగా తరచుగా స్వదేశంలో ఉన్న విద్యావంతులు వేరేదేశాల్లో ఉన్నత చదువులకు ఉద్యోగాలకు వలసలు వెళుతున్న దృశ్యాలు అడపాదడపా గోచరిస్తుండడం ఆశ్చర్యకరం. సుమారు మూడు దశాబ్దాల నుండి చాలామంది భారతదేశంలో ఇంజనీరింగ్ విద్యలో పరిపూర్ణమైన నైపుణ్యత గల విద్యాభ్యాసాన్ని పూర్తిచేసి అమెరికా ఆస్ట్రేలియా యూరప్ దేశాల్లో ఉద్యోగాల కోసం ప్రయత్నం చేయడం,చాలామంది ఆయాదేశాల్లో పౌరసత్వం తీసుకుని స్థిరపడడం కూడా జరుగుతూ వచ్చింది. దీనితో స్వదేశంలో ఉత్తమమైన విద్యను అభ్యసించి సాంకేతిక రంగాల్లో నిపుణత కలిగిన ప్రతిభావంతుల నైపుణ్యతను మేధాసంపత్తిని పాశ్చాత్య దేశాలు విరివిగా ఉపయోగించుకుంటున్నాయా అనే వాదనలు తెరపైకి వస్తున్నాయి.కానీ స్వదేశం మీద అభిమానం కలిగి అనేక విషయాలపై నిపుణత కలిగిన విద్యావంతులు, మేధావులు, అన్నిరంగాల్లో క్షేత్రస్థాయిలో అత్యున్నతమైన ప్రతిభను ప్రదర్శిస్తూ భారతదేశాన్ని అన్ని రంగాల్లో మరింత ముందుకు తీసుకుపోతున్న వారు లేకపోలేదు. అలాంటి వారు విదేశాలకువెళ్లి ఏదో సాధించుకోవాలని కాకుండా దేశభక్తి,దేశ అభిమానంతోపాటు దేశానికి ఎంతో కొంత సేవచేయాలని వారికున్న జ్ఞానాన్ని స్వదేశానికి అంకితపరుస్తూ శాస్త్రవేత్తలుగా, వైద్యులుగా, ఇంజినీర్లుగా, అనేక రకాలైనటువంటి టెక్నీషియన్లుగా, పరిశోధకులుగా మరెన్నో విషయాలలో తమవంతు కృషి చేస్తుండడం శుభపరిణామం. స్వదేశంలో ఉత్తమమైన విద్యను, పరిపూర్ణ విజ్ఞానాన్ని సంపూర్ణంగా నేర్చుకుంటున్న యువత భారతదేశ పురోగతిలో సమాజ అభివృద్ధి కొరకు తోడ్పడే విధంగా మరింతగా తమ వంతు పాత్ర పోషించాల్సి ఉంది. అయినప్పటికీ,చాలావరకు స్వదేశంలో ఉన్నతవిద్యను అభ్యసించిన యువత విదేశాల వైపు పరుగులు పెడుతుండడం సర్వసాధనమైపోతుందా అనిపిస్తుంది. ఈవిధానంలో పాశ్చాత్య దేశాలఅభివృద్ధిలో భారతీయ మేధావులు ఆయాదేశాల్లో వివిధ రంగాల్లో ప్రత్యక్షంగా పరోక్షంగా భాగస్వాములు అవుతున్నారా అనే సంశయం కలగక మానదు. ఏదిఏమైనప్పటికీ భారతదేశంలో అత్యున్నతమైన మేధాసంపత్తి కలిగిఅన్ని రంగాల్లో నైపుణ్యం కలిగినటువంటి ప్రతిభావంతులు మారుతున్నకాలానికి అనుగుణంగా స్వదేశంలోనే అధునాతన శాస్త్ర సాంకేతిక పోకడలతో మరింతగా దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తారని ఆశించడంలో సందేహంలేదేమో. ●



# ప్రజావాక్కు



### విద్యుత్ వాహనాలే సరైన పరిష్కారం

**పర్యావరణ**పరిరక్షణ,ఇంధనభద్రత అనేసవాళ్లకు విద్యుత్ వాహనాలే సరైన పరిష్కారం. పెరుగుతున్న చమురు ధరలు,కాలుష్య కోరలనుండి దేశాన్నిరక్షించేందుకు కేంద్ర ప్రభుత్వం పీఎం ఈడ్రైవ్ వంటి పథకాల ద్వారా భారీ ప్రోత్సాహకాలు అందిస్తోంది.దాదాపురూ.10,900 కోట్ల వ్యయంతో అమలవుతున్న ఈ పథకం ద్వారా ద్విచక్ర, త్రిచక్ర వాహనాల కొనుగోలుపై గణనీయమైన రాయితీలు లభిస్తున్నాయి.గణాంకాలప్రకారం,2025 నాటికి దేశంలో ఈవీల సంఖ్య 65 లక్షలకు చేరడం, ఏడాదిలోనే 34 శాతం వృద్ధి నమోదు కావడం శుభపరిణామం. కర్ణాటక 'ఈవీ రాజధాని'గా ఎదుగుతుండగా, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్ వంటి రాష్ట్రాలు వేగంగా విస్తరిస్తున్నాయి. ప్రస్తుతం ఉన్న 30 వేల ఛార్జింగ్ కేంద్రాలను భవిష్యత్తు అవసరాల కోసం 15 లక్షలకు పెంచాల్సి ఉంది.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### విరమించిన కార్యాచరణ

**ఎట్టకేలకు** కేంద్ర ప్రభుత్వం తాను ఖనిజాలకోసం దాదాపు 800 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న ఆరావళి పర్వత శ్రేణుల మధ్య భూగర్భ ఖనిజాలను వెలికి తీయడానికి ప్రాథమికంగా సమ్మతించినా, అపోజిషన్ నాయకులు ఇతర మేధావులు ప్రకృతి సిద్ధంగా ఏర్పడిన ఆరావళి శిఖర శ్రేణుల విధ్వంసం వలన కలిగే ప్రకృతి విలయాలను విశదీకరించడం వలన కాబోలు కేంద్ర ప్రభుత్వం తన కార్యాచరణను విరమించుకుని మంచిపని చేసింది.

- ఎన్. రామలక్ష్మి,సికింద్రాబాద్

### గురువుల పిల్లలకు సీట్లు ఇవ్వాలి

**తెలంగాణ** రాష్ట్రంలోని ఎస్సీ,ఎస్టీబీసీ మైనారిటీ గురుకులాలలోని గురువుల యొక్క పిల్లలకు 2026-2027 విద్యా సంవత్సరం నుండి గురుకుల గురువుల పిల్లలకు కూడాగురుకులాలలో ఉచితసీట్లు కేటాయించాలి. బాలుర గురుకులాలలో ఒక సీటు. బాలికల గురుకులాలలో ఒక సీటు గతంలో ఉన్న ప్రత్యేక జీవోను వచ్చే విద్యా సంవత్సరం నుండి తప్పనిసరిగా అమలు చేయాలి. రాష్ట్రంలో ఉన్న 2 సైనిక్ స్కూల్‌లలో కూడా ఈ విధానం అమలు చేయాలి. గురుకులాలలోని గురువుల పిల్లలకు తప్పనిసరిగా ఉచిత సీట్లు ఇచ్చి దేశంలోనే ఆదర్శంగా నిలవాలి.

- రాపాక రవీందర్, జనగాం

### పంచాయతీలకు నూతన సంవత్సర కానుక

**నూతన** సంవత్సరాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణాభివృద్ధికి దిశానిర్దేశం చేసే కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రముఖ్యమంత్రి గ్రామపంచాయతీలకు ప్రత్యేకఆర్థిక సహాయం ప్రకటించడం గ్రామీణస్వయంపాలన వ్యవస్థకు ఊతమిచ్చే చర్యగా భావించవచ్చు. చిన్న గ్రామ పంచాయతీలకు రూ.5 లక్షలు, ప్రధాన గ్రామ పంచాయతీలకు రూ.10 లక్షల చొప్పున నిధులు కేటాయించడం ద్వారా ప్రభుత్వం గ్రామాల అవసరాలనుగుర్తించినట్లుస్పష్టమవుతోంది.గ్రామ పంచాయతీలు గ్రామస్థాయిలో పరిపాలనకు పునాది వంటివి.తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, వీధిదీపాలు, అంతర్గత రహదారులు, పచ్చదనం వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధిలో పంచాయతీల పాత్ర ఎంతో కీలకం. కానీచాలాసార్లు నిధుల కొరత కారణంగా చిన్నచిన్న అభివృద్ధి పనులు కూడా ఆలస్యమవుతుంటాయి. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం నేరుగా నిధులు విడుదల చేయడం గ్రామీణ సమస్యలకు తక్షణ పరిష్కారాలను అందించే అవకాశాన్ని కల్పిస్తుంది.

-తిప్పర్తి శ్రీనివాస్, చొప్పదండి

### అవగాహన అవసరం

**ఈమధ్య** కాలంలోవివిధ రకాల ప్రకృతి, పారిశుధ్యం లోపాలు, వ్యక్తుల అజాగ్రత్త మూలాన కొత్తవ్యాధులు బయటపడుతున్నాయి. అదే కోవకు చెందిన స్క్రబ్ టైఫ్స్ వల్ల కూడా రాష్ట్రంలో ప్రస్తుతం మరణాలు పెరిగినవి. బాధితులు తక్కువైన , వీటి లక్షణాలు తెలియక మరికొందరికి ఎక్కువ కావొచ్చు. సరైన మందుఅందక ఆలస్యంవల్ల మరణం సంభవించవచ్చు.ముందు జాగ్రత్తగా అన్ని ప్రధాన ఆసుపత్రుల్లో ఈ వార్తను ప్రజలకు నోటీసు బోర్డు ద్వారా తెలియజేస్తే చికిత్స మార్గం ద్వారా వ్యాప్తి, ప్రాణనష్టం నివారణ సాధ్యం కాగలదు.

-బొల్లోజు మేఘనాథం, విశాఖపట్నం

### ఉచిత ప్రయాణం పేద విద్యార్థి హక్కు

ప్రభుత్వం మహిళల పేరిట ఉచిత ప్రయాణ పథకాన్ని అమలు పరిచింది. వెంటనే ఈ ఉచిత ప్రయాణ వసతిని తొలగించాలి. ఉచితబస్సు ప్రయాణం పేదవిద్యార్థులకు చెందవలసిన హక్కు మాత్రమేకానీ రాజకీయ వ్యూహాలతో అనవసర పథకాలు పెట్టాల్సి నవనిలేదు.పథకాలుపేదవాడికి భరోసానివ్వాలికానీ భారాన్ని మిగల్చొద్దు. కాబట్టి ఈ పథకాన్ని రద్దుపరిచి దీని స్థానంలో పేద విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలి.

-కె. నిఖిత, నల్గొండ జిల్లా

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# ఘనంగా వంగవీటి మోహన రంగా వర్ధంతి

**తిరువూరు, డిసెంబర్ 26, ప్రభాతవార్త :** పట్టణంలోని రేగిచెట్టు సెంటర్‌లో వంగవీటి మోహనరంగా వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూల మాల వేసి నివాళి అర్పించిన రాధ రంగా మిత్రమండలి సభ్యులు పలువురు నేతలు మాట్లాడుతూ వంగవీటి మోహనరంగా చేస్తున్నారు. ఆయన ఆశయాల సాధన కోసం అందరం కలిసికట్టుగా పని చేస్తాం. ఆయనను మట్టుపెట్టిన వారు చరిత్రలో లేకుండా కాలగర్భంలో కలిసి పోయారు. రంగా జన హృదయంలో కార్మిక వర్గాల్లో సజీవంగా నిలిచి పోయారు. నేటికీ అభిమానులు స్వచ్ఛందంగా ఆయన పేరు సేవా



ప్రాంతాలు కులాలు పార్టీలకు అతీతంగా అందరూ ఆరాధించే వ్యక్తి భావి తరాల్లో స్ఫూర్తి నింపిన వ్యక్తి వంగవీటి మోహనరంగా భౌతికంగా దూరమైనా ప్రజల గుండెల్లో చిరస్థాయిగా చిరస్మరణీయునిగా మిగిలారు. నేటికీ ఆయనను కొలిచే వారు ఆరాధించే వారున్నారంటే ఆయన అందరి మనిషిగా ప్రజలకు సేవలు అందించడమే కారణం. రంగా'ని స్ఫూర్తిగా తీసుకుని భవిష్యత్తు తరాలు కూడా అనేక సేవా కార్యక్రమాలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వంగవీటి మోహనరంగా ఒక మనిషి కాదు ఒక శక్తి, స్ఫూర్తి. ఆయన దూరమై 37 ఏళ్లు అయినా మొన్నే చనిపోయారని భావిస్తున్నారు. పేదలకు అండగా నిలుస్తూ రంగా అభిమానులు భరోసా ఇస్తున్నారు. యుగాలు మారినా ప్రజల హృదయాలలో కనిపించే కారణజన్ముడు. కార్యక్రమంలో మోహన రంగా మిత్ర మండలి సభ్యులు కాపు సంఘం నేతలు పాల్గొన్నారు.

## ఊటుకూరులో రంగా వర్ధంతి



**గంపలగూడెం,డిసెంబర్ 26, ప్రభాతవార్త :** గంపలగూడెం మండలం ఊటుకూరులో శుక్రవారం రాత్రి దివంగత వంగవీటి మోహన రంగా వర్ధంతి కార్యక్రమం జరిగింది. వైఎస్సార్సీపీ నాయకుడు ఆలపాటి ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో పలువురు నాయకులు రంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేదల కోసం రంగా చేసిన వీరోచిత పోరాటాలను వక్తలు వివరించారు.

## తెదేపాలో గడ్డి కృష్ణారెడ్డికు పదవులు పోయే..ఆస్తులు పోయే..

### మండల తెదేపా శ్రేణుల కార్యకర్తల అసంతృప్తి

**ఎ కొండూరు, డిశంబర్ 26, ప్రభాతవార్త :** రాజకీయ పార్టీల్లో నైతిన విలువలు లేకుండా పోతున్న ప్రస్తుత రాజకీయాల్లో ఎన్టీఆర్ జిల్లా ఎ కొండూరు మండల టిడిపి మాజీ అధ్యక్షుడు గడ్డి కృష్ణారెడ్డి రోజారాణి దంపతులు నైతిక విలువలకు ప్రాధ్యానతనిస్తూ తన తండ్రి స్వర్గీయ



గడ్డి సత్యనారాయణ రెడ్డి తెలుగుదేశం ఆపర్టీ ఆవిర్భావం నుండి టిడిపిలో ఉండి పార్టీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ వద్ద ప్రశంసలు పందిన స్వర్గీయ సత్యనారాయణ రెడ్డి బాటలో స్ఫూర్తితో తనయుడు గడ్డి కృష్ణారెడ్డి గత 35 ఏళ్ల నుండి తండ్రి బాటలో నడుస్తూ పార్టీకోసం తనకున్న ఆస్తిలో సుమారు 30ఎకరాల వరకు పార్టీ కోసం హారతికర్పూరంలా అమ్ముకొని టిడిపి అభివృద్ధి పటిష్టత కోసం తన తండ్రి స్ఫూర్తిగా తీసుకుని తండ్రి కొడుకులు ఆస్తిని అమ్ముకున్నారు. టిడిపి అధికారం కోల్పోయి వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతిపక్షంలో ఉండి కూడా కృష్ణారెడ్డి రోజారాణి దంపతులు పార్టీ ఉద్యమాల్లో బహిరంగ సభలు సమావేశాల కోసం మండల పార్టీ అధ్యక్షుడిగా ఉండి ప్రజల కోసం కార్యకర్తల సమీకరణ కోసం లక్షలాది రూపాయలు నీళ్ల ప్రాయంలా ఖర్చుపెడుతూ కార్యకర్తల్లో మంచి ఉత్సాహాన్ని నింపారు. అటువంటి కృష్ణారెడ్డిని టిడిపి ఎన్డిఎ కూటమి అధికారంలోని వచ్చాక నామినేటెడ్ పదవుల్లో పదవి కేటాయించాల్సింది పోయి ఉన్న మండల పార్టీ అధ్యక్షత స్థానం తప్పించడం పార్టీ చేసిన పెద్ద పొరబాటుని మండల టిడిపి శ్రేణులు నాయకులు కార్యకర్తలు పార్టీ తీరును తీవ్రంగా విమర్శించారు. పార్టీ అధికారంలో ఉన్నా లేకపోయినా ప్రజా సమస్యలే ఊపిరిగా పనిచేస్తున్న కృష్ణారెడ్డి తనకు పార్టీ ఏ పదవి కేటాయించలేదనే అసంతృప్తి లోలోపల ఉన్నప్పటికి గంభీరంగా కనపడుతూ పార్టీ వ్యవహారాల్లో అప్పుడప్పుడు తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు పిలుపు మేరకు పాల్గొంటూ ఎమ్మెల్యేకు చేదోడువాదోడుగా ఉంటున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో తీవ్ర ప్రతికూల పరిస్థితులు పార్టీ నియోజకవర్గంలో ముఖ్యంగా ఎ కొండూరు మండలంలో నెలకొంటా యని, పార్టీని దెబ్బతీసే చర్యలు కొంతమంది అభివృద్ధి నిరోధక శక్తులు తమ వంతు కుటిల రాజకీయాలు చేస్తున్నారని వారికి పార్టీలకు కొంతమంది మద్దతు పలకడం శోచనీయమని ఈ పరిస్థితిని హై కమాండ్ తీవ్రంగా పరిగణించి చర్యలు తీసుకుని పార్టీని రక్షించాలని పలువురు కోరుతున్నారు.

## నేడు మండల పరిషత్ జనరల్ బాడీ సమావేశం : ఎంపిడివో

**ఎ కొండూరు, డిశంబర్ 26, ప్రభాతవార్త :** ఎ కొండూరు మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం మధ్యాహ్నం 2 గంటలకు ఎంపిపి కాలసాని నాగలక్ష్మి చెన్నారావు అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపిడివో బి.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎంపిడివో కార్యాలయ మీటింగ్ హాల్లో జరిగే ఈ జనరల్ బాడీ సమావేశానికి జడ్పీటిసి మెంబర్, ఎంపిటిసి మెంబర్లు, సర్పంచ్‌లు వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొనాలని ఎంపిడివో శ్రీనివాసరావు కోరారు.

## శాంసంగ్ తదుపరి దశ ఏఐ గృహోపకరణాలు

విజయవాడ, డిశంబర్ 26, ప్రభాతవార్త : సిఈఎస్‌లో తదుపరి దశ ఏఐ గృహోపకరణాలను ఆవిష్కరించనున్న శాంసంగ్ 2026కు సంబంధించి తమ డివైస్ ఎక్స్‌పీరియన్స్ డివిజన్ దార్శనికతను, ఏఐ ఆధారిత కొత్త కస్టమర్ అనుభవాలను ఆవిష్కరించడానికి ప్రపంచంలోనే అతిపెద్ద ఐటీ, గృహోపకరణాల ఎగ్జిబిషన్ అయిన సిఈఎస్ వేదికగా పరిచయం చేయనుందని శాంసంగ్ సౌత్ వెస్ట్ ఏషియా ప్రెసిడెంట్, సీఈఓ జెబి.పార్క్ తెలిపారు. అలాగే జనవరి 4న లాస్ వెగాస్‌లో జరిగే ఖిది ఫస్ట్ లుక్‌ఖి ఈవెంట్‌లో టీవీల విభాగంలోనూ కొత్త ప్రమాణాలను నెలకొల్పుతాము" అని అన్నారు.

## మంత్రి నారా లోకేష్ సహకారంతో మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్లు పంపిణీ

**మంగళగిరి, డిసెంబర్ 26 ప్రభాతవార్త :** మానవవనరులు, ఐటీ, ఎలక్ట్రానిక్స్, ఆర్టీజీఎస్ శాఖల మంత్రి నారా లోకేశ్ ఆర్థిక సహకారంతో నిర్వహిస్తున్న స్త్రీశక్తి కార్యక్రమం ద్వారా తాడేపల్లి పట్టణం, తాడేపల్లి రూరల్ మండలంలో కుట్టు మిషన్ శిక్షణ పూర్తి చేసుకున్న 30 మంది మహిళలకు శుక్రవారం ఉచితంగా కుట్టుమిషన్లు, సర్టిఫికేట్స్ పంపిణీ చేశారు. 76వ బ్యాచ్‌లో 60 రోజుల పాటు శిక్షణ



పొందిన మహిళలకు టీడీపీ కార్యాలయం ఎమ్మెస్సెస్ భవన్‌లో నియోజకవర్గ తెలుగు మహిళలు కుట్టుమిషన్లు అందజేశారు. కుట్టు మిషన్లు అందుకున్న మహిళలు మంత్రి నారా లోకేష్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర తెలుగు మహిళా కార్యదర్శి వింజమూరి ఆశాబాల మాట్లాడుతూ మహిళలు కుట్టు మిషన్ల ద్వారా తమ కుటుంబ జీవనోపాదులను పెంచుకోవాలన్నారు. మంగళగిరి నియోజకవర్గంలోని మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించి వారిలో ఆర్థిక పరిపుష్టి కల్పించడమే మంత్రి నారా లోకేష్ లక్ష్యమని అన్నారు. కూటమి ప్రభుత్వం మహిళలకు ఎప్పుడు అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో టీటీడీ పాలకమండలి సభ్యురాలు తమ్మిశెట్టి జానకి దేవి, ఆంధ్రప్రదేశ్ స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ ఆరుద్ర భూలక్ష్మీ, రాష్ట్ర తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి ఆకుల జయసత్య, నియోజకవర్గ తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి మంచికలపూడి వైష్ణవి, తాడేపల్లి పట్టణ తెలుగు మహిళా అధ్యక్షురాలు అన్నే కుసుమ, తాడేపల్లి మాజీ మున్సిపల్ చైర్మన్ కొయ్యగూర మహాలక్ష్మి, మాజీ కౌన్సిలర్ కటాబత్తుని నిర్మల, రావుల శిరీష రెడ్డి కోడుమూరు ఆదిలక్ష్మి, లతా పాల్గొన్నారు.

# విజయవాడ వార్త



## కార్పొరేషన్ పరిధిలో మంచినీటి సరఫరా నిలుపుదల

**విజయవాడ కార్పొరేషన్,డిసెంబరు 26,ప్రభాతవార్త :** నగరపాలక సంస్థ పరిధి లోని సర్కిల్-1,కెనాల్ రోడ్ లోని వినాయకుని గుడి వద్ద ఉన్న 16 ఎంజిడి 900 మి.మీ.పిఎస్‌సి పంపింగ్ మెయిన్ లైన్ మరమ్మత్తు పనులు జరుగుతున్న కారణంగా నేటి రాత్రి నుండి ఈ నెల 29 ఉదయం వరకు క్రింది ప్రాంతాల్లో తాత్కాలికంగా మంచినీటి సరఫరా నిలిపివేయబుతుందని కమీషనర్ ధ్యానచంద్ర శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా గాంధీనగర్,హనుమాన్ పేట,సత్యన్నారాయణపురం, దుర్గాపురం ,గులాబితోట, మధురానగర్,శ్రీనగర్ కాలనీ,భానునగర్,టీచర్స్ కాలని,ముత్యాలంపాడు ,గవర్నర్‌పేట,అరండల్ పేట,సూర్యారావుపేట, కస్తూరిభాయి పేట,గిరిపురం,దుర్గా అగ్రహారం,సీతారాంపురం, బావడపేట, ఉడ్డుపేట,లబ్బీపేట, మల్లిఖార్జునపేట,కేదారేశ్వరిపేట,పూర్ణానందపేట,ా ఎజ్జోనిపేట,లోటస్, రామలింగేశ్వరనగర్,అయోధ్యనగర్,శ ాంతినగర్, ఉప్పర వాగు కొండప్రాంతాలలో నీటి సరఫరా ఉండదని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. అయితే,మరమ్మత్తు పనులు పూర్తయిన అనంతరం 29 సాయంత్రం నుండి నీటి సరఫరా పునరిద్ధరించబడుతుందని తెలిపారు. కాబట్టి ప్రజలు తాత్కాలిక అసౌకర్యానికి సహకరించాల్సిందిగా కోరారు.

## మార్చిలోగా బిపిఆర్‌ఎస్‌కు ధరఖాస్తు చేసుకోండి : మున్సిపల్ కమిషనర్

**విజయవాడ కార్పొరేషన్,డిసెంబరు 26,ప్రభాతవార్త:** అనధికారిక కట్టడాలను క్రమబద్ధీకరించుకోడానికి 2026 మార్చి 11 లోపు బిల్డింగ్ పీనలైజేషన్ స్కీం క్రింద ధరఖాస్తులు సమర్పించుకోవచ్చని మున్సిపల్ కమీషనర్ ధ్యానచంద్ర పేర్కొన్నారు. ప్రజలు బిల్డింగ్ పీనలైజేషన్ స్కీంను




సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అనధికార భవనాలను క్రమబద్ధీకరించుకోవడం కోసం 'భవన క్రమబద్ధీకరణ పథకం-2025ను జారీ చేసిన జిఓఎంఎస్ నెం.225,ఎంఎ అండ్ యుడి(ఎం) డిపార్ట్‌మెంట్ ,2025 నవంబరు 12వ తేదీ జారీ చేసిన దాని ప్రకారం అమలు చేసిందని, ఈ పథకం కింద 1985 జనవరి 1వ తేదీ తర్వాత నుండి 2025 ఆగస్టు 31వ తేదీ వరకు నిర్మించిన అనధికార భవనాలు లేదా ఆమోదిత నిర్మాణ అనుమతులకు విరుద్ధంగా నిర్మించిన అదనపు విస్తరణలు క్రమబద్ధీకరణకు అర్హులని,అర్హులైన భవన యజమానులు ఈ పథకం కింద 2026 మార్చి 11 లోపు ధరఖాస్తులను సమర్పించాల్సి ఉంటుందని, ధరఖాస్తులు ఆన్‌లైన్ పోర్టల్ డబ్ల్యు.డబ్ల్యు.డబ్ల్యు.బిపిఎస్.ఎపి.జివోవి.ఇన్ ద్వారా మాత్రమే సమర్పించాలని,ధరఖాస్తులను అర్హత కల్గిన లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సనల్ ద్వారా తయారు చేసి అవసరమైన పత్రాలతో కలిపి ఆన్‌లైన్ మాడ్యూల్‌లో అప్‌లోడ్ చేయాలని,ఈ పథకం కింద 31.12.1997కు ముందు నిర్మించిన భవనాలకు ప్రభుత్వం క్రమబద్ధీకరణ రుసుముపై 25% రాయితీ మంజూరు చేసిందని,దీని కోసం 31.12.1997 లోపు చెల్లించిన ప్రాపర్టీ టాక్స్ రశీదు జతపర్చాలన్నారు. అర్హులైన అన్ని భవన యజమానులు నిర్ణీత గడువు లోపు ధరఖాస్తు చేసుకొని తమ భవనాలను క్రమబద్ధీకరించుకోవాలని విజ్ఞప్తి చేశారు. గడువు ముగిసిన తర్వాత ధరఖాస్తు చేయని వారు లేదా చట్టవిరుద్ధ నిర్మాణాలు కొనసాగించే వారిపై ప్రస్తుత చట్టాల ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం జారీ చేసినందున దానికనుగుణంగా చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.

## సిపిను మర్యాదపూర్వకంగా కలిసిన సిఐలు

**విజయవాడ కార్పొరేషన్,డిసెంబరు 26,ప్రభాతవార్త:** ఈ నెల 24న సిపి రాజశేఖరబాబు సెంట్రల్ క్రైం స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న బి.గుణరాంను ఒన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు,సిఎస్‌బి నందు విధులు నిర్వహిస్తున్న డివి రమణను మాచవరం పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు. ఈ సందర్భంగా వారిరువురూ ఆయా స్టేషన్‌లలో భాధ్యతలు స్వీకరించారు. అనంతరం పోలీస్ కమీషనర్ కార్యాలయం నందు సిపి రాజశేఖరబాబును మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అంఆందించారు.

## రీ సర్వేకు సహకరించాలి

**గంపలగూడెం,డిసెంబర్ 26, ప్రభాతవార్త :** వచ్చే ఏడాది జనవరి 2 నుంచి ప్రారంభం కానున్న



భూముల రీ సర్వే ప్రక్రియకు రైతులు సహకరించాలని గంపలగూడెం తహసీల్దారు వీ రాజకుమారి కోరారు. గంపలగూడెం మండలంలోని ఆర్లపాడు, లింగాల, ఊటుకూరు గ్రామాల్లో శుక్రవారం రీసర్వేపై రెవిన్యూ గ్రామసభలు జరిగాయి. సర్వే జరిగేటపుడు రైతులు తమ భూముల పత్రాలను అధికారులకు చూపాలని తహసీల్దారు సూచించారు. మండలంలోని 14 గ్రామాల్లో గతేడాది రీసర్వే జరిగిందని, మిగిలిన గ్రామాల్లో జనవరిలో నిర్వహిస్తామని తెలిపారు.

## సిఎంపై కారుమూరి వెంకటరెడ్డి వ్యంగ్యాస్త్రాలను ఖండించిన ఎస్ఎం ఫైజాన్

**ఎ కొండూరు, డిశంబర్ 26, ప్రభాతవార్త :** కారుమూరి వెంకటరెడ్డి సిఎం చంద్రబాబుపై సంధించిన వ్యంగ్యాస్త్రాలను టిడిపి రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి తిరువూరు పట్టణ పార్టీ పరిశీలకుడు ఎస్ఎం ఫైజాన్ శుక్రవారం మీడియా సమావేశంలో తీవ్రంగా ఖండించారు. చంద్రబాబుపై వెంకటరెడ్డి మాజీ ప్రధాని వాజ్‌పేయితో చేసిన రాజకీయాల గురించి మాట్లాడుతూ తెగబాధపడినట్లు నటించడం చిల్లర రాజకీయంగా ఉందని ఫైజాన్ ఎద్దేవా చేశారు. వైసిపి హయాంలో అవినీతికి అడ్డు అదుపు లేకుండా చేసి రాష్ట్రాన్ని 15, 20 సంవత్సరాల వరకు వెనక్కి నెట్టేసి రాష్ట్రానికి రాజధాని లేని ఎపిగా చేసి మూడు రాజధానులు పేరుతో డ్రామాలాడి రాష్ట్రాడి అప్పుల ఊభిలో మార్చి అధోగతి



పాల్జేసిన అరాచక, పాలన అందించి ప్రజా క్షేత్రంలో ఛీ కొట్టించనున్న కారుమూరి వెంకటరెడ్డి పిచ్చి ప్రేలాపనలు చేయడం తగదని ఇప్పటికైనా వెంకటరెడ్డి నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని ఫైజాన్ మితవులు పలికారు. పిపిపి విధానం అంటే ప్రైవేటీకరణ కాదని సాక్షాతు గవర్నర్ అబ్దుల్ అజీజ్ కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఆర్థికమంత్రి నిర్మల సీతారామాన్ జగన్మోహన్ రెడ్డికి పార్టీ నాయకులతో చెప్పిన అర్థం చేసుకోకుండా అవాకులు చవాకులు మాట్లాడడం రాజకీయ ఇంకిత జ్ఞానం లేదని వీరు విమర్శించారు. పరకామణి కేసులో అరెస్ట్ చేస్తే పారిపోయిన కారుమూరి వెంకట రెడ్డి రాష్ట్రాభివృద్ధి కోసం వయస్సును సైతం లెక్కచేయకుండా కష్టపడి పనిచేస్తున్న సిఎం చంద్రబాబుపై పేటిఎం బ్యాచ్‌లో బురద చల్లాలనుకోవడం నీచ సంస్కృతి అని ఇదే పద్ధతి కొనసాగిస్తే చంద్రబాబు మంచితనాన్ని చేతగానితనంగా భావిస్తే వైసిపి పేటిఎం బ్యాచ్ ప్రజా క్షేత్రంలో తగిన మూల్యం చెల్లించుకోగా తప్పదని, ఖబడ్దార్ వెంకటరెడ్డి నోరు అదుపులో పెట్టుకో అంటూ ఫైజాన్ హెచ్చరించారు.

## నేటి తరం రాజకీయ నాయకులకు వాజ్ పేయి జీవితం ఆదర్శనీయం : యార్లగడ్డ

**గన్నవరం, డిసెంబర్ 26,ప్రభాతవార్త :** సుదీర్ఘ రాజకీయ జీవితంలో విలువలతో కూడిన రాజకీయం చేసిన వాజ్ పాయ్ లాంటి మహానుభావుడిని నేటి తరం రాజకీయ నాయకులు ఆదర్శంగా తీసుకోవాలని ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు సూచించారు.. మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్పాయ్ శత జయంతి ఉత్సవాలు, భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు చిగురుపాటి కుమార్ స్వామి జన్మదినోత్సవాన్ని బిజెపి ఆధ్వర్యంలో రోటరీ ఆడిటోరియంలో శుక్రవారం ఉదయం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే వెంకట్రావు మాట్లాడుతూ తొలిసారి ప్రధానిగా పదవి చేపట్టిన వాజ్పేయి పార్లమెంటులో బల నిరూపణ సమయంలో కాంగ్రెస్ పార్టీ చేసిన కుట్రల వల్ల ఒక ఓటు తో పదవిని కోల్పోయారని గుర్తు చేశారు. ఆనాడు వాజపేయి నైతిక, రాజకీయ విలువలు కట్టుబడి 13 రోజులు ప్రధాని గా పనిచేసి పదవిని వదులుకున్నారని తెలిపారు. ఆనాటి వాజ్పేయి త్యాగం నేడు దేశవ్యాప్తంగా బిజెపి జైత్రయాత్రకు



పునాదిగా యార్లగడ్డ పేర్కొన్నారు. సుదీర్ఘకాలం రాజకీయాల్లో ఉన్న ఉన్న వాజ్పేయి తన వాక్చాతుర్యంతో అందరినీ మెప్పించేవారని ప్రత్యర్థి పార్టీల్లోనూ ఆయనకు అభిమానులు ఉండటం విశేషమన్నారు. దేశ ప్రధానిగా ప్రోఖ్రాన్ అణు పరీక్ష నిర్వహించడం ద్వారా మన దేశ అణు సత్తాని ప్రపంచానికి చాటి చెప్పడంతో పాటు మన దేశ రక్షణ వ్యవస్థను బలోపేతం చేశారని కొనియాడారు. వాజపాయ్ వివాదరహితుడుగాను, అవినీతి మచ్చలేని నాయకుడిగా చివరి వరకు కొనసాగారని ఆయన జీవిత చరిత్ర ను దేశవ్యాప్తంగా పాఠశాల స్థాయిలో విద్యార్థులకు తెలిసేలా పాఠ్యపుస్తకంగా చేర్చాలని కేంద్ర ప్రభుత్వానికి ఈ సందర్భంగా యార్లగడ్డ విజ్ఞప్తి చేశారు. వాజ్పేయి జయంతి సందర్భంగా పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన పలు పోటీల్లో విజేతలకు యార్లగడ్డ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గన్నవరం ఏఎంసీ చైర్మన్ గూడవల్లి నరసింహారావు, మండల టిడిపి అధ్యక్షులు గూడపాటి తులసి మోహన్, కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నాదెండ్ల మోహన్, బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్ బాజీ, ఏఎంసీ డైరెక్టర్ కానూరు శేషు మాధవి, మాజీ ఎస్సి మోర్చా జిల్లా అధ్యక్షులు మేదూరు శేషు బాబు, మండల అధ్యక్షులు నీలం అశోక్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మట్ట ప్రసాద్, శరణాల మాలతి, కిసాన్ మోర్చా నాయకులు గోపి, అరుణ కుమారి, వెంకటేశ్వరరావు, టీడీపీ నాయకులు గుజ్జర్లపూడి బాబురావు, పాలడుగు నాని, జనసేన నాయకులు చిమటా రవివర్మ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో 3గ్గురు మృతి

**గుంటూరు క్రైమ్, డిసెంబర్ 26,ప్రభాతవార్త :** జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి చెందారు.సంఘటనా స్థలాన్ని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ పరిశీలించారు. శుక్రవారం తెల్లవారుజామున గుంటూరు జిల్లా





నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని కొమ్మినేని కోల్డ్ స్టోరేజ్ సమీపంలోని జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ప్రయాణికులతో వెళ్తున్న ఒక కారును వెనుక నుంచి వస్తున్న ట్రావెల్స్ బస్సు బలంగా ఢీకొనడంతో, కారులో ఉన్న ముగ్గురు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు.ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే, జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు హైవే పెట్రోలింగ్ బృందం సంఘటనా స్థలానికి చేరుకుని తక్షణమే సహాయక చర్యలు ప్రారంభించింది. గాయపడిన వారిని అత్యవసర చికిత్స కోసం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు.అనంతరం జిల్లా ఎస్పీ సంఘటనా స్థలాన్ని సందర్శించి ప్రమాదం జరిగిన తీరును సమగ్రంగా పరిశీలించారు. మృతులు, గాయపడిన వారి వివరాలు తెలుసుకొని, వారి ఆరోగ్య పరిస్థితిపై నల్లపాడు సీఐ వంశీధర్ ద్వారా వివరాలు సేకరించారు.భవిష్యత్తులో ఇటువంటి రోడ్డు ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు జాతీయ రహదారి అథారిటీ అధికారులతో సమన్వయం చేసుకుని ప్రమాద హెచ్చరిక బోర్డులు, రాత్రివేళ స్పష్టంగా కనిపించే రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను జిల్లా ఎస్పీ సూచించారు. ఈ పరిశీలన కార్యక్రమంలో ఎస్బి డీఎస్పీ శ్రీనివాసులు, ఎస్బి సీఐ అలహరి శ్రీనివాస్, నల్లపాడు సీఐ వంశీధర్ తదితర పోలీసులు పాల్గొన్నారు.

## చరవాణిలు రికవరీ

**గుంటూరు క్రైమ్, డిసెంబర్ 26,ప్రభాతవార్త :** రూ.53 లక్షల విలువైన 265 పోగొట్టుకున్న, దొంగిలించబడిన మొబైల్ ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందజేసిన గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ప్రజల ఫిర్యాదుల ఆధారంగా పోగొట్టుకున్న,దొంగిలించబడిన మొబైల్ ఫోన్లను గుర్తించి, బాధితులకు ఉచితంగా అందజేస్తూ గుంటూరు జిల్లా పోలీసులు ప్రజలకు అండగా నిలుస్తున్నారు. ఇప్పటి వరకు మొత్తం రూ.7 కోట్ల 53 లక్షల విలువైన 3,769 మొబైల్ ఫోన్లను విజయవంతంగా రికవరీ చేసి బాధితులకు అందజేశారు.గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో, సుమారు రూ.53 లక్షల విలువైన 265 మొబైల్ ఫోన్లను జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ బాధితులకు స్వయంగా అందజేశారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ..."ప్రజల ఫిర్యాదుల ఆధారంగా ఆధునిక సాంకేతిక పద్ధతులను ఉపయోగించి మొబైల్ ఫోన్లను గుర్తించి, బాధితులకు తిరిగి అందజేస్తున్నాం" అని తెలిపారు. ఇప్పటి వరకు రూ.7.53 కోట్ల విలువైన 3,769 మొబైల్ ఫోన్లను రికవరీ చేయడం జరిగిందని, ఈ కార్యక్రమం నిరంతరం కొనసాగుతుందని స్పష్టం చేశారు.ప్రజలు తమ మొబైల్ ఫోన్ పోగొట్టుకున్నా, దొంగిలించబడినా వెంటనే పోలీస్ హెల్ప్‌లైన్ నంబర్ 8688831574, దిని౹ళి వెబ్‌సైట్,జిల్లా సైబర్ సెల్, సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు.నేటి రోజుల్లో సెల్‌ఫోన్లను ఉపయోగించి సైబర్ నేరగాళ్లు"ఉద్యోగాలు, వ్యాపారాలు, లాభాలు" పేరుతో ప్రజలను మోసం చేసి వారి బ్యాంక్ ఖాతాల నుండి నగదు దోచుకుంటున్నారని ఎస్పీ పేర్కొన్నారు.

## వంగవీటి మోహన్ రంగా సేవలు చిరస్మరణీయం : ఎమ్మెల్యే మాధవి

**గుంటూరు వెస్ట్, డిసెంబర్ 26,ప్రభాతవార్త:** గుంటూరు పశ్చిమ నియోజకవర్గం పరిధిలోని 18వ



డివిజన్ ఎత్తురోడ్డు సెంటర్ వద్ద, 23వ డివిజన్ మూడు బొమ్మల సెంటర్ వద్ద నిర్వహించిన వంగవీటి మోహన్ రంగా గారి 37వ వర్ధంతి కార్యక్రమంలో గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీమతి గళ్ళా మాధవి పాల్గొని రంగా గారి విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పిం చారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ వంగవీటి మోహన్ రంగా గారు కేవలం ఒక కులానికి లేదా ఒక రాజకీయ పార్టీకే చెందిన నాయకుడు కాదని, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతిగా, పేదల పెన్నిధిగా, ఒక విప్లవాత్మక వ్యక్తిత్వంగా చరిత్రలో నిలిచిపోయారని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు. అణగారిన వర్గాల కోసం ఆయన నిలిచిన తీరు, నిస్సహాయులకు అండగా నిలబడి చేసిన అశేష సేవలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు.ప్రజల కోసం ఒక వ్యక్తి ధైర్యంగా నిలబడితే అది ఎంతటి శక్తిగా మారుతుందో రంగా గారి జీవితం స్పష్టంగా చూపిస్తుందని, ఆయన పాటించిన సూత్రాలు నేటి తరం నాయకులకు ఆదర్శప్రాయమని ఎమ్మెల్యే తెలిపారు. ముఖ్యంగా కొత్తగా రాజకీయాల్లో ముందుకు వస్తున్న నాయకులు, నాయకురాళ్లకు వంగవీటి రంగా గారి తెగింపు, త్యాగం, సామర్థం గొప్ప ప్రేరణగా నిలుస్తాయని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు పిల్లి మాణిక్యరావు గారు, పరిశీలకులు కనకాచారి గారు, పలువురు నాయకులు, కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని రంగా గారికి నివాళులర్పించారు.

## నేడు గుంటూరు కౌన్సిల్ సాధారణ సమావేశం

### నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర



**గుంటూరు కార్పొరేషన్, డిసెంబర్ 26 ( ప్రభాతవార్త ) :** గుంటూరు నగరపాలక సంస్థ కౌన్సిల్ సాధారణ సమావేశం శనివారం 10:30 గంటలకు నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర అధ్యక్షతన నిర్వహించడం జరుగుతుందని కౌన్సిల్ సెక్రటరీ వెల్లడించారు. ఈ సమావేశానికి నగర కమిషనర్ పులి శ్రీనివాసులు సారాజ్యంలో అధికార యంత్రాంగం, ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు, కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు అందరూ పాల్గొని గుంటూరు నగరాభివృద్ధికి సభ్యులు అడిగిన ప్రశ్నల పై చర్చించడం జరుగుతుందని తెలిపారు.

## అభివృద్ధి పనులకు శంకుస్థాపన



**రేపల్లె, డిసెంబరు 26, ప్రభాతవార్త:** రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆదేశాల మేరకు పురపాలక సంఘంలోని 13వ వార్డు ఎస్‌పి హిల్స్‌లో బిపిఎస్,ఎల్ఆర్ఎస్ గ్రాంట్‌లో మంజూరైన రూ.25 లక్షలతో సిసి రోడ్ నిర్మాణానికి శుక్రవారం రేపల్లె నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకుడు అనగాని శివప్రసాద్ శంకుస్థాపన చేశారు. రేపల్లె జూనియర్ కళాశాల ప్రాంగణంలో ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల కోసం రూ.29 లక్షలతో నిర్మించనున్న భవిత పాఠశాల భవన నిర్మాణానికి అనగాని శివప్రసాద్ భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో కెడ్యూల్డ్ ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ వంతాని మురళీధరరావు, మున్సిపల్ కమిషనర్ కె.సాంబశివరావు, పట్టణ టిడిపి అధ్యక్షుడు మేకా రామకృష్ణ, ఉపాధ్యాయులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బాపట్ల జిల్లా వార్త



## రంగా సేవలు చిరస్మరణీయం



**రేపల్లె, డిసెంబరు 26, ప్రభాతవార్త:** బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం కృషిచేసిన స్వర్గీయ వంగవీటి మోహన రంగా సేవలు చిరస్మరణీయమని వైసీపీ చేనేత విభాగం రాష్ట్ర కార్యదర్శి వట్టెం శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం రేపల్లె ఓల్డ్‌టౌన్‌లో వంగవీటి మోహన రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రంగా 37వ వర్ధంతి సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎస్సీ,ఎస్టీ,బీసీ,మైనారిటీ వర్గాల అభివృద్ధికి రంగా పాటుపడ్డారన్నారు. ప్రజలలో పెరుగుతున్న ఆదరణ చూసి ఓర్వలేక రంగాను హతమార్చటం విచారకరమన్నారు. వైసీపీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ చిత్రాల ఒబేదు మాట్లాడుతూ ప్రజల హక్కుల కోసం అణగారిన వర్గాల ఆత్మగౌరవం కోసం నిరంతరం పోరాడిన ధీరుడు, రాజకీయాలలో విలువలు, ధైర్యం, నిబద్ధతకు ప్రతీకగా దివంగత వంగవీటి మోహనరంగా నిలిచారని చెప్పారు. రంగా ఆశయ సాధనకు పాటుపడాల్సిన ఆవశ్యకతను ఆయన గుర్తుచేశారు. జనసేన పార్టీ ఆధ్వర్యంలో జరిగిన వంగవీటి మోహనరంగా వర్ధంతి కార్యక్రమంలో రంగా విగ్రహానికి రేపల్లె మార్కెట్ యార్డు ఛైర్మన్ అనురాధాభాస్కర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మత్తి భాస్కరరావు, పూషడపు నాని, బత్తుల మల్లి, పి.వాసు, ఆళ్ల నూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

# అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలి : కలెక్టర్



**బాపట్ల, డిసెంబర్26, ప్రభాతవార్త:** జిల్లా అభివృద్ధి కొరకు అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. ఎస్సీలు, దివ్యాంగుల ప్రత్యేక పిజీఆర్ఎస్ కార్యక్రమాన్ని శుక్రవారం స్థానిక కలెక్టరేట్ లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిధిగా పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఎస్సీలు, దివ్యాంగుల నుంచి ఆయన అర్జీలు స్వీకరించటం జరిగిందన్నారు. అర్జీలకు అక్కడికక్కడే వాటికి ఆయన పరిష్కారం చేయడంజరిగిందన్నారు. దివ్యాంగులు, ఎస్టీలకు ఇబ్బందులు కలగకుండా అధికారులు తమ వంతు సహాయం అందించాలన్నారు. కార్యాలయాల చుట్టూ తిప్పించుకోవడం మంచి పద్ధతి కాదని సూచించారు. దివ్యాంగులు, ఎస్టీల హక్కులను గౌరవించాలన్నారు. మనం చేయగలిగినంత మేరకు సహాయం అందించాలన్నారు. బాపట్ల జిల్లా ఏర్పడి నాలుగు సంవత్సరాలు అవుతున్నప్పటికీ ఆయా శాఖలకు జిల్లా అధికారులు లేకపోవడం ఏమిటన్నారు. అన్ని శాఖలలో జిల్లా అధికారి పోస్ట్ కేటాయింపులు జరిగాయా, అవి ఖాళీగా ఉన్నాయా, పొరుగు జిల్లాల వారు ఇన్చార్జిలుగా వ్యవహరిస్తున్నారా వంటి వివరాలపై అధికారులు నివేదిక ఇవ్వాలన్నారు. ఆయా శాఖలలో పనిచేస్తున్న అధికారుల హోదాలను వివరిస్తూ స్పష్టమైన సమగ్రమైన నివేదిక పంపాలన్నారు. ఏదైనా శాఖలకు జిల్లా అధికారి పోస్టు బాపట్లకు కేటాయింపులు జరగకపోతే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ భావన విశిష్ట, డి ఆర్ ఓ జి.గంగాధర్ గౌడ్, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## రేపల్లె అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి

**రేపల్లె, డిసెంబరు 26, ప్రభాతవార్త:** రేపల్లె ప్రాంతం అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు చర్యలు తీసుకోవాలని పట్టణ వేదిక కార్యదర్శి



యడ్లపల్లి కిషోర్‌బాబు కోరారు. శుక్రవారం రేపల్లె పట్టణ ఆదర్శవేదిక ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రీయ విద్యాలయం, ఇంజనీరింగ్, ట్రిపుల్ ఐటి విద్యా సంస్థలను ఏర్పాటు చేయించాలన్నారు. 100 పడకల వైద్యశాలను మంజూరు చేయించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే విధంగా చిన్నతరహా పరిశ్రమలను నెలకొల్పాలని కిషోర్‌బాబు సూచించారు. పర్యాటక రంగం అభివృద్ధిలో భాగంగా మోర్ఫోట, పెనుమూడి ఆధ్యాత్మిక కేంద్రాలను అభివృద్ధి చేయాలనాన్నారు. అంకమ్మ చెట్టు దగ్గర నుంచి అరవపల్లి బాలకోటేశ్వర స్వామి దేవాలయం వరకు రహదారి నిర్మాణాన్ని పూర్తి చేయించాలని ఆయన కోరారు. రేపల్లె అంకమ్మ చెట్టు దగ్గర నుండి పేటేరు వరకు, అంకమ్మ చెట్టు దగ్గర నుండి పెనుమూడి హైవే వరకు సెంట్రల్ లైటింగ్ సౌకర్యం ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ఉన్న రేపల్లెలో అన్ని శాఖలకు సంబంధించిన డివిజనల్ స్థాయి కార్యాలయాలు ఏర్పాటు చేయించేందుకు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ కృషి చేయాలని కిషోర్‌బాబు సూచించారు. ఈ సమావేశంలో పట్టణ ఆదర్శ వేదిక అధ్యక్షుడు బి.వి.మోహనరావు, కూనపురెడ్డి వెంకటేశ్వర్లు, కొడాలి ఆనంద్, ఎన్. సాయికృష్ణ మాచార్యులు, నటరాజ్, గుంటి సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

# రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి

## జిల్లా ఎస్పీ ఉమామహేశ్వర్

**బాపట్ల, డిసెంబర్26, ప్రభాతవార్త:** రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని, లేనిపక్షంలో పీడీ చట్టం ప్రయోగించి జిల్లా బహిష్కరణ విధించడానికి కూడా వెనకాడబోమని జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ హెచ్చరించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా శుక్రవారం బాపట్ల రూరల్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ముందుగా పోలీసు సిబ్బంది నుండి



గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం స్టేషన్ పరిసరాలు, రైటర్ గది, కంప్యూటర్ రూమ్, వివిధ కేసులలో సీజ్ చేయబడిన ప్రాపర్టీని భద్రపరిచే గది, ఉమెన్ హెల్ప్ డెస్క్ తదితర విభాగాలను పరిశీలించారు. అత్యవసర నంబర్లకు వచ్చిన కాల్స్‌కు పోలీసులు ఏ విధంగా స్పందిస్తున్నారో, కాల్ వచ్చిన తరువాత ఎంత సమయంలో సంఘటనా స్థలానికి చేరుకుని సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నారో వివరంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు సిబ్బంది జవాబుదారీతనంతో వ్యవహరించి, అత్యవసర కాల్స్‌కు వేగంగా స్పందించాలని, అత్యవసర కాల్స్ పట్ల నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఉమెన్ హెల్ప్ డెస్క్‌లో నిర్వహిస్తున్న రికార్డులను పరిశీలించి, రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరుగుతున్న నేరాలు, వాటిని నియంత్రించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు అందించారు. గ్రామ సచివాలయ మహిళా పోలీసులతో ప్రత్యేకంగా మాట్లాడి వారి విధుల నిర్వహణ గురించి అడిగి తెలుసుకున్నారు. మహిళా పోలీసులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా వ్యవహరించి, మహిళా సంబంధిత ఫిర్యాదులపై వేగంగా స్పందించాలని, గంజాయి లేదా ఇతర అసాంఘిక, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తుల గురించిన సమాచారం స్టేషన్ ఎస్‌హెచ్‌ఓకు తెలియజేయాలన్నారు. చెడు నడత కలిగిన వ్యక్తులు, రౌడీ షీటర్లపై నిరంతర నిఘా ఉంచాలని, వారు ఎవరిని కలుస్తున్నారు, తిరిగి నేరాలకు పాల్పడే అవకాశం ఉందా అనే అంశాలను ఎప్పటికప్పుడు పరిశీలించాలని ఆదేశించారు. రౌడీ షీటర్లు మరలా నేరాలకు పాల్పడకుండా కౌన్సిలింగ్ నిర్వహించాల్సిన బాధ్యత ఎస్‌హెచ్‌వోలదేనన్నారు. గ్రామ సందర్శన, పల్లె నిద్ర, విజిబుల్ పోలీసింగ్ వంటి కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించడంతో పాటు బీట్ వ్యవస్థ, పెట్రోలింగ్‌ను కట్టుదిట్టంగా అమలు చేస్తే నేరాలను గణనీయంగా తగ్గించవచ్చునన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, హెల్మెట్, ఓవర్ స్పీడింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్, ఓపెన్ డ్రికింగ్ వంటి అంశాలపై నిరంతరం ఎన్ఫోర్స్‌మెంట్ చర్యలు చేపట్టాలన్నారు. బాపట్ల జిల్లాలో రౌడీ కార్యకలాపాలను పూర్తిస్థాయిలో కట్టడి చేయడమే మా యొక్క ముఖ్య ఉద్దేశమని తెలిపారు. అదేవిధంగా రోడ్డు ప్రమాదాల నివారణ చర్యల్లో భాగంగా ఎన్‌హెచ్16, ఎన్‌హెచ్216, ఎన్ఎమ్ రహదారులపై తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న బ్లాక్ స్పాట్స్‌ను తనిఖీ చేయడం జరిగిందని తెలిపారు. . రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణమైన ఓవర్ స్పీడింగ్, హెల్మెట్ లేకుండా ప్రయాణించడం, డ్రంక్ అండ్ డ్రైవింగ్‌ను నియంత్రించేందుకు నిరంతర ఎన్ఫోర్స్‌మెంట్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణ చర్యల్లో భాగంగా స్వచ్ఛంద సంస్థల సహకారంతో వ్యవసాయ ఆధారిత జిల్లా కావడంతో ట్రాక్టర్లు, ఎద్దుల బండ్లు అధికంగా ఉన్న నేపథ్యంలో, వాటికి ఎటువంటి ఖర్చు లేకుండా రేడియం స్టిక్కర్లు అంటించే కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బాపట్ల డీఎస్పీ జి. రామాంజనేయులు, ఎస్‌బీ ఇన్స్పెక్టర్ జి. నారాయణ, బాపట్ల రూరల్ ఇన్స్పెక్టర్ కె. శ్రీనివాసరావు, ఎస్ఐ ఎం. శ్రీనివాసులు తదితర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నగరం కళాశాలలో జాబ్‌మేళా

**నగరం, డిసెంబర్26, ప్రభాతవార్త:** నగరం కళాశాలలో ప్రముఖ కంపెనీలతో జాబ్ మేళా నిర్వహించినట్లు శ్రీవెలగపూడి రామకృష్ణ స్మారక కళాశాల సెక్రటరి కరస్పాండెంట్ వల్లభనేని బుచ్చయ్య చౌదరి అన్నారు. శుక్రవారం ఐడియా జెన్ టెక్నాటజీస్, శ్రీవెలగపూడి రామకృష్ణ



మెమోరియల్ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో క్యాంపస్ రిక్రూట్మెంట్ నిర్వహించారు. క్యాంపస్ ఇంటర్వ్యూలో సుమారు 200మంది హాజరు అవ్వగా 67 మంది ఆఫర్ లెటర్ అందుకున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అనగాని హరికృష్ణ అన్నారు. ఎంపికైన 44 విద్యార్థులు టాటా ఎలక్ట్రానిక్స్, హోసూర్ కు ఎంపిక అవ్వడము అభినందనీయమని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఆఫీస్ సూపరిడెంట అమరేష్ , విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## రంగా ఆశయ సాధన కోసం యువత కృషి చేయాలి

### సొసైటీ అధ్యక్షులు కొఠారు ఆంజనేయులు

**కొల్లిపర, డిసెంబర్ 26 (ప్రభాతవార్త) :** మండలంలోని అత్తోట, చక్రాయపాలెం, దావులూరుపాలెం గ్రామాల్లో శుక్రవారం మాజీ ఎమ్మెల్యే వంగవీటి మోహనరంగా 37వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. నాయకులు యర్రు వెంకయ్య నాయుడు, చందు సత్యనారాయణ,



బొద్దులూరి అశోక్‌నాయుడు, దాసరి నరసయ్య, అల్లాభక్షు, చందు సుధీర్‌కుమార్, పసుపులేటి నాగరాజు, పసుపులేటి అవినాష్, నాగరాజు, రంగా విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షులు కొఠారు ఆంజనేయులు మాట్లాడుతూ పేద కుటుంబాలను ఆదుకున్న ప్రజా నాయకుడు అన్నారు. ముఖ్యంగా రంగా మరణం కాపు వర్గానికి తీరనిలోటన్నారు. రంగా ఆశయ సాధన కోసం యువత కృషి చేయాలన్నారు.

## ఘనంగా వంగవీటి రంగా 37వ వర్ధంతి



**నగరం, డిసెంబర్26, ప్రభాతవార్త:** బడుగు బలహీన వర్గల అభ్యున్నతి పాటుపడిన గొప్ప నాయకుడని మెపిదేవి శ్రీనివాసరావు అన్నారు. మండల కేంద్రంలో ప్రధాన కూడలిలో ఏర్పాటు చేసిన వంగవీటి రంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విజయవాడలో పుట్టి పేదలకోసం జీవితాన్ని అంకితం చేసారని, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అంతటా లక్షల సంఖ్యలో అభిమానులను సంపాదించుకున్న ప్రజా నాయకుడిగా చరిత్రలో నిలిచిపోయారన్నారు. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటం చేసిన నాయకుడిగా రంగా యువతకుఆదర్శమని పేర్కొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమంల నిర్వహించారు. ఈ కార్యక్రంలోజనసేన పార్టీ నేత చందు సాంబశివరావు, తెలుగుదేశం పార్టీ నగరంమండల అధ్యక్షులు చింతల సుబ్బారావు, నగరం గ్రామ సర్పంచ్ ఇంకొల్లు రామకృష్ణ, వెంకటేశ్వరావు, వీరయ్య, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## సనాతన హిందూ ధర్మానికి ఆలయాలే గొప్ప ప్రతీక

**చెరుకుపల్లి, డిసెంబర్ 26, ప్రభాతవార్త :** సనాతన హిందూ ధర్మానికి ఆలయాలే గొప్ప ప్రతీకమని రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రివర్యులు అనగాని సత్యప్రసాద్ సోదరుడు అనగాని శివప్రసాద్ అన్నారు. మండలంలోని కనగాల గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ గంగా పార్వతి సమేత శ్రీ పృధ్వీశ్వర స్వామి వారి దేవస్థాన నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆలయ కమిటీ చైర్మన్గా తుళ్లూరు సాంబయ్య ను, సభ్యులుగా పోతర్లంక గంగాధర్, గుర్రం వెంకటసుబ్బారావు, బచ్చు గోపాలకృష్ణయ్య ,ధూపం భ్రమరాంబ ,ఇట్లా తిరుపతమ్మ, తిరువూరు



సదాశివ నారాయణరావు, దబ్బకూటి నాగలక్ష్మి, ఓలేటి హనుమంతరావు లచే ఆలయ అధికారి తులసీదాస్ ఆధ్వర్యంలో అనగాని శివప్రసాద్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా అనగాని మాట్లాడుతూ ఆలయాలు భక్తుల మనోభావాలకు అనుగుణంగా, ఆధ్యాత్మికతకు నిలయాలని అన్నారు. వాటిని భావితరాలకు మరింత ఉన్నతంగా అందించాల్సిన బాధ్యత ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుల ప్రధాన లక్ష్యమని అన్నారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు దివి రాంబాబు, పూషడపు కుమారస్వామి, మల్లాది రామకృష్ణ, గుర్రం మురహరి ,సుబ్బరామయ్య, ఉయ్యూరు వెంకట శివ, రాము, ఆలయ ప్రధాన అర్చకులు చావలి జనతారావు, గుమస్తా సుధాకర్ ,స్థానిక టిడిపి నాయకులు, కార్యకర్తలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## దేవాలయం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచండి : ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్

**పొన్నూరు, డిసెంబర్ 26, ప్రభాతవార్త:** భక్తుల మెప్పు పొందేవిధంగా దేవాలయం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఎమ్మెల్యే ధూళిపాళ్ళ



నరేంద్రకుమార్ సూచించారు. స్థానిక శ్రీ సుందరవల్లీ రాజ్యలక్ష్మి సమేత సాక్షి శ్రీ భావనారాయణస్వామివారి దేవాలయాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా దేవాలయం పరిసరాలను కలియ తిరిగారు. దేవాలయంలో దాతల సహకారంతో ఏర్పాటు చేస్తున్న నీటి కుళాయిలను ఆయన పరిశీలించారు. ఈ దేవాలయం పురాతనమైనదనప్పటికీ ఆలనా పాలనా కరువు అయిందన్నారు. ఈ దేవాలయానిన గాడిలో పెట్టాల్సిందేనన్నారు. దేవాలయంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు సంబంధించిన విషయాలను ధర్మకర్తల మండలి సభ్యులతో చర్చించారు. గత ప్రభుత్వ హయాంలో దేవాలయం చుట్టూ ఉన్న నాపరాళ్ళను తొలగించి, మట్టి తరలించారు. దీంతో దేవాలయం చుట్టూ పల్లంగా ఉండడంతో వర్షపునీరు బయటకు వెళ్ళేందుకు ఇబ్బందికరంగా మారింది. వర్షం వస్తే దేవాలయం కోనేరులా మారుతుంది. దీనికి కూడా పరిష్కారం చేయాలని ధర్మకర్తల మండలికి సూచించారు. దేవాలయాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తల మండలి సభ్యులు శిఖాకొల్లి గుర్నాధరావు, ధరణికోట సాయికిరణ్, ఆకురాతి శ్రీనివాసరావు, గుడివాడ పవన్, ఎక్స్ అఫిషియో సభ్యుడు పొన్నూరు బాలగంగాధర తిలక్ తదితరులున్నారు.

## మత్తు, గంజాయి వంటి మాదక ద్రవ్యాలు నియంత్రణకు అధికారులు చర్యలు తీసుకోవాలి

**బాపట్ల, డిసెంబర్26, ప్రభాతవార్త:** మత్తు, గంజాయి వంటి మాదక ద్రవ్యాలు నియంత్రణకు అధికారులు సంయుక్తంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. మత్తు మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగం, నియంత్రణపై జిల్లాస్థాయి కమిటీ సమీక్ష సమావేశాన్ని కలెక్టర్ అధ్యక్షతన స్థానిక కలెక్టరేట్ లో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గంజాయి ఉత్పత్తుల నియంత్రణ, మహిళలపై నేరాల నియంత్రణలో బాపట్ల జిల్లా రాష్ట్రంలోనే ఐదో స్థానంలో నిలిచిందన్నారు. ఈ విషయంపై ఇటీవల కలెక్టర్ల సమావేశంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నుంచి బాపట్ల జిల్లా ఎస్పీ ప్రశంసలు అందుకున్నారని అభినందించారు. మూడో స్థానంలో రావడానికి అధికారులు కృషి చేయాలన్నారు. మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల భారిన యువత పడకుండా తప్పించగలిగామన్నారు. గుర్తించిన 71 ప్రాంతాలలో చిల్లచెట్ల తొలగింపు, సీసీ కెమెరాలు ఏర్పాటు, వినియోగంలో లేని భవనాలపై నిఘా ఉంచాలన్నారు. ఈగల్ టీం సమర్థంగా పనిచేస్తుందన్నారు. గంజాయి వంటి మాదక ద్రవ్యాల నియంత్రణపై పాఠశాలలు, కళాశాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వివరించారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ గంజాయి వంటి మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాల నియంత్రణపై పటిష్టమైన చర్యలు తీసుకున్నామన్నారు. గంజాయి వినియోగించే 71 ప్రాంతాలను పోలీసులు గుర్తించారన్నారు. ఈగల్ టీం సమర్థంగా పనిచేస్తుందన్నారు. మత్తు పదార్థాలు మాదక ద్రవ్యాలు నియంత్రణపై చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. గంజాయి ఉత్పత్తులు పూర్తిగా అరికట్టా మన్నారు. ఒడిస్సా ప్రాంతం నుంచి గంజాయి దిగుమతి సైతం



అరికట్టామన్నారు. ఆ రాష్ట్రం నుంచి పనులపై జిల్లాకు వచ్చిన కూలీలు ఉన్న ప్రాంతాలను గుర్తించి అవగాహన కల్పించాలన్నారు. ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఆర్డీవో లు, డీఎస్పీలు, కమిటీలోని ఆయా శాఖల జిల్లా అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు బహుమతులు అందజేత

**పెదనందిపాడు డిసెంబరు 26 (ప్రభాతవార్త)** పెదనందిపాడు మండలం పాలపర్రు లోని శ్రీ నరసింహ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఈనెల 21. 22 .23 తేదీలలో కాకినాడలో జరిగిన కాకినాడలో జరిగిన రాష్ట్రస్థాయి చెకుముకి పోటీలలో ఈ పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానాన్ని పొందారు ఈ సందర్భంగా శుక్రవారం



ఏర్పాటుచేసిన అభినందన కార్యక్రమంలో ఆ విద్యార్థులకు పలువురు ప్రముఖులు పలు రకాల బహుమతులను అందజేశారు . పరిటాలవారి పాలెం కు చెందిన పూర్వ విద్యార్థి ఒక్కొక్క విద్యార్థికి ..1000 చొప్పున నగదు కూడా అందజేశారు. ఈ పాఠశాల పూర్వ విద్యార్థి ముద్దన నారాయణరావు మూడవ వర్ధంతి సందర్భంగా, వారి బావ చిమ్మినేని వెంకటసుబ్బారావు, పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు, పరీక్షలకు అవుసరమైన రైటింగ్ ప్యాడ్స్, పెన్నులు, పెన్సిల్స్, ఎరేజర్, షార్పనర్లు అందజేశారు . ఈ కార్యక్రమాలకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ముద్దన శ్రీనివాసరావు అధ్యక్షత వహించగా పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం కోశాధికారి దొప్పలపూడి రమేష్ బాబు మాట్లాడుతూ ,విద్యార్థులు పాల్గొన్న ప్రతి పోటీలో విజయం సాధించడం ఎంతో సంతోషదాయకంగా ఉందని అన్నారు. పాఠశాల ఖ్యాతిని రాష్ట్రం నలుమూలల వ్యాపింప జేస్తున్న విధ్యార్థులను వారు ప్రత్యేకంగా అభినందించారు. హెచ్ఎం ముద్దన శ్రీనివాసరావు మాట్లాడుతూ, ఇదే స్ఫూర్తిని కొనసాగించి పదవ తరగతి పరీక్షలలో జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి సాధించాలని కోరారు. ఈ కార్యక్రమం లో చిమ్మినేని నరేష్ ,జంపని రామారావు, పాఠశాల ఉపాధ్యాయులు ముద్దన సత్యనారాయణ, ఎస్.కె.షఫీ, ఎస్.కె.రహీం , నరేష్ కుమార్. శివలీల. తదితరులు పాల్గొన్నారు.

## దాతల ఉదారతను ప్రతి ఒక్కరూ గుర్తించాలి : ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్

పొన్నూరు, డిసెంబర్ 26, ప్రభాతవార్త: దాతల ఉదారతను ప్రతి ఒక్కరూ గుర్తించాలని, దాతలు ఏ ఉద్దేశంతో సత్రాలను నిర్మించారో, ఆ ఉద్దేశానికి భంగం వాటిల్లకుండా చూడాల్సిన అవసరం ప్రస్తుతం ఉన్న ట్రస్టీలు, అధికారులపై ఉందని ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ అన్నారు. స్థానిక ఐలాండ్ సెంటర్‌లోని ఆలపాటి సుబ్బారాయుడు ధర్మసత్రం వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే నరేంద్రకుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. పూర్వ కాలం నుంచి ఎంతో మందికి ఈ సత్రాలు ఆసరగా ఉన్నాయన్నారు. నాటి నుంచి నేటి వరకు కూడా ఈ సత్రాలను నిర్వహిస్తున్న ట్రస్టీలు ధన్యులని చెప్పారు. అధికారులు కూడా దాతల లక్ష్యాన్ని ముందుకు తీసుకెళ్ళేవిధంగా చూడాలన్నారు. ఈ సందర్భంగా పలువురు దివ్యాంగులకు మూడు చక్రాల సైకిళ్ళను అందజేశారు. పలువురు పేదలకు అన్న సంతర్పణ, దుప్పట్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్‌బాబు, రాష్ట్ర అర్బన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ వడ్రాణం మార్కండేయబాబు,



ఫౌండర్ ఫ్యామిలీ సభ్యుడు ఆలపాటి శ్రీనివాసరావు, కార్యనిర్వహణాధికారి ఎన్‌వీఎన్ మల్లేశ్వరి, ఛైర్మన్ గుప్తా, గోవాడ వెంకటకృష్ణారావు, బొర్రు రామారావు, మాదల వెంకటేశ్వరరావు, షేక్ కరిముల్లా, బండారుపల్లి శ్రీనివాసరావు, కొత్తమాసు రామకృష్ణ, ఆరె ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## వ్యభిచారగృహాన్ని సీజ్ చేసిన తహసీల్దార్ గోపాలకృష్ణ

**తెనాలి మున్సిపాలిటీ డిసెంబర్26(ప్రభాతవార్త):** పట్టణంలోని సాలిపేటలో టెలిఫోన్ ఎక్స్చేంజి వెనుక వీధిలోని చావలి పద్మావతి, గత కొన్నేళ్లుగా వ్యభిచారం నిర్వహిస్తుందని, అందిన సమాచారం మేరకు తాహసీల్దార్ కెవి.గోపాలకృష్ణ, డిఎస్పి జనార్ధనరావు నేతృత్వంలో వన్ టౌన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ మల్లిఖార్జునరావు పర్యవేక్షణలో శుక్రవారం, పద్మావతి ఇంటిని సంవత్సరం పాటు సీజ్ చేశారు. ఇటీవల కూడా అదే ఇంట్లో



వ్యభిచారం నిర్వహిస్తూ, సదరు నిర్వాహకులు పోలీసులకి పట్టుబడి, రిమాండ్ చేసి వచ్చారని, ఐనాకూడా తీరు మార్చుకోకుండా ఇదేరీతిన వ్యవహరించటంతో, తగినశాస్తి జరిగిందని స్థానికులు హర్షం వ్యక్తం చేసారు.

## వైకుంఠపురంలో ముక్కోటి ఏకాదశి ఏర్పాట్లు పరిశీలించిన సబ్‌కలెక్టర్

**తెనాలి మున్సిపాలిటీ డిసెంబర్26, (ప్రభాతవార్త):** పట్టణంలోని వైకుంఠపురములో వేంచేసిన శ్రీ లక్ష్మీ పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం నందు, ముక్కోటి ఏకాదశి ఉత్సవాల్లో భాగంగా గత ఏడు రోజులుగా జరుగుతున్న ఉత్సవాలు చివరిరోజు మంగళవారం ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా దేవాలయము నందు ఏర్పాట్లను పరిశీలించుటకు సబ్ కలెక్టర్ సంజన సిన్హా శుక్రవారం ఆలయానికి విచ్చేసి ముక్కోటి ఏకాదశి ఉత్సవాల సందర్భంగా, పలు శాఖల అధికారులతో, సమీక్ష సమావేశం నిర్వహించారు. భక్తులకు ప్రశాంతమైన వాతావరణంలో శ్రీ స్వామివారి దర్శనభాగ్యం కలిపించుటకు, భక్తులకు కల్పించు సౌకర్యాలు, ప్రత్యేక క్యూ లైన్ లో ఏర్పాటు, మొదలగు విషయముల గురించి పలు ప్రభుత్వ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి శ్రీస్వామివారి దర్శనమునకు వచ్చు భక్తులకు కల్పించు సౌకర్యములపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో, డిఎస్పి బి. జనార్ధనరావు, తాహసిల్దార్ కెవి. గోపాలకృష్ణ మరియు దేవాదాయ ధర్మాదాయ శాఖ నుండి ముక్కోటి ఏకాదశి ఉత్సవాల పరిశీలకునిగా, కోటప్పకొండ శ్రీ త్రికోటేశ్వర స్వామి వారి దేవస్థానానికి చెందిన సహాయ కమిషనర్ మరియు కార్యనిర్వహణాధికారి చంద్రశేఖర్, మరియు పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ లు బి. మల్లికార్జునరావు, రాములు నాయక్, ఎస్.సాంబ శివరావు పాల్గొన్నారని, శ్రీలక్ష్మీ పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం, వైకుంఠపురం కార్యనిర్వహణాధికారి మంతెన అనుపమ ఒక ప్రకటనలో తెలిపారు.



# పల్నాడు జిల్లా వార్త



## ఘనంగా వంగవీటి మోహనరంగా వర్ధంతి





వినుకొండ, డిసెంబర్26, ప్రభాతవార్త: ప్రజా నాయకుడు వంగవీటి మోహన్ రంగా 37వ వర్ధంతి సందర్భంగా కూటమి నాయకులు ఘన నివాళులర్పించారు. ప్రభుత్వ చీఫ్ విప్, సీనియర్ శాసనసభ్యులు జీవి ఆంజనేయులు గారి ఆదేశాలతో కూటమి నాయకులు శుక్రవారం పట్టణంలోని మార్కాపురం రోడ్డు మహాలక్ష్మమ్మ చెట్టు వద్ద గల వంగవీటి మోహన రంగా కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు నాగ శ్రీను రాయల్, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ మాదినేని ఆంజనేయులు, కౌన్సిలర్ గంధం కోటేశ్వరరావు, సొసైటీ డైరెక్టర్ రాయల్ శ్రీకాంత్, పట్టణ పార్టీ అధ్యక్షులు బొంకూరి రోశయ్య, తదితరులు పాల్గొన్నారు.

## దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన దార్శనికుడు వాజ్‌పేయి

వినుకొండ, డిసెంబర్26, ప్రభాతవార్త: బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్ ఆదేశాల మేరకు పల్నాడు జిల్లా అధ్యక్షులు ఏలూరు శశి కుమార్ సూచనతో పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి కట్టా సుబ్బారావు అధ్యక్షతన వినుకొండ నియోజక వర్గం బిజెపి పార్టీ కార్యాలయంలో భారతరత్న మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్ పేయి శతజయంతి ఉత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షురాలు జి. సుజాత, వినుకొండ పట్టణ అధ్యక్షులు కోట సుధాకర్, సీనియరు నాయకులు కారం శెట్టి రత్నాకర్, శివాజీ, వెంకయ్య, నరసింహారావు, ఎస్సీ నాయకుడు కోటయ్య, మాజీ కో కన్వీనర్ లాయర్ అప్పారావు, ఎస్టీ బిజెపి నాయకుడు తిలక్ తదితరలు పాల్గొన్నారు.



## మొదటి ప్రాధాన్యత ఓటు వేసి మెజార్టీతో గెలిపించండి

### -సత్తెనపల్లిలో బార్ కౌన్సిల్ ఎన్నికల ప్రచారంలో సీనియర్ న్యాయవాది శాంతకుమార్.

సత్తెనపల్లి, డిసెంబర్ 26, ప్రభాతవార్త: త్వరలో జరగనున్న ఏపీ బార్ కౌన్సిల్ సభ్యుల ఎన్నికల్లో నాకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని గుంటూరు బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు, సీనియర్ న్యాయవాది జి. శాంతకుమార్ అభ్యర్థించారు. శుక్రవారం పల్నాడు జిల్లా సత్తెనపల్లి వచ్చిన ఆయన స్థానిక కోర్టులలో న్యాయవాదుల ఓట్లు అభ్యర్థిస్తూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. న్యాయవాదులకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ వారి సమస్యలు, హక్కుల సాధన కోసం తన వంతుగా కృషి చేసినట్లుగా ఆయన తెలిపారు. 2018లో జరిగిన ఎన్నికల్లో గెలుపు దిశగా వెళ్లానని ఈసారి గెలిపించి మీ గొంతుకనై నిలబడే అవకాశం కల్పించాలని ఆయన కోరారు. అనంతరం గోడ చిత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో న్యాయవాదులు ఉటుకురు పాపారావు, దాసరి జ్ఞాన్ రాజ్ పాల్, పి.వి.ఎన్.ఎస్ శాస్త్రి, , రాజవరపు శివనాగేశ్వరరావు, జొన్నలగడ్డ విజయ్ కుమార్, చావా బాబురావు, షేక్.బాలిసైదా, సూరె వీరయ్య, బాదినీడు శ్రీనివాస్ యాదవ్, పిల్లి సుధీర్, బొమ్మిశెట్టి శ్రీనివాస్, ఎం.రామారావు, మన్నెం వెంకటేశ్వర్లు, పూర్ణ చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా వంగవీటి మోహనరంగా వర్ధంతి





సత్తెనపల్లి, డిసెంబర్ 26, ప్రభాతవార్త: బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి ప్రజా సమస్యల పోరాటానికై తన ప్రాణాలను సైతం అర్పించిన. మహనీయుడు వంగవీటి మోహనరంగా వర్ధంతి సందర్భంగా వడ్డవల్లి పోలేరమ్మ తల్లి గుడి వద్ద గల రంగా గారి విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించి. పేద మహిళలకు చీరలు పంపిణీ చేసి అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న శాసన సభ్యులు కన్నా లక్ష్మి నారాయణ. ఈ కార్యక్రమం లో వివిధ హోదాల్లో వున్న రాష్ట్ర జిల్లా నియోజకవర్గ పట్టణ మండల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## సత్తెనపల్లిలో ఘనంగా మహానటి సావిత్రి వర్ధంతి

సత్తెనపల్లి, డిసెంబర్ 26, ప్రభాతవార్త: పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణంలో స్థానిక ఎన్టీఆర్ కళా క్షేత్రంలో శుక్రవారం దివంగత మహానటి సావిత్రి 44 వ వర్ధంతి సందర్భంగా సావిత్రి అభిమానులు కంఠంనేని వెంకట సాంబశివరావు మెమోరియల్ సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. తొలిత సావిత్రి విగ్రహానికి సీనియర్ రంగస్థలం నటుడు ముట్లె రాంబాబు, బత్తినేని వెంకట లక్ష్మయ్య, పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఫోటో స్టూడియో సంఘం నాయకులు జువంగుల శ్రీనివాస్, ప్రజానాట్యమండలి సత్తెనపల్లి పట్టణ గౌరవాధ్యక్షులు కంబాల శ్రీనివాస్, ప్రజానాట్యమండలి సెక్రెటరి వి . అంకాళ్ళ ప్రభుదాస్, కాటుమాల నాగేశ్వరరావు, అంకాళ్ళ నాగరాజు, కాటుమాల దావీదు, భవిరిశెట్టి భద్రయ్య, పిల్లట్ల ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



## యెల్లనేడి శ్రీనివాస్‌కు ఎమ్మెల్యే 'కన్నా' పరామర్శ




సత్తెనపల్లి, డిసెంబర్ 26, ప్రభాతవార్త: సత్తెనపల్లి పట్టణానికి చెందిన యెల్లెనేడి శ్రీనివాస్ గుంటూరు ప్రైవేట్ హాస్పిటల్ లో గుండె శస్త్ర చికిత్స చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్నారు. తాజాగా ఆయన్ని సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పరామర్శించారు. కార్యక్రమంలో పలువురు నేతలు ఉన్నారు.

## సాంబశివరావుకు ఘననివాళి



సత్తెనపల్లి, డిసెంబర్ 26, ప్రభాతవార్త: గుంటూరు శ్రీ కన్వెన్షన్ నందు టీవీ9 మేనేజింగ్ ఎడిటర్ రజనీకాంత్ తండ్రి సాంబశివరావు దశదిన కార్యక్రమానికి హాజరై చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసిన సత్తెనపల్లి శాసన సభ్యులు కన్నా లక్ష్మీనారాయణ తదితరులు.

## రాజ్యాంగ వ్యతిరేక శక్తిగా వ్యవహరించిన చిప్పగిరి పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలి



సత్తెనపల్లి, డిసెంబర్ 26, ప్రభాతవార్త: పల్నాడు జిల్లా, సత్తెనపల్లి పట్టణంలోని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నాలుగు న్యాయస్థానాల్లో విధులను న్యాయవాదులు బహిష్కరించారు. ఆంధ్రప్రదేశ్ బార్ ఫెడరేషన్ పిలుపులో భాగంగా ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా అన్ని న్యాయస్థానాల్లో న్యాయవాదులు విధులు బహిష్కరించారు.దానిలో భాగంగా సత్తెనపల్లి లో కూడా నిర్వహించారు.శుక్రవారం ఉదయం తాలూకా న్యాయస్థాన ప్రాంగణంలో న్యాయదేవత విగ్రహం వద్ద బార్ అసోసియేషన్ అధ్యక్షులు గంగూరి అజయ్ కుమార్ ఆధ్వర్యంలో న్యాయవాదులు నిరసనలు చేశారు.దీనికి కారణం కర్నూలు జిల్లా,పత్తికొండ లోని న్యాయస్థానంలో ,చిప్పగిరి పోలీస్ స్టేషన్ లో నమోదు అయిన ఒక క్రిమినల్ కేసులో ఉన్న ముద్దాయిని వారి న్యాయవాది న్యాయస్థానంలో సరెండర్ చేయటానికి సాక్షాత్తు న్యాయస్థానంలో హాజరు పెట్టగా అతను న్యాయస్థానంలో ఉండగా చిప్పగిరి పోలీస్ కానిస్టేబుల్ సదరు కోర్టు హాల్లో కి అక్రమంగా ప్రవేశించి దౌర్జన్య పూరితంగా నెట్టుకుంటూ అతని న్యాయవాది నీ కూడా నెట్టివేసి పోలీస్ జీబు ఎక్కించారు. గంగూరి అజయ్ కుమార్ తోపాటు, ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్ సభ్యులు సోమసాని బ్రహ్మానంద రెడ్డి తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.

## ఉత్సాహంగా రెండో రోజు ఒంగోలు జాతి ఎడ్ల బల ప్రదర్శన పోటీలు

నరసరావుపేట, డిసెంబర్ 26 ప్రభాతవార్త :: పట్నంలోని సత్తెనపల్లి రోడ్ జిల్లా క్రీడా ప్రాంగణంలో జరుగుతున్న ఒంగోలు జాతి ఎడ్ల బల ప్రదర్శన పోటీలు రెండో రోజు ఉత్సాహంగా కొనసాగాయి. శుక్రవారం ఈ పోటీలను తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కొల్లి బ్రహ్మయ్య పర్యవేక్షించారు. పార్టీ నాయకులు కడియాల రమేష్ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ముఖ్యఅతిథిగా హాజరై రైతులను ఉద్దేశించి మాట్లాడారు. పోటీలకు మరో ముఖ్యఅతిథిగా చిలకలూరిపేట ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లారావు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ మాజీ సభాపతి డాక్టర్ కోడెల శివప్రసాదరావు స్ఫూర్తితో ఒంగోలు జాతి ఎద్దుల పోటీలను ఘనంగా నిర్వహిస్తున్న






కమిటీ సభ్యులకు అభినందనలు తెలిపారు. పశు సంపద మన వ్యవసాయ రంగానికి పెద్ద ఆస్తి అని వారు తెలిపారు. ఒంగోలు జాతి పశుసంపదను కాపాడుకోవాల్సిన అవసరం రైతు సోదరులతో ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. రైతుల కుటుంబాలలో పశుసంపద కూడా ఒక భాగం అన్నారు. వృషభరాజాలను పోటీలకు సిద్ధం చేయడంతో పాటు ప్రతిరోజు వాటిని పోషించటం రైతులకు భారంగా ఉందన్నారు. ప్రభుత్వం వాటికి సంబంధించిన దాణ వంటివి రాయితీపై అందిస్తున్నాయని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం వ్యవసాయ రంగానికి అత్యంత ప్రాధాన్యతను అందిస్తుందన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలను కల్పించడంతోపాటు మార్కెట్ యార్డుల్లోనూ పత్తి, మిర్చి, ధాన్యం వంటి పంటల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున రైతు సోదరులు, పశుపోషకులు పాల్గొని రెండో రోజు పోటీలను విజయవంతం చేశారు.

## ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ముంతాజ్

పెదకూరపాడు, డిసెంబర్ 26, ప్రభాతవార్త: నియోజకవర్గ శాసనసభ్యులు భాష్యం ప్రవీణ్‌ను జిల్లా టిడిపి ఉపాధ్యక్షురాలిగా నూతనంగా ఎన్నికైన షేక్ ముంతాజ్ మర్యాదపూర్వకంగా కలిశారు. తనకు అవకాశం కల్పించినందుకు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక కష్టపడ్డ ప్రతి ఒక్క నాయకులకు అవకాశం కల్పించి మంచి మంచి పదవులు అందిస్తూ కులాలకు మతాలకు అతీతంగా ప్రతి ఒక్కరికి పెద్దపీట వేస్తున్నామని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా నియోజకవర్గంలో జిల్లా స్థాయి రాష్ట్రస్థాయి పదవులను మన నాయకులకు



అందించామన్నారు. మీకు ఇచ్చిన పదవితో బాధ్యతాయుతంగా కష్టపడి పని చేసి పార్టీకి మరింత పేరు తీసుకురావాలని ముంతాజ్ కు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు ఏటుకూరు బ్రహ్మయ్య, సొసైటీ చైర్మన్ ఏటుకూరు రత్నకుమార్, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ వెన్న సాంబిరెడ్డి, మాజీ మార్కెట్ యాడ్ చైర్మన్ రామగోపాల్ రావు, మాజీ ఎంపీపీ గల్ల బాబురావు, డీసీ చైర్మన్ వడ్లమూడి అప్పారావు, మైనారిటీ నాయకులు మస్తాన్ షరీఫ్, దిలీప్, మలాట్ రఫీ ముస్లిం మైనార్టీ పెద్దలు టిడిపి అభిమానులు పాల్గొన్నారు.

## ప్రతి గురువారం షిర్డీసాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు, అన్నదానం

క్రోసూరు, డిసెంబర్ 26, ప్రభాతవార్త: క్రోసూరు మండలం క్రోసూరులోని షిరిడి సాయి బాబా దేవాలయంలో ప్రతి గురువారం ప్రత్యేక పూజలు, అలంకరణతో భక్తులకు సాయి బాబా దర్శనమిస్తున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ మన్నెం వెంకట్రావు మాట్లాడుతూ గురువారం రోజు విరాళాలు ఇవ్వదలచిన దాతలు ముందుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని తెలిపారు. అలాగే ప్రతి గురువారం రోజు నిరుపేదలు, వృద్ధులను దృష్టిలో ఉంచుకుని సుమారు 100 మందికి ఉచిత అన్నదాన కార్యక్రమాన్ని షిరిడీ సాయిబాబా సన్నిధిలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.



## రైతులకు నానో యూరియాపై అవగాహన

క్రోసూరు, డిసెంబర్ 26, ప్రభాతవార్త: వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో పీసపాడు గ్రామంలో రైతులకు నానో యూరియా వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రైతు దగ్గుల కోటిరెడ్డి మొక్కజొన్న పొలంలో డ్రోన్ ద్వారా నానో యూరియా పిచికారి ప్రదర్శనను చేపట్టారు. మండల వ్యవసాయ అధికారి వేణుగోపాల్ మాట్లాడుతూ సాధారణ యూరియాకు ప్రత్యామ్నాయంగా నానో యూరియాను రైతులు వినియోగించవచ్చని తెలిపారు.



## ప్రజల కోసం సీపీఐ వందేళ్ల పోరాటం: 'మునగోటి'



క్రోసూరు, డిసెంబర్ 26, ప్రభాతవార్త: భారత కమ్యూనిస్టు పార్టీ ప్రజల కోసమే గత 100 సంవత్సరాలుగా అలుపెరుగని పోరాటం చేస్తోందని పెదకూరపాడు నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి మునగోటి శ్రీనివాసరావు అన్నారు. సీపీఐ పార్టీ స్థాపనకు 100 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా శుక్రవారం క్రోసూరు నాలుగు రోడ్ల జంక్షన్‌లో పార్టీ జెండాను రైతు సంఘం నాయకులు కంచేటి పెద్దబ్బాయి ఆవిష్కరించారు. .మండల సీపీఐ కార్యదర్శి పోతుగంటి నాగేశ్వరరావు, హమాలీ సంఘం నాయకులు, యువజన సమైక్య నాయకులు మరియు ఇతరులు పాల్గొన్నారు.

## చిన్నారిని ఆశీర్వదించిన నేతలు



సత్తెనపల్లి ,డిసెంబర్ 26, ప్రభాతవార్త:సత్తెనపల్లి పట్టణంలోని గో సంరక్షణ శాల ఏసీ కళ్యాణ మండపంలో 24వ వార్డు కౌన్సిలర్, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి అచ్యుత శివప్రసాద్ తమ్ముడు అచ్యుత సుధీర్, హిమబిందుల కుమార్తె హేవనిక ఓణీల బహుకరణ వేడుక ఘనంగా జరిగింది. సత్తెనపల్లి నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ రెడ్డి, మాజీ మంత్రి అంబటి రాంబాబు. సహారా మౌలాలి నిమ్మకాయల రాజనారాయణ , చిట్టా విజయ భాస్కర్ రెడ్డి , భవనం రాఘవ రెడ్డి , కోటేశ్వర నాయక్ , మేడం ప్రవీణ్ కుమార్ రెడ్డి , గంగారపు అనూష , తుమ్మల వెంకటేశ్వర్లు గారు, హీరా కరిముల్లా , సిరిగిరి వెంకటరావు , సంకుల తిరుమల రావు , మధు, గుర్రాల పవన్ , షేక్ ఖాజా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఆ వీధిలోకి వెళ్లాలంటే.. ముక్కు మూసుకోవాల్సిందే.!

నరసరావుపేట టౌన్, డిసెంబర్ 26, ప్రభాతవార్త :: పట్నంలోని ప్రధాన వీధుల్లో ఎక్కడ చెత్త అక్కడే ఉండిపోయి నివాసితులతో పాటు అటువైపు రాకపోకలు సాగించేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాత పల్నాడు బస్టాండ్ లోని నాగసరపు కాంప్లెక్స్ వద్ద నిత్యం పెద్ద ఎత్తున చెత్త, చెదారాన్ని వ్యాపారులు పడవేస్తున్నారు. వారితోపాటు ఆ వీధిలోని నివాసితుల సైతం ఇళ్లల్లోని వ్యర్థాలను అక్కడ వేస్తూ ఉండటంతో అక్కడ పరిస్థితి దారుణంగా మారింది. వ్యాపారులు కుళ్ళిన పండ్లు, ఇతర వ్యర్థాలు అక్కడ వేయడంతో దుర్గంధం వెదజల్లుతుంది. స్థానిక షాపులు వారు ఎన్ని మార్లు ఈ సమస్యపై ఫిర్యాదు చేసిన అధికారులు పట్టించుకోవడం లేదని చెబుతున్నారు. రెండు,



మూడు రోజులకు ఒకసారి అక్కడ చెత్తను మున్సిపల్ సిబ్బంది తరలిస్తూ ఉండడంతో ఆ రోజుల్లో దోమలు, వాసనతో ప్రజలు సమస్యలు ఎదుర్కొంటున్నారు. వైద్యశాలలు సైతం సమీపంలో ఉండడంతో రోగులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. ఈగలు, దోమలతో ఆ ప్రాంతమంతా ఇబ్బందిగా మారి అటువైపు రాకపోకలు సాగించేందుకు సైతం సమస్యలను ఎదుర్కొంటున్నారు. గతంలోనూ ఎన్నో ఫిర్యాదులు వచ్చినా సమస్య పరిష్కారం కావడం లేదని స్థానికులు వాపోతున్నారు. కనీసం ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు డంపింగ్ యార్డ్ గా మారిన వీధిని శుభ్రం చేసి పదేపదే ఈ సమస్య పునరావతం కాకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

## వంగవీటి మోహన రంగాకు విడదల రజనీ ఘననివాళి

చిలకలూరిపేట, డిసెంబర్ 26, ప్రభాతవార్త: ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన నాయకుడు, పేదల కోసం ప్రాణాలర్పించిన స్వర్గీయ వంగవీటి మోహన రంగా వర్ధంతి సందర్భంగా చిలకలూరిపేట పట్టణం మరియు గణపవరం లో రంగా విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించిన మాజీ మంత్రి విడదల రజిని పాల్గొన్నారు.



## గుడ్ మార్నింగ్.. చిలకలూరిపేట...

చిలకలూరిపేట, డిసెంబర్ 26, ప్రభాతవార్త: శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు ఆదేశాల మేరకు టీడీపీ పట్టణ అధ్యక్ష, కార్యదర్సులు "గుడ్ మార్నింగ్ చిలకలూరిపేట" కార్యక్రమం నిర్వహించారు. ఈరోజు ఉదయం 630 గంటల నుంచి 800 గంటల వరకు జరిగిన ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు పఠాన్ సమద్ ఖాన్, ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి, 26వ వార్డులో క్లస్టర్, యూనిట్, అధ్యక్ష, కార్యదర్సులు, బూత్ కన్వీనర్లు మరియు ముఖ్య నాయకులను కలుపుకొని పర్యటిస్తూ స్థానికంగా ఉన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లడం జరిగింది. వార్డులో కావలసిన రోడ్లు, డ్రైన్లు నోట్ చేసుకొని గౌరవ శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు దృష్టికి తీసుకువెళ్తామని తెలియచేసారు. అనంతరం అన్నా కాంటీన్ ను పార్టీ నాయకులు సందర్శించారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జి మస్తాన్ వల్లి, కాన్సిలర్ నజీరున్నిసా బేగం, వార్డ్ అధ్యక్షులు రాఘవులు, అన్నపురెడ్డి లక్ష్మి, శివయ్య, అజీజ్, అహమద్, నారాయణ, బాజీ, వెంకటేశ్వర్లు మాస్టారు, బద్రి, బ్రూస్లీ, 8వ క్లస్టర్ ఇంచార్జి ముల్లా కరీముల్లా, 9వ కోక్లస్టర్ సయ్యద్ వహాబ్, పట్టణ కమిటీ కార్యదర్శి ముస్తఫా, అజహారుద్దీన్, కరీముల్లా, బాలాజీ, శ్రీకాంత్, అబ్దుల్లా, తదితరులు పాల్గొన్నారు



## సచివాలయాల్లో మున్సిపల్ కమిషనర్ ఆకస్మిక తనిఖీ

చిలకలూరిపేట, డిసెంబర్ 26, ప్రభాతవార్త: సమయపాలన పాటించాలని సచివాలయ ఉద్యోగులకు సూచనలువాటర్ ట్యాక్స్, ఇంటి పన్నుల వసూలు వేగ వంతం చేయండి.. చిలకలూరిపేట : స్థానిక పురపాలక సంఘం పరిధిలోని సచివాలయాలను శుక్రవారం నాడు ఆకస్మికంగా తనిఖీ చేసిన చిలకలూరిపేట మున్సిపల్ కమిషనర్ పి శ్రీహరిబాబు 15 వ సచివాలయంలో డ్యూటీ చార్టును ,అటెండెన్స్ బుక్ ను పరిశీలించి ప్రభుత్వ ఆదేశించిన సర్వే పనులను త్వరతగతిన పూర్తి చేయాలని అదేవిధంగా వాటర్ ట్యాక్స్ వసూలు, ఇంటి పన్నులు వసూలు కూడా వేగవంతం చేయాలని సూచనలు చేశారు అదే విధముగా ప్రజా ప్రతినిధులు ప్రజల నుంచి సచివాలయాలలో అందు బాటులో ఉండటం లేదని ఫిర్యాదులు వస్తున్నాయి అని సచివాలయాల సిబ్బంది సమయ పాలన పాటించాలని సర్వేల పేరుతో కార్యాలయంలో అందుబాటులో లేక పోతే ఎలా అని ఆగ్రహం వ్యక్తం చేశారు



## గృహావసరాలకు విద్యుత్ అదనపు లోడ్ పెంచుకునేందుకు 50శాతం చార్జిల్లో రాయితీకి గడువు

చిలకలూరిపేట, డిసెంబర్ 26, ప్రభాతవార్త: విద్యుత్ వినియోగదారులకు విజ్ఞప్తి గృహావసారాలకు వినియోగించు విద్యుత్ సర్వీసులకు అదనపు లోడు పెంచుకొనుటకు విద్యుత్ శాఖ కిలోవాట్ కు డెవోలోప్మెంట్ చార్జిలలో 50 రాయితీ 31.12.25 లోపు అనగా 4 రోజులు మాత్రమే గడువు వున్నది.కనుక మీరు తీసుకొన్న లోడ్ కంటే అధిక లోడు వాడుచున్నచో సమీపంలో వున్న విద్యుత్ రెవిన్యూ కార్యాలయమునందు సంప్రదించి అదనపు లోడులో వున్న డెవోలోప్మెంట్ చార్జీ లో 50 రాయితీతో లోడుని క్రమబద్ధించుకోవాలని చిలకలూరిపేట ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వై. ఏడుకొండలు, తెలిపారు.

## బొప్పూడిలో పేకాట స్థావరాల పై ఎస్ఐ ఆకస్మిక దాడి

చిలకలూరిపేట, డిసెంబర్ 26, ప్రభాతవార్త: చేసిన ఎస్ఐ జి అనిల్ కుమార్‌బొప్పూడి గ్రామ పరిధిలోని కళ్యాణం మండపం పక్కన గల ఒక డాబా ఇంటిలో కోత ముక్క పేకాటా డుతున్నరని రాబడిన సమాచారం మేరకు చిలకలూరిపేట రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ జి అనిల్ కుమార్ వారి సిబ్బంది సహాయంతో అక్కడికి వెళ్లి కోత ముక్క ఆడుతున్న 11 మందిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి 1,25,700/ నగదు, ఆరు సెల్ఫోన్లు, రెండు కార్లు స్వాధీన పరుచుకొని కేసు నమోదు చేశారు.



## జనసేన పార్టీ కార్యాలయంలో ఘనంగా వంగవీటి రంగా వర్ధంతి

నరసరావుపేట టౌన్ డిసెంబర్ 26, ప్రభాతవార్త:: స్థానిక నరసరావుపేట జనసేన పార్టీ కార్యాలయంలో శుక్రవారం జనసేన పార్టీ ఇంచార్జి సయ్యద్ జిలాని ఆధ్వర్యంలో స్వర్గీయ వంగవీటి మోహన్ రంగా 37 వ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా వంగవీటి మోహన్ రంగ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా వారు నివాళులర్పించారు. వంగవీటి చేసిన సేవలను కొనియాడారు. ఆయన ఆశయాల సాధనకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు దుర్గా కుమారి, షేక్. అద్రుఫ్, అచ్చుల సాంబశివరావు, లీగల్ సెల్ బార్ అసోసియేషన్ ప్రసిడెంట్ ఎన్.వి. నాగరాజు, తిరుమలశెట్టి శ్రీనివాసరావు, ఆర్.కే. యాదవ్, ఆళ్ల శ్రీకాంత్, మిరియాల సోము, తదితరులు పాల్గొన్నారు.




## హెచ్ఐవి,ఎయిడ్స్ నియంత్రణకు మొబైల్ వాహనం

నరసరావుపేట, డిసెంబర్ 26, ప్రభాతవార్త ::ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ద్వారా ప్రజలకు హెచ్ఐవి ఎయిడ్స్ సేవలందించుటకు మొబైల్ ఇంటిగ్రేటెడ్ కౌన్సెలింగ్ టెస్టింగ్ సెంటర్ ఐ సి టి సి వాహన సేవలు కీలకం కానున్నాయని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి రవి వెల్లడించారు. శుక్రవారం స్థానిక వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం నందు హెచ్ఐవి, ఎయిడ్స్ నియంత్రణకు కొత్త సంచార ఐ సి టి సి వాహన సేవా వాహనాన్ని ప్రారంభించారు. వారు మాట్లాడుతూ సంచార వాహనం ఇంటింటికి వెళ్లి కౌన్సెలింగ్, టెస్టింగ్ అవగాహన కార్యక్ర మాలను అందించనున్నదని తెలిపారు. జిల్లా లెప్రసి, ఎయిడ్స్, టిబి అధికారి డాక్టర్ మాధవీలత మాట్లా డుతూ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ సహకారంతో సంచార హెచ్ఐవి కౌన్సిలింగ్ పరీక్ష కేంద్రాల వాహనాన్ని జిల్లాలో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మొబైల్ ఐ సి టి సి కేన్ద్ర దగ్గరలో ఉన్న వైద్య సిబ్బందితో, స్వచ్ఛంద సేవా సంస్థలతో, వాలంటర్స్ వ్యవస్థతో కలిసి పనిచేస్తుందన్నా రు. కార్యక్రమంలో జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ సిబ్బంది, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, టిబి నియంత్ర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు



## కుటుంబ కలహాలతో వివాహితుని బలవన్మరణం

నరసరావుపేట క్రైమ్, డిసెంబర్ 26, ప్రభాతవార్త :: కుటుంబ కలహాల నేపథ్యంలో పట్నానికి చెందిన వివాహితుడు ఒకరు బలవర్మణానికి పాల్పడ్డారు. గ్రామీణ పోలీస్ స్టేషన్ ఎస్ఐ చల్లా కిషోర్ తెలిపిన వివరాలు శుక్రవారం ఇలా ఉన్నాయి. నిమ్మ తోటకు చెందిన ఎడవల్లి రాఘవేంద్రరావు ఆయన భార్య శ్రావణి తో కలిసి జీవనం సాగిస్తున్నారు వారికి ఒక పాప, బాబు ఉన్నారు. ఆటో నడుపుతూ రాఘవేంద్రరావు కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఈ నేపథ్యంలో తరచుగా భార్యాభర్తల మధ్య కుటుంబ కలహాలు జరుగుతున్నాయి. మనస్థాపానికి గురైన రాఘవేంద్రరావు మండలంలోని పెట్లూరి వారి పాలెం గ్రామం వద్ద ఉన్న సాగర్ కాలవలో దూకి బలవన్మరణానికి పాల్పడ్డారు. రాఘవేంద్రరావు తల్లి సుబ్బమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

27-12Pg8exHMNWJQE 8 VJA_27-12Pg8exHMNWJQE.qxd 26/Dec/25 11:48 PM Page 1



# దేశ భవిష్యత్తు కమ్యూనిస్టులే

● మోడీ విధానాలతో రూపాయి భారీ పతనం ● పేదరికాన్ని నిర్మూలించడంలో కేంద్రం విఫలం ● మతం ముసుగులో రాజకీయ క్రీడ ● వికసిత భారత్ పెద్ద మోసం ● సిపిఐ నేతలు రామకృష్ణ, ఈశ్వరయ్య ● విజయవాడలో ముగిసిన సిపిఐ శతాబ్ది వేడుకలు



విజయవాడ, డిసెంబరు 26 ప్రభాతవార్త ప్రతినిధి: దేశంలో ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజల పక్షాన పోరాడేందుకు కమ్యూనిస్టులు ఏకం కావల్సిన అవసరం ఉందని సిపిఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ పిలుపునిచ్చారు. దేశంలో ఆరాచకం రాజ్యమేలుతోందని, రాజ్యంగాన్ని, లౌకికవాదాన్ని కాపాడుకోవాల్సిన అవసరత ప్రతి పౌరుడుపై ఉందన్నారు. దేశంలో 100 సంవత్సరాల చరిత్ర గల పార్టీలు కాంగ్రెస్, భారత కమ్యూనిస్టు పార్టీ మాత్రమేనని చెప్పారు. బ్రిటీషు సామ్రాజ్యవాదుల నియంతృత్వ పాలనలో పార్టీపై అనేక కుట్రలు జరిగాయని, అయినా వెనకడుగు వేయకుండా పోరాడి నిలిచిందని పేర్కొన్నారు. ఎంతోమంది నాయకులు, కార్యకర్తలు ప్రజా పోరాటంలో పెద్దఎత్తున అమరులయ్యారని చెప్పారు. ప్రజా పోరాటాలతో ఆవిర్భవించిన భారత కమ్యూనిస్టు పార్టీ శతాబ్ది ముగింపు వేడుకలు శుక్రవారం విజయవాడలో రంగరంగ వైభవంగా జరిగాయి, ఎర్రజెండా రెపరెపలు నగర వీధుల్లో వికసించి ప్రజల్లో పోరాట స్ఫూర్తిని నింపాయి. వేడుకల సందర్భంగా పార్టీ విజయవాడ నగర సమితి అధ్వర్యంలో నగరంలోని జింఖాన గ్రౌండ్ నుండి 150 అడుగులు ఎర్రజెండా చేతపట్టుకుని కొమ్ము డ్యాన్స్, తీన్మార్, డప్పు వాయిద్యాలు, థింసా, కోలాట కార్యక్రమాలతో భారీ ప్రదర్శన లెనిన్ సెంటర్ వరకు సాగింది. అనంతరం లెనిన్ విగ్రహం ప్రాంగణం వద్ద పార్టీ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన భారీ బహిరంగకు ముఖ్యఅతిధులుగా పార్టీ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ, రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్, మాజీ ఎమ్మెల్సీ బల్లి విల్సన్, జాతీయ కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ తదితరులు పాల్గొన్నారు. వందేళ్ల చరిత్రలో అధికారం ఉన్నా లేకున్నా పేదవాడి పక్షన ఎర్రజెండా నిలిందన్నారు. బ్రిటీష్ సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా ఆర్ఎస్ఎస్ ఎప్పుడు పోరాడిందో ప్రజలకు తెలియజేయాలని డిమాండ్ చేశారు. స్వాతంత్ర్య పోరాటంలో ఎంతోమంది సుహసీయులు పోరాడి ఆశువులు బాశారని, తమ పార్టీని బిజెపి అవమానకరంగా మాట్లాడుతోందని మండిపడ్డారు. దేశంలో నెలకొన్న సమస్యలను పక్కన పెట్టి దేశ ఆర్థిక వ్యవస్థ పతానికి మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ కారణమని పదేపదే ప్రచారం చేయడం సరికాదని, దేశ ప్రగతికి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిన ఘనత నెహ్రూకు దక్కుతుందన్నారు. 12 సంవత్సరాల మోడీ పాలనలో చేసేందీమీ లేదని, కేవలం మతం ముసుగులో రాజకీయ పబ్బం గడుపుతున్నారని ఆరోపించారు. గతంలో రూ.60 లక్షల కోట్లు ఉన్న అప్పు... ఇప్పుడు రూ.200 లక్షల కోట్లుకు చేరిందని విమర్శించారు. దేశ సంపదను అమ్మే పనిలో మోడీ పాలన ఉందన్నారు. పేదరికం నియంత్రణలో మోడీ పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. ఓవైపు క్రిస్మస్ వేడుకల్లో మోడీ పాల్గొనగా... మరోవైపు క్రైస్తవులపై దాడులు పథకం ప్రకారం జరుగుతున్నాయని మండిపడ్డారు. రాష్ట్రంలో ప్రతిరోజు చంద్రబాబు, జగన్ మధ్య వార్ నడుస్తోందని ఢిల్లీలో మాత్రం ఇద్దరు మోడీ పంచన చేరుతున్నారని ఆరోపించారు. రాష్ట్ర ప్రయోజనాలు వారికి పట్టవని, కేవలం వారి ప్రయోజనాలే ముఖ్యమని తెలిపారు. జనవరి 18వ తేదీన ఖమ్మంలో జరిగే పార్టీ శత వసంతాల ముగింపు వేడుకలకు పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య మాట్లాడుతూ రౌడీలు, గుండాలకు ఎదురొడ్డి పోరాడి ప్రాణాలు అర్పించిన ఏకైక పార్టీ కమ్యూనిస్టు పార్టీ అని, విజయవాడ నగర రూపురేఖలు మార్చిన ఘనత పార్టీకే దక్కుతుందన్నారు. జై ఆంధ్ర ఉద్యమం విజయవాడ కేంద్రంగా సాగిందని గుర్తు చేశారు. భవిష్యత్తు ఆలోచనలకు నాటి కమ్యూస్టులే శ్రీకారం చుట్టారని తెలిపారు. లెనిన్ స్ఫూర్తితో కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించిందని, కమ్యూనిస్టు సిద్ధాంతం అజేయమని, దానిని అణిచివేయడం ఎవరితరం కాదని స్పష్టం చేశారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక అంశాలకు అనుగుణంగా పనిచేస్తున్న ఏకైక పార్టీ కమ్యూనిస్టు పార్టీ అన్నారు. దోపిడీదారుల చేతుల్లో రాజ్యాధికారం ఉందని, స్వార్థ ప్రయోజనాలు కోసం దళితులు, గిరిజనులను చంపేసి సంపదను దోచుకునే పనిలో మోదీ ప్రభుత్వం ఉందని ఆరోపించారు. ఎర్రజెండా నూతన శక్తిని కూడగట్టుకుని ప్రజా వ్యతిరేక పాలన చేస్తున్న పాలకులపై పోరాడటానికి సిద్ధమవుతున్నామని స్పష్టం చేశారు. మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి తూట్లు పొడుస్తూ 50 రోజుల పనిని 120 రోజులు కల్పిస్తున్నామని పేదవాడిని నమ్మించి పథకం పేరుమార్చడం అత్యంత దుర్మార్గమని మండిపడ్డారు. గతంలో రూపాయి విలువ పతనమవుతోందని గగ్గోలు పెట్టిన మోడీ... ఇప్పుడు మరింత అధోపాళానికి చేరిందని విమర్శించారు. వికసిత భారత్ పేరుతో పెద్ద మోసం జరుగుతోందని, దేశంలో కమ్యూనిస్టుల బలాన్ని తగ్గించేందుకు కార్పొరేట్ కుట్ర జరుగుతోందని, బీజేపీఆర్ఎస్ఎస్‌ఎక్కు వ్యతిరేకంగా ప్రజా పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ దేశం బాగుపడాలంటే ఎర్రజెండా దెపరెపలాడన్నారు.

పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ మాట్లాడుతూ దేశంలో ఆర్థిక అసమానతలు పెరిగిపోతున్నాయని, పేదవాడు పేదవాడిగానే మిగిలిపోతున్న పరిస్థితి ఉందన్నారు. ఒక్క శాతం ఉన్న బదాబాబులు వద్ద 40 శాతం సంపద ఉందని, దీంతో దేశం మరింత పేదరికంలో నెట్టివేయబడుతున్నదన్నారు. మతం మాయలో ప్రజలను మధ్య పెట్టి రాజ్యాధికారాన్ని కాపాడుకునే కుట్ర జరుగుతోందన్నారు. మతం, రాజ్యం, కార్పొరేట్ శక్తులు ఏకమైతే దేశ భవిష్యత్తుకు విఘాతం కలుగుతోందని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అన్నారని గుర్తుచేశారు. ఈ సభలో పార్టీ నగర సహాయ కార్యదర్శి లండా దుర్గారావు, సిపిఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్, ఎబటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్. ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నాసర్ జీ, వలరాజు, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్షుడు చంద్రనాయక్, డీహెచ్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కరవది సుబ్బారావు, పార్టీ విజయవాడ నగర సహాయ కార్యదర్శులు నక్కా వీరభద్రరావు తదితరులతో పాటు నగర కార్యదర్శి వర్గ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు వేలాదిగా పాల్గొన్నారు..




# టి20 సిరీస్ భారత్‌దే

● 8 పరుగుల తేడాతో శ్రీలంకపై విజయం ● 3-0తో సిరీస్ కైవసం చేసుకున్న వుమన్ జట్టు

తిరువనంతపురం, డిసెంబరు 26: వరల్డ్ ఛాంపియన్ భారత జట్టు స్వదేశంలో తొలి టి20 సిరీస్ పట్టేసింది. ఓపెనర్ షఫాలీ వర్మ79 నాటౌట్‌గా విధ్వంసక అర్ధ శతకంతో చెలరేగింది. మూడో టీ20లోనూ భారీ విజయంతో సిరీస్ పట్టేసింది. ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో ఆతిథ్య జట్టుకు కనీస పోటీ ఇవ్వలేకపోతున్న లంక త్రివేండ్రంలోనూ ఓటమి చవిచూసింది. రేణుకా సింగ్ 4-21 తో నిప్పులు చెరగగా స్వల్ప ఛేదనలో షఫాలీ ఉప్పెనలా విరుచుకుపడింది. 13.2 ఓవర్లలోనే విక్టరీ కొట్టిన భారత్ మరో రెండు మ్యాచ్‌లుండగానే సిరీస్ ఒడిసి పట్టింది. ఇంకా 40 పరుగులు మిగిలి ఉండగానే ఎనిమిది వికెట్ల తేడాతో విక్టరీ నమోదుచేసింది. ప్లేయర్ ఆఫ్‌ది మ్యాచ్‌గా రేణుకాసింగ్ నిలిచింది. స్వదేశంలో ఇటీవలే వన్డే ప్రపంచకప్‌తో చరిత్ర సృష్టించిన హర్మన్‌ప్రీత్ బృందం పొట్టి సిరీస్‌ను కైవసం చేసుకుంది. త్రివేండ్రంలో శుక్రవారం శ్రీలంకను 112కే కట్టడి చేసిన టీమిండియా స్వల్ప లక్ష్యాన్ని ఉఫ్ అని ఊదేసింది. ఓపెనర్ షఫాలీ వర్మ 79 నాటౌట్‌గానిలిచి సుడిగాలిలా చెలరేగి బౌండరీల మోతతో లక్ష్యాన్ని మంచులా కరిగించింది. స్మృతి మంధాన(1), జెమీమా రోడ్రిగ్స్(9)లు విఫలమైనా దూకుడు మంత్రంతో ఆడిన లేడీ సెహ్వాగ్ 24 బంతుల్లోనే సెంచరీ కొట్టింది. హాఫ్ సెంచరీ తర్వాత కూడా అదే దూకుడు చూపింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్(21 నాటౌట్)తో కలిసి జట్టుకు భారీ విజయాన్ని అందించింది. ఈ గెలుపుతో టీ20ల్లో అత్యధిక విజయాలతో ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ మేగ్ లానింగ్ పేరిట ఉన్న రికార్డును హర్మన్‌ప్రీత్ బ్రేక్ చేసింది. 77 విజయాలతో లానింగ్‌ను ఇండియన్ స్కిప్పర్ వెనక్కి నెట్టేసింది. వరుసగా రెండు మ్యాచుల్లో ఓడిన శ్రీలంక చావోరేవో పోరులోనూ చిన్న స్కోర్‌కే పరిమితమైంది.

టాస్ ఓడిన ఆ జట్టు ఇన్నింగ్స్‌ను దూకుడుగానే ఆరంభించింది. ఓపెనర్ హాసిని పెరీరా 25 చేసింది. బౌండరీలతో చెలేరగడంతో స్కోర్ దాటింది. దీప్తి శర్మ3-18 ఓవర్లో చమరి ఆటపట్టు(3)ను ఔట్ చేసి దీప్తి శర్మ తొలి బ్రేకిచ్చింది. ఆ తర్వాత ఆరో ఓవర్లో రేణుకా సింగ్(4-21) పెరారీతో పాటు డేంజరస్ హర్షిత సమరవిక్రమ(2)లను వెనక్కి పంపింది. 32కే లంక మూడు బిగ్ వికెట్లు కోల్పోయి ఒత్తిడిలోకి వెళ్లింది. దులానీ మెరుపులతో కీలక బ్యాటర్లు ఔట్ కావడంతో కష్టాల్లో పడిన లంకను ఇమేశా దులానీ (27) ఆదుకుంది. ఆమెతో కలిసి భాగస్వామ్యంతో జట్టును ఆదుకోవాలనుకున్న నీలాక్షి డిసిల్వా(4)ని రేణుక ఎల్బీగా పెవిలియన్ చేర్చింది. క్రాంతి గౌడ్, దీప్తి ఓవర్లో ఫ్రంట్‌ఫుట "లో స్వీప్ షాట్లతో విరుచుకుపడిన దులానీ కవిశ దిల్హరి(20)తో కలిసి స్కోర్ బోర్డును ఉరికించింది. 26 బంతుల్లో 40 రన్స్ పిండుకున్న ఈ ద్వయ్నా దీప్తి విడదీసింది. సిక్సర్‌కు యత్నించిన దిల్హరి బౌండరీ వద్ద అమన్‌జోత్ చేతికి చిక్కడంతో 85 వద్ద ఐదో వికెట్ పడింది. కాసేపటికే దులానీని రేణుక వెనక్కి పంపగా లంక స్కోర్ నెమ్మదించింది. ఆఖర్లో కుశాని నుత్యంగన (19 నాటౌట్) మెరుపులతో ఆటపట్టు బృందం నిర్ణీత ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 112 రన్స్ మాత్రమే చేయగలిగింది.

# సింగిడి కలెక్టివ్ బ్రాండ్‌ను ఆవిష్కరించిన మాజీమంత్రి కెటిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు 26:** తెలంగాణ చేనేత వైభవాన్ని ప్రపంచానికి చాటిచెప్పే దిశగా, పర్యావరణ హితమైన వస్త్రధారణను ప్రోత్సహిస్తూ రూపొందించిన 'సింగిడి కలెక్టివ్' నూతన ఫ్యాషన్ బ్రాండ్‌ను బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ శుక్రవారం ఆవిష్కరించారు. తెలంగాణ నేల స్వభావానికి అద్దం పట్టేలా, పూర్తిగా ప్రకృతి సిద్ధమైన రంగులతో, మన సంప్రదాయ చేనేత నైపుణ్యంతో ఈ బ్రాండ్ రూపుదిద్దుకోవడం విశేషం అని కెటిఆర్ పేర్కొన్నారు. తెలంగాణ గడ్డ ఎప్పుడూ కొత్తదనానికి వేదికగా నిలుస్తుందని, ఇక్కత్ నుండి గొల్లభామ చీరల వరకు మన నేతన్నల నైపుణ్యం అద్భుతం అని వ్యాఖ్యానించారు. ఈ వారసత్వాన్ని నేటి యువత అభిరుచులకు తగ్గట్టుగా మార్చుతూ, పర్యావరణానికి హాని లేని రీతిలో సింగిడి కలెక్టివ్ ముందడుగు వేయడం హర్షణీయం అని పేర్కొన్నారు. వ్యాపారమే కాకుండా, మన నేతన్నలకు అండగా నిలుస్తూ, సామాజిక బాధ్యతతో యువత ఇటువంటి స్టార్టప్‌లను స్థాపించడం గర్వకారణం అని కొనియాడారు.




# విద్యార్థులు దేశాన్ని భవిష్యత్తులో శక్తివంతంగా ముందుకు నడిపించాలి

## ఎన్టీఆర్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి

విజయవాడ, డిసెంబరు 26 ప్రభాతవార్త ప్రతినిధి: విద్యార్థులు సమాజాన్ని, దేశాన్ని లీడ్ చేసేలా ఉండాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సతీమణి, ఎన్టీఆర్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి వ్యాఖ్యానించారు. స్కూల్ చదువు పూర్తి చేసుకుని బయటకు వచ్చే సమయంలో జీవితంలో ఒక లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఇవాళ(శుక్రవారం) నిమ్మకూరులోని గురుకుల పాఠశాలలో విద్యార్థులతో భువనేశ్వరి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు కీలక సూచనలు చేశారు. ముందుగా గురుకుల పాఠశాల ప్రాంగణంలో.... రూ.3.50కోట్ల పూర్వ విద్యార్థుల విరాళాలతో నిర్మించిన హాస్టల్ భవనాన్ని ప్రారంభించారు. విద్యార్థులతో తన బాల్య స్మృతులను పంచుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడారు భువనేశ్వరి. విద్యార్థులు ఆంగ్లంలో ప్రతిభ కనబర్చేలా అధ్యాపకులు చూడాలని సూచించారు. తానూ నిమ్మకూరు రావడం స్వీట్ మెమరీ అని.. ఇది మా తాత లక్ష్మయ్య ఊరని చెప్పుకొచ్చారు. చిన్నప్పుడు సెలవులు వస్తే అమ్మ, తమను నిమ్మకూరు పంపించేదని అన్నారు. వేసవి సెలవులకు ఇక్కడికే వచ్చే వాళ్లమని, ఇక్కడ తన సోదరితో కాలక్షేపం చేశానని నారా భువనేశ్వరి గుర్తుచేసుకున్నారు. ఇక్కడ తన సోదరి శారద ఉండేదని.. ఆర్టీసీ బస్‌లో



పామర్రు సినిమా వెళ్ళేవాళ్ళమంటూ ఆనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. కాలం మారుతుందని.. ఇప్పుడు ఫోన్, కార్లు కావాలని కోరుకుంటున్నారని అన్నారు. బాలికలు వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఈ రోజు మీరు చేసే పనే రేపటి జీవితానికి దారి చూపుతుందని వెల్లడించారు. పెద్ద పెద్ద నాయకులు చాలా కష్టపడి చదువుకున్నారని.. అన్ని ఉండి చదువుకునే వారిని కాకుండా పేదరికంలో ఉండి చదువుకునే వారిని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. నాన్న ఇంటింటికీ తిరిగి పాలు అమ్మి కష్టపడి పైకి వచ్చారని.. తాము ఈ స్థాయిలో ఉన్నాము అంటే తమ తల్లిదండ్రుల కష్టమని గర్వంగా చెప్పుకున్నారు. సీఎం చంద్రబాబు కూడా చాలా కష్టపడి చదువుకున్నారని తెలిపారు. చంద్రబాబుపై నమ్మకంతో ఉమ్మడి రాష్ట్రంలో, విభజన తర్వాత సీఎంగా ఎన్నుకున్నారన్నారు. ఇంటింటికి రూ.15 వేలు ఇస్తామన్నారని.. 54 లక్షల మంది తల్లులకు తల్లికి వందనం ఇస్తున్నారని.. ఇందుకోసం రూ.10 వేల కోట్లు ఖర్చు అవుతుందని తెలిపారు. ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా ఎంత సేవ చేయాలో అంత చేస్తున్నామన్నారు. తమను నమ్మి ఎంతోమంది దాతలు ముందుకు వస్తున్నారని అన్నారు.ఈరోజు ఇక్కడికి రావడం అదృష్టంగా భావిస్తున్నట్లు ఆనందం వ్యక్తం చేశారు. స్కూల్స్‌లో ఉన్న సమస్యలను సీఎం, కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం అయ్యేలా చూస్తానని భువనేశ్వరి పేర్కొన్నారు.

# ఆదేశాలు అమలుచేయని ఐఏఎస్‌లకు హైకోర్టు నోటీసులు

**హైదరాబాద్, డిసెంబరు 26, ప్రభాతవార్త:** తాము ఇచ్చిన ఆదేశాలను అమలు చేయని ఇరువురు ఐఏఎస్‌లను హైకోర్టు తప్పుపట్టింది. ఎందుకు నిర్లక్ష్యం వహించారనేది తమ ముందు హాజరై వివరణ ఇవ్వాలని ధర్మాసనం నోటీసులు జారీ చేసింది. జనవరి 9వ తేదీ ఉదయం 10.30 గంటలకు తమ ముందు ధర్మాసనం ముందు హాజరై వివరాలను వెల్లడించాలని ఐఏఎస్ అధికారులు ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, పంచాయితీరాజ్ ముఖ్య కార్యదర్శి శ్రీధర్ తోపాటు, మరో ఇద్దరు అధికారులకు స్పష్టం చేసింది. అయితే ఇదే సమయంలో కోర్టుకు హాజరు కాకుండా మినహాయింపు పొందేందుకు ఎటువంటి కారణాలు చెప్పవద్దని పేర్కొంది. సివిల్ పనులకు సంబంధించి తమకు చెల్లించాల్సిన బకాయిలు ఇవ్వడం లేదంటూ కంపెనీ హైకోర్టులో పిటీషన్ వేసింది. దానిపై విచారణ చేసిన ధర్మాసనం పిటీషనర్‌కు చెల్లించాల్సిన 1,16,51,734 రూపాయలను ఆరు వారాల్లో విడుదల చేయాలని గత ఏప్రిల్ నెలలో తీర్పునిచ్చింది. మూడు నెలలు అయినా ఈ తీర్పును అమలు చేయకపోవడంతో పిటీషనర్ కోర్టు ధిక్కరణ పిటీషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ వేణుగోపాల్ ధర్మాసనం విచారణ చేపట్టి, పెండింగ్ బకాయిలను చెల్లించాలన్న తమ ఆదేశాలను ఎందుకు అమలు చేయలేదో వివరణ ఇవ్వాలని పేర్కొంటూ జనవరి 9వ తేదీకి వాయిదా వేసింది.




# పిఎఫ్ విత్‌డ్రా ఇకపై ఎంతో ఈజీ!

**న్యూఢిల్లీ, డిసెంబరు 26:** ఇపిఎఫ్ఒ ఖాతాదారులకు కేంద్ర ప్రభుత్వం ఊరటనిచ్చింది. పిఎఫ్ 3.0 పేరుతో కొత్తనిబంధనలు అమలుకు తెస్తోంది. ఉద్యోగుల భవిష్యనిధి వ్యవస్థను మరింత డిజిటల్‌గా సులభతరంచేయడమే లక్ష్యం అని కేంద్రం ప్రకటించింది. పిఎఫ్ ఉపసంహరణ ప్రక్రియ మరింత త్వరగా పూర్తయ్యే అవకాశం ఉంది. ఆన్‌లైన్ సేవలు మరింత మెరుగవడంతో ట్రాన్స్‌ఫర్‌లు, క్లెయిమ్‌లు, బ్యాలెన్స్ వివరాలు తక్షణమే తెలుసుకునే విధంగా వ్యవస్థను అప్‌గ్రేడ్‌చేస్తున్నారు. దీనితో పిఎఫ్ ఖాతాదారులకు మరింత సౌలభ్యం, స్పష్టత లభించనున్నదని ఆర్తిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు. పిఎఫ్ ఖాతాలోని సొమ్మును సులభవంగా విత్‌డ్రాచేసుకునేలా చేస్తోంది. పిఎఫ్‌సొమ్ము ఎటిఎం కార్డులు, యుపిఐద్వారా కూడా తీసుకునే వెసులుబాటు తెస్తోంది. ఈ కొత్త విధానం వచ్చే సంవత్సరం ఏప్రిల్ ఒకటోతేదీనుంచి అమలులోకి రానున్నదని సమాచారం. ఉద్యోగి మానేసిన తర్వాత ఒక నెలపూర్తయితేనే పిఎఫ్ బ్యాలెన్స్‌లో 75శాతం సొమ్ము విత్‌డ్రాచేసుకునే వీలుండేది. మిగిలిన 25శాతం మొత్తాన్ని తీసుకోవాలంటే రెండునెలలవరకూ వేచి ఉండాల్సివచ్చేది. అయితే తాజా మార్పులతోఉ ద్యోగం మానేసిన వెంటనే పిఎఫ్ బ్యాలెన్స్‌లోని 75శాతం మొత్తం తీసుకునే వెసులుబాటు కల్పించనున్నారు. మిగిన మొత్తం 12నెలల తర్వాత పూర్తిగా విత్‌డ్రాచేసుకునే అవకాశం ఉంది. అలాగే గతంలో విద్య, వివాహం, ఇతర అవసరాలకు పిఎఫ్ సొమ్ము తీసుకోవాలంటే ఆధారపత్రాలు సమర్పించాల్సివచ్చేది. ఇపుడు ఎలాంటి డాక్యుమెంట్లు అవసరంలేకుండా విత్‌డ్రాచేసే సౌకర్యం కల్పిస్తున్నట్లుప్రభుత్వం ప్రకటించింది.

# దేశవ్యాప్తంగా పెరిగిన చలితీవ్రత

## పొగమంచు కారణంగా పెరిగిన రోడ్డు ప్రమాదాలు

**హైదరాబాద్, డిసెంబరు 26, ప్రభాతవార్త:** దేశవ్యాప్తంగా ఈ ఏడాది చలి తీవ్రత ఎక్కువగా వుండడం తెలిసిందే. ఈ యేడాది చలి తీవ్రత ఎక్కువ గా వుంటుందని అక్టోబర్ నెలలోనే వాతావరణ శాస్త్రవేత్తలు చెప్పడం తెలిసిందే. ఇది నిజమవుతూ డిసెంబర్ నెలలో దేశంలోని అన్ని ప్రాంతాలు చలి గుప్పిట్లో చిక్కుకు న్నాయి. చలి కారణంగా అనేకచోట్ల ఉష్ణోగ్రతలు ఐదు అంతకు తక్కువగా పడిపోయాయంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. చలి తీవ్రతవల్ల తెల్లవారుజామున అనేకచోట్ల పొగమంచు కమ్ముకోవడంతో రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయి. తెలంగాణ, మహారాష్ట్ర, ఎపి, కర్ణాటక, తమిళనాడులో వారం రోజులుగా పదికి పైగా సంభవించిన రోడ్డు ప్రమాదాలలో 30 మందికి పైగా ప్రయాణీకులు మరణించారు. ఈ ప్రమాదాలన్నీ తెల్లవారుజామునే జరగడం గమనార్హం. పొగమంచు వల్ల రోడ్లపై ఎదురుగా వస్తున్న వాహనాలు సరిగ్గా కనిపించక పోవడంతో పాటు మలుపుల వద్ద పరిస్థితులు మరింత ఇబ్బందికరంగా మారడం వల్ల ప్రమాదాలు సంభవిస్తున్నాయి. నాలుగు రోజుల క్రితం సంగారెడ్డి జిల్లాలో ఒక టూరిస్టు బస్సు తెల్లవారు జామున పొగమంచు కారణంగా మలుపు వద్ద అదుపుతప్పి గుంతలో జారింది. అదృష్టవశాత్తూ ఈ ప్రమాదంలో ప్రయాణీ కులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. మహారాష్ట్రలో జరిగిన మరో రోడ్డు ప్రమాదంలో నలుగురు తెలంగాణ వారు మరణించారు. కర్నాటకలో జ రిగిన ఇంకో రోడ్డు ప్రమాదంలో నలుగురు చనిపోయారు. ఎపిలోని నంద్యాలలో జరిగిన ఇంకో రోడ్డు ప్రమాదంలో తెలంగాణకు చెందిన నలుగురు మరణించారు. కర్నాటక, తమిళనాడు సరిహద్దులో జాతీయ రహదారిపై ట్రావెల్స్ బస్సు లారీని ఢీకొన్న ఘటనలో ఎనిమిది మంది సజీవ దహన ం అయ్యారు. ఇదే ఘటనలో మరో పది మంది గాయపడ్డారు. రాష్ట్రంలోని మంచిర్యాలలో జరిగిన మరో రోడ్డు ప్రమాదంలో నలుగురు చనిపోయా రు. ఈ తరహా ప్రమాదాలు ఉత్తరాది రాష్ట్రాలలోనూ అనేకం జరిగాయి, చలికాలంలో పొగమంచు కారణంగా తెల్లవారుజామున ప్రమాదాలు జరగడ ం సహజమే అయినా ఈ ఏడాది ఇటువంటి ఘటనలు ఎక్కువగా జరగడం గమనార్హం. ఇలాంటి ఘటనలకు పొగమంచు ఒక కారణం కాగా డ్రైవ ర్ల అప్రమత్తత లేకపోవడం, పరిమితికి మించి వేగంగా వెళ్లడం వంటి కారణాలు కూడా వున్నాయని రవాణరంగ నిపుణులు చెబుతున్నారు. చలి కాలంలో వాహనాల డ్రైవింగ్ విషయంలో మరింత అప్రమత్తంగా వుండాలని రవాణ రంగ నిపుణులు చెబుతున్నారు. తెల్లవారుజామున పొగమంచు వుండడం రహదారులపై ఎదురుగా వచ్చే వాహనాలు స్పష్టంగా కనిపించవని, వేసవికాలంతో పోలిస్తే ఈ సమస్య ఎక్కువగా వుంటుందని వారంటు న్నారు. దీంతో పాటు మలుపుల వద్ద ఏమీ కనిపించని పరిస్థితి వుంటుందని వారంటున్నారు. దీనివల్ల వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలకు లోన వుతాయని రవాణ రంగ నిపుణులు చెబుతున్నారు. చలికాలంలో వాహనాలు కచ్చితంగా పరిమిత వేగంతోనే వెళ్లాలని, డ్రైవర్లు ప్రతి గంట లేదా రెండు గంటలకు ఒకసారి వాహనాలను ఆపి ముఖం కడుక్కోవాలని, వీలైతే టీ తాగి కొంత విశ్రాంతి తీసుకోవాలని వారు చెబుతున్నారు. ఇదే సమ యంలో వాహనాల కండీషన్‌ను నిరంతరం చూడాలని వారంటున్నారు. ప్రయాణీకులతో వెళ్లే బస్సుల డ్రైవర్లు మరింత అప్రమత్తంగా వుండాలని వారు కోరుతున్నారు.




# యూరియా రవాణా సబ్సిడీకి బ్రేక్

## పిఎసిఎస్, ఆగ్రోస్, డిసిఎమ్మెస్‌లకు చార్జీలు

**హైదరాబాద్, డిసెంబరు 26, ప్రభాతవార్త:** యూరియా ఉచిత రవాణా సబ్సిడీని రద్దు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆలోచన చేస్తున్నట్లు తెలిసింది. దీంతో ఇకపై ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు (పిఎసిఎస్), ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాలు, జిల్లా మార్కెటింగ్ సొసైటీలకు (డీసీఎంఎస్) ఇప్పటి వరకూ యూరియా ఉచిత రవాణా (ఎఫ్‌వోఎల్) చేయడాన్ని రద్దు చేయనున్నట్లు సమాచారం. రాష్ట్రంలో 908 ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు, 900 ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాలు, 10 జిల్లా మార్కెటింగ్ సొసైటీలు ఉన్నాయి. వీటి ద్వారా ప్రభుత్వం రైతులకు యూరియా పంపిణీ చేస్తున్నది. దీంతో అవి రైతులకు కేంద్రం నిర్ణయించిన కనీస మద్దతు ధరలకు యూరియాను విక్రయిస్తున్నాయి. అయితే ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మేరకు ఈ రవాణా సబ్సిడీని ఎత్తివేస్తే వాటికి సంబంధించి ఆయా సంస్థలు చార్జీలు చెల్లించాల్సి ఉంటుంది. ఫలితంగా రవాణా చార్జీల భారాన్ని సంబంధిత సంస్థలు రైతుల నుండి వసూలు చేయాల్సి ఉంటుంది. దీనికి సంబంధించి ఇప్పటికే సంప్రదింపులు జరిగాయి. దీంతో ఉచిత రవాణాను రద్దు చేస్తూ త్వరలో ఉత్తర్వులు విడుదల చేసే వీలున్నట్లు సమాచారం.

## ఓపెన్ స్కూల్ టెన్త్ పరీక్ష ఫీజు గడువు జనవరి 5

**హైదరాబాద్, డిసెంబరు 26, ప్రభాతవార్త:** తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ (టాస్) అధ్వర్యంలో నిర్వహించే టెన్త్, ఇంటర్ వార్షిక పరీక్షల ఫీజు చెల్లింపు గడువును పెంచారు. వచ్చే యేడాది మార్చి, ఏప్రిల్‌లో జరగనున్న పరీక్షలకు సంబంధించిన ఫీజును జనవరి 5 వరకు చెల్లించడానికి అవకాశం కల్పించినట్టు టాస్ డైరక్టర్ పివి శ్రీహరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ. 25 అపరాధ రుసుంతో జనవరి 6 నుంచి 12 వరకు, రూ. 50 అపరాధ రుసుంతో జనవరి 13 నుంచి 16 వరకు అవకాశం కల్పించారు. ఇక తత్కాల్‌కి జనవరి 17 నుంచి 19 వరకు అవకాశం కల్పించినట్టు ప్రకటనలో పేర్కొన్నారు. మార్చిన పరీక్ష ఫీజు షెడ్యూల్ విద్యార్థులు ఉపయోగించుకోవాలని టాస్ డైరక్టర్ సూచించారు. టిజి ఆన్‌లైన్, మీ-సేవాల్లో ఆన్‌లైన్‌లో ఫీజును చెల్లించవచ్చని పేర్కొన్నారు.



# నైజీరియాలో అమెరికా సైన్యం భీకర దాడులు

## హ్యాపీ క్రిస్మస్ అంటూ ట్రంప్ పోస్టు!

**అబూజా, డిసెంబరు 26:** నైజీరియాలో ఐసిస్ (ఇస్లామిక్ స్టేట్ ఆఫ్ ఇరాక్ అండ్ సిరియా) ఉగ్రవాద స్థావరాలపై అగ్రరాజ్యం అమెరికా సైన్యం విరుచుకుపడింది. నైజీరియాలో క్రైస్తవుల హత్యలను ఆపాలని ఐసిస్‌ను అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించిన కొద్ది రోజుల్లోనే ఈ దాడులు చేపట్టడం గమనార్హం. క్రైస్తవులను దాడులను నిరోధించడంలో భాగంగా ఈ చర్యలు తీసుకున్నట్లు ట్రంప్ స్పష్టం చేశారు. ఈ మేరకు తన సొంత సామాజిక మాధ్యమం ట్రూత్ సోషల్ వేదికగా పోస్టు పెట్టారు. వాయువ్య నైజీరియాలోని ఐసిఎస్ ఉగ్రవాదులే లక్ష్యంగా తమ సైన్యం భీకర దాడులు నిర్వహించినట్టు పేర్కొన్నారు. 'నైజీరియాలో ఐసిస్ ఉగ్రవాదులపై అమెరికా శక్తిమంతమైన దాడులు చేపట్టింది. ముఖ్యంగా అమాయక క్రైస్తవులను లక్ష్యంగా చేసుకుని దారుణ హత్యలకు పాల్పడుతున్న వారిపై ఇవి జరిగాయి. ఈ ఊచకోతలు ఆపకపోతే నరకం చూపిస్తానని గతంలోనే హెచ్చరించాను. అయినా వాటిని ఉగ్రవాదులు పెడచెవిన పెట్టి ఇప్పుడు దానికి ఫలితం అనుభవిస్తున్నారు. రాడికల్ ఇస్లామిక్ తీవ్రవాదాన్ని సహించను' అని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. 'మన సైన్యానికి ఆ భగవంతుడు ఆశీస్సులు ఉండాలి.. హతమైన ఉగ్రవాదులు సహా అందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు.. ఈ హత్యాకాండ కొనసాగితే.. మా దాడులు కూడా జరుగుతూనే ఉంటాయి..' అని అమెరికా అధ్యక్షుడు వార్నింగ్ ఇచ్చారు. నైజీరియా అభ్యర్థన మేరకు దాడులు చేపట్టి, పలువురు ఉగ్రవాదులను హతమార్చినట్టు అమెరికా రక్షణ శాఖ వెల్లడించింది. కాగా, నైజీరియా అధికారుల అభ్యర్థన మేరకు (సోకోటో రాష్ట్రంలో) ఒక దాడిని నిర్వహించి.. పలువురు ఐసిస్ ఉగ్రవాదులను హతమార్చినట్లు అమెరికా ఆఫ్రికా కమాండ్ ఎక్స్ (ట్విట్టర్) పోస్టులో తెలిపింది. పెంటగాన్ ఛీఫ్ పెటే హెగ్‌సేథ్ సైతం నైజీరియాలో తమ సైన్యం చర్యలు, సంసిద్ధతపై ప్రశంసలు కురిపించారు. ఈ విషయంలో నైజీరియా ప్రభుత్వ మద్దతు, సహకారానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఇక, అమెరికా దళాలు నైజీరియాలో ట్రంప్ ఆధ్వర్యంలో మొదటిసారిగా దాడులు చేశాయి. అక్టోబరు, నవంబరు నెలల్లో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నైజీరియాపై తీవ్ర విమర్శలు చేశారు. అక్కడ క్రైస్తవులు అస్తిత్వ ముప్పు ఎదుర్కొంటున్నారని, ఇది జాతి నిర్మూలనతో సమానమని ఆయన అన్నారు.

# అయోధ్యలో కొరియా రాణి విగ్రహావిష్కరణ



**అయోధ్య, డిసెంబరు 26:** భారత్, దక్షిణ కొరియాల మధ్య ఉన్న పురాతన సాంస్కృతిక బంధానికి ప్రతీకగా శ్రీరాముడి జన్మస్థలమైన అయోధ్యలో కొరియా రాణి హెయో హ్వాంగ్‌ఓక్ (సురిరత్న) కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. సుమారు 2000 ఏళ్ల క్రితం అయోధ్యకు చెందిన యువరాణి కొరియాకు వెళ్లి అక్కడి రాజును వివాహమాడారనే చారిత్రక విశ్వాసానికి గుర్తుగా ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. కొరియన్ ఇతిహాసాల ప్రకారం, క్రీ.శ. 48లో అయోధ్య రాజు తన కుమార్తె సురి రత్నను, దైవాజ్ఞ మేరకు సముద్ర మార్గంలో కొరియాకు పంపారు. అక్కడ ఆమె గయ సామ్రాజ్య స్థాపకుడైన రాజు కిమ్ సురోను వివాహం చేసుకున్నారు. ఈ దంపతులకు పది మంది సంతానం కలగగా, వారి వారసులనే నేడు దక్షిణ కొరియాలో కరక్ తెగగా పిలుస్తారు. సుమారు 60 లక్షల మంది ఉన్న ఈ తెగ ప్రజలు, తమ మూలాలు అయోధ్యలోనే ఉన్నాయని దృఢంగా విశ్వసిస్తారు. ఈ బంధాన్ని గౌరవిస్తూ 2001లోనే ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం, దక్షిణ కొరియాలోని గిమ్హే నగరం కలిసి సరయూ నది ఒడ్డున రాణి సురి రత్న పేరుతో ఒక స్మారక పార్కును నిర్మించాయి. కొరియా ప్రతినిధుల కోరిక మేరకు ఇటీవల ఈ పార్కును మరింత సుందరీకరించి, తాజాగా రాణి కాంస్య విగ్రహాన్ని ప్రతిష్టించారు. 2018లో దక్షిణ కొరియా ప్రథమ మహిళ కిమ్ జంగ్‌సూక్ భారత పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌తో కలిసి ఈ పార్కు అభివృద్ధి పనులను ప్రారంభించడం గమనార్హం. ప్రతి ఏటా కరక్ తెగకు చెందిన వందలాది మంది కొరియన్లు అయోధ్యకు వచ్చి తమ పూర్వీకురాలిని స్మరించుకుంటారు. ఈ విగ్రహ ఏర్పాటుతో అయోధ్య, గిమ్హే నగరాల మధ్య ఉన్న సోదర బంధం మరింత బలపడింది. ఈ పరిణామం రెండు దేశాల మధ్య కేవలం దౌత్యపరమైన సంబంధాలకే కాకుండా, చారిత్రక, సాంస్కృతిక బంధానికి నిలువుటద్దంగా నిలుస్తోంది.

# దాయాది పాకిస్థాన్‌కు మరిన్ని కష్టాలు

## వైమానిక దళం ఏర్పాటుకు ఉగ్రసంస్థ టిటిపి ప్రణాళిక!



**కాబూల్, డిసెంబరు 26:** అఫ్ఘానిస్థాన్‌లో తాలిబన్లు తిరిగి అధికారంలోకి వచ్చినప్పటి ను తెహ్రీకే తాలిబన్ పాకిస్థాన్ (టిటిపి) రెచ్చిపోతోంది. కొత్త యేడాదిలో సంస్థ కార్యకలాపాలను మరింత విస్తరించేలా ప్రణాళికలు చేసింది. ఇందులో భాగంగానే పాక్ సైన్యానికి పోటీగా వైమానిక దళం ఏర్పాటు చేయడానికి సిద్ధపడింది. దీనిపై సామాజిక మాధ్యమాల్లో పలు పోస్టులు చేసింది. ఈ వార్త పాక్ అధికారులను భయపెడుతోంది. 2026లో ఈ వైమానిక దళం ఏర్పాటు చేస్తామని టిటిపి ఓ ప్రకటనలో పేర్కొంది. సలీం హక్కానీ నాయకత్వంలో దీన్ని నడపనున్నట్లు తెలిపింది. దీంతోపాటు ప్రావిన్స్‌ల వారీగా మోహరింపులు, మిలిటరీ యూనిట్లు ఏర్పాటు చేయాలని భావిస్తోంది. మిలిటరీ కమాండర్లతో కూడిన రెండు కొత్త పర్యవేక్షణ జోన్‌లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపింది. కాశ్మీర్, గిల్గిత్-బాల్టిస్థాన్‌తో సహా మరికొన్ని ప్రావిన్స్‌లను తమ అధీనంలోకి తీసుకోవాలని ప్లాన్ చేస్తోంది. మిలిటరీ యూనిట్లలో నాయకత్వ మార్పులు కూడా చేపట్టింది. 2022 నవంబరులో పాక్ ప్రభుత్వంతో చేసుకున్న కాల్పుల విరమణ ఒప్పందాన్ని టిటిపి ముగించింది. ఆ తర్వాత నుంచి పాక్ భద్రతా దళాలు, పోలీసులు, అధికారులపై టిటిపి వరుస దాడులకు పాల్పడుతోంది. ముఖ్యంగా ఖైబర్ పఖ్తుంఖ్వా, బలోచిస్థాన్ ప్రావిన్స్‌లలో కార్యకలాపాలు విస్తరించింది. అఫ్ఘానిస్థాన్ భూభాగం నుంచి టిటిపి ఉగ్రదాడులకు పాల్పడుతుందని పాక్ అధికారులు ఆరోపిస్తున్నారు. అయితే, తాలిబన్ ప్రభుత్వం వీటిని ఖండిస్తోంది.

# మహిళా మేనేజర్‌పై సామూహిక అత్యాచారం.. కంపెనీ సిఇఒతోపాటు మరో ఇద్దరి అరెస్టు

**జైపూర్, డిసెంబరు 26:** రాజస్థాన్‌లోని ఓ కంపెనీ మేనేజర్‌గా పనిచేస్తున్న మహిళ గ్యాంగ్ రేప్‌నకు గురైంది. ఈ ఘటన ఉదయ్‌పూర్‌లో జరిగింది. ఆ కేసుతో సంబంధం ఉన్న ప్రైవేట్ కంపెనీ సిఇఒతోపాటు మరో ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. ఓ ప్రైవేటు కంపెనీలో సిఇఒగా పనిచేస్తున్న జితేశ్ సిసోడియా.. వారం క్రితం పుట్టినరోజు పార్టీ ఇచ్చాడు. ఆ పార్టీకి మహిళా మేనేజర్ కూడా హాజరయ్యారు. ఈ కేసులో మరో మహిళా ఎగ్జిక్యూటివ్, ఆమె భర్త గౌరవ్ సిరోహి నిందితులుగా ఉన్నారు. గురువారం ముగ్గురిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. వారిని నాలుగురోజుల కస్టడీలోకి తీసుకున్నారు. బిఎన్ఎస్ చట్టంలోని సంబంధిత సెక్షన్ల కింద సుఖేర్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. నిందితులను రిమాండ్‌కు పంపినట్లు ఉదయ్‌పూర్ ఎస్పీ యోగేశ్‌గోయల్ తెలిపారు. బర్త్‌డే పార్టీ ముగిసిన తర్వాత అతిథులు అందరూ వెళ్లిపోయారని, అయితే మహిళా ఎగ్జిక్యూటివ్.. లేడీ మేనేజర్‌ను ఇంటి వద్ద డ్రాప్ చేస్తానని చెప్పింది. కారులో బాధిత మేనేజర్‌తోపాటు సిసోడియా, సిరోహి ఉన్నారు. దారిలో ఓ చోట ఆగి సిగరెట్లు కొన్నారని, ఆ సిగరెట్ తాగిన తర్వాత స్పృహ కోల్పోయినట్లు మేనేజర్ చెప్పింది. మరుసటి రోజు మళ్లీ నిద్ర లేచినట్లు పేర్కొన్నది. అయితే తనపై లైంగిక దాడి జరిగినట్లు అప్పుడు గుర్తించినట్లు ఆమె తెలిపారు. బాధిత మహిళ ఇచ్చి ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేశారు. నిందితుల్ని అరెస్టు చేసి దర్యాప్తు చేపడుతున్నారు. లేడీ మేనేజర్‌కు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆమె వాంగ్మూలాన్ని రికార్డు చేశారు. ఎఎస్పీ మాధురీవర్మకు దర్యాప్తు వివరాలు అందజేసినట్లు తెలుస్తోంది.

# ఢిల్లీని కమ్మేసిన పొగమంచు

## ప్రమాదకర స్థాయిలో వాయుకాలుష్యం

## గాలి నాణ్యత ఎక్యూఐ 400గా నమోదు

## ఎయిర్ ప్యూరిఫైయర్లపై జిఎస్‌టి తగ్గించలేం..

## ఢిల్లీ హైకోర్టులో తేల్చిచెప్పిన కేంద్రం

**న్యూఢిల్లీ, డిసెంబరు 26:** దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం రోజురోజుకు పెరుగుఓతంది. ప్రమాదకర స్థాయిలో పెరుగుతోందని పర్యావరణ నిపుణులు ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం ఉదయం హానికర పొగమంచు ఢిల్లీలోని అనేక ప్రాంతాలను కమ్మేసింది. దీంతో దృశ్య నాణ్యత కూడా బాగా పడిపోయింది. గాలి నాణ్యత గణనీయంగా క్షీణించింది. ఢిల్లీ వ్యాప్తంగా గాలి నాణ్యత సూచి (ఏక్యూఐ) గురువారం ఉదయం 220గా నమోదైంది. ఓ సమయంలో 310గా కూడా నమోదైనట్లు కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి వెల్లడించింది. అదే శుక్రవారం ఉదయం గాలి నాణ్యత సూచి 400గా నమోదైనట్లు తెలిపింది.

ఉదయం 8 గంటల ప్రాంతంలో నగరంలో ఓవరాల్ ఏక్యూఐ లెవెల్స్ 305గా నమోదైంది. అత్యధికంగా ఆనంద్ విహార్ ప్రాంతంలో గాలి నాణ్యత సూచిక 390గా నమోదైంది. బవానాలో 379, నరేలా ప్రాంతంలో 356, ఆర్కే పురంలో 320గా ఏక్యూఐ నమోదైంది. నగరంలోని మరికొన్ని ప్రాంతాల్లో గాలి నాణ్యత మెరుగ్గా నమోదైంది.

ద్వారకలో 253, అరబిందో మార్గ్ (258), మందిర్ మార్గ్ (234), విమానాశ్రయం ప్రాంతంలో (239)గా గాలి నాణ్యత నమోదైంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాయుకాలుష్యం తీవ్రంగా ఉండటంతో గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ స్టేజ్ 4 కింద ఢిల్లీ ప్రభుత్వం ఆంక్షలు అమలు చేస్తోంది.

**ఎయిర్ ప్యూరిఫైయర్లపై జిఎస్‌టి తగ్గించలేం: కేంద్రం**

ఢిల్లీలో గాలి కాలుష్యం తీవ్రంగా ఉన్న నేపథ్యంలో ఎయిర్ ప్యూరిఫైయర్లపై జిఎస్‌టి తగ్గించాలన్న అభ్యర్థనను కేంద్రం తోసిపుచ్చింది. అది ఆమోదయోగ్యం కాదని పేర్కొంది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం ఢిల్లీ హైకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసింది. ప్రముఖ న్యాయవాది కపిల్ మదన్ దాఖలు చేసిన ప్రజాప్రయోజనాల వ్యాజ్యంపై విచారణ చేపట్టిన ఢిల్లీ హైకోర్టు జిఎస్‌టి తగ్గింపు అంశంపై వివరణాత్మక స్పందన తెలియజేయాలని కోరిన నేపథ్యంలో శుక్రవారం మరోసారి చేపట్టింది. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వంపై న్యాయస్థానం తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. జిఎస్‌టి తగ్గింపుపై నిర్ణయం తీసుకునేందుకు జిఎస్‌టి మండలికి ఇబ్బందేమిటని ప్రశ్నించింది. వైద్య పరికరాల వర్గీకరణను ఆరోగ్య మంత్రిత్వ శాఖ నిర్వహిస్తుందని, ఈ విషయంపై జిఎస్‌టి కౌన్సిల్ నిర్ణయం తీసుకోలేదని తెలిపింది. జిఎస్‌టి కౌన్సిల్ ఒక రాజ్యాంగ సంస్థ అని.. అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు ఇందులో పాల్గొంటున్నందున జిఎస్‌టి తగ్గింపు ప్రక్రియను రెండు రోజుల్లో పూర్తి చేయలేమని కేంద్రం తరపున విచారణకు హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ ఎన్ వెంకట్రామన్ అన్నారు. ఈ విషయంపై వివరణాత్మక అఫిడవిట్ దాఖలు చేయడానికి సమయం ఇవ్వాలని ఆయన కోర్టును కోరారు. దీంతో కోర్టు 10 రోజుల సమయం ఇచ్చింది. తదుపరి విచారణ 9కివాయిదా.

# పెంచిన రైల్వేఛార్జీలు అమల్లోకి!



**న్యూఢిల్లీ, డిసెంబరు 26:** దేశవ్యాప్తంగా రైల్వేశాఖ పెంచిన రైలు ఛార్జీలు శుక్రవారం నుంచి అమల్లోకి వచ్చాయి. ఈ ఏడాది జులైలో ఒకసారి ఛార్జీలు పెంచిన రైల్వే శాఖ, కేవలం ఐదు నెలల వ్యవధిలోనే రెండోసారి ధరలను పెంచడం గమనార్హం. మెయిల్/ఎక్స్‌ప్రెస్, ఏసీ క్లాసులతో పాటు, 215 కిలోమీటర్ల కంటే ఎక్కువ దూరం ప్రయాణించే ఆర్డినరీ నాన్ ఏసీ క్లాసులపై కూడా ఈ పెంపు ప్రభావం చూపనుంది. అయితే, సబర్బన్ (లోకల్) రైళ్లు, సీజన్ టికెట్లకు ఈ పెంపు నుంచి పూర్తిగా మినహాయింపు ఇవ్వడం సామాన్య ప్రయాణికులకు కొంత ఊరటనిచ్చే అంశం. భారీగా పెరిగిన నిర్వహణ ఖర్చులు, ముఖ్యంగా సిబ్బంది జీతభత్యాలు రూ.1,15,000 కోట్లు, పెన్షన్ల బిల్లు రూ.60,000 కోట్లు భారాన్ని తగ్గించుకునేందుకే ఈ ఛార్జీల హేతుబద్ధీకరణ చేపట్టినట్లు రైల్వే మంత్రిత్వ శాఖవెల్లడించింది. ఈ పెంపు ద్వారా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా సుమారు రూ.600 కోట్ల అదనపు ఆదాయం సమకూరుతుందని అంచనా వేస్తున్నారు. ఛార్జీలు పెంచినప్పటికీ, ఇప్పటికీ ప్రయాణికుల టికెట్ ధరలో దాదాపు 50 శాతం సబ్సిడీ రూపంలో తామే భరిస్తున్నామని రైల్వే శాఖ పేర్కొంది. ౦ల్వే బోర్డు జారీ చేసిన కమర్షియల్ సర్క్యులర్ నం. 24 ప్రకారం, ఛార్జీల పెంపు సబర్బన్, సీజన్ టికెట్లకు ఎలాంటి మార్పు లేదు. ఆర్డినరీ నాన్‌ఏసీ 215 కిలోమీటర్ల వరకు ప్రయాణించే వారికి పాత ఛార్జీలే వర్తిస్తాయి. ఆ తర్వాత దూర ప్రయాణాలపై శ్లాబుల వారీగా రూ.5 నుంచి రూ.20 వరకు పెంచారు. స్లీపర్ క్లాస్ (ఆర్డినరీ): కిలోమీటర్‌కు 1 పైసా పెరిగింది. మెయిల్/ఎక్స్‌ప్రెస్ (నాన్‌ఏసీ, ఏసీ క్లాసులు స్లీపర్, ఏసీ ఛైర్ కార్, ఏసీ 3టైర్, 2టైర్, ఫస్ట్ క్లాస్‌తో పాటు రాజధాని, శతాబ్ది, వందే భారత్ వంటి అన్ని ప్రీమియం రైళ్లలో కిలోమీటర్‌కు 2 పైసల చొప్పున ఛార్జీలు పెరిగాయి. ఈనెల 26కు ముందే టికెట్లు బుక్ చేసుకున్న ప్రయాణికులు అదనపు ఛార్జీలు చెల్లించాల్సిన అవసరం లేదని రైల్వే శాఖ స్పష్టం చేసింది. రిజర్వేషన్ ఫీజు, సూపర్‌ఫాస్ట్ సర్‌ఛార్జ్‌లలో ఎలాంటి మార్పులు చేయలేదు.

**ప్రభుత్వంపై విపక్షాల తీవ్ర విమర్శలు**

రైలు ఛార్జీల పెంపుపై విపక్షాలు తీవ్రంగా మండిపడ్డాయి. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే స్పందిస్తూ, "మోదీ ప్రభుత్వం సామాన్య ప్రజలను దోచుకోవడానికి ఏ అవకాశాన్నీ వదలడం లేదు. బడ్జెట్‌కు కొన్ని రోజుల ముందు, పార్లమెంటులో చర్చ లేకుండా ఛార్జీలు పెంచారు. ప్రత్యేక రైల్వే బడ్జెట్ లేకపోవడంతో జవాబుదారీతనం కనుమరుగైంది" అని విమర్శించారు. రైల్వే భద్రతా వ్యవస్థ కవచ్ కేవలం 3 మార్గాలకే పరిమితమైందని, ఇది కేవలం ప్రచారానికే తప్ప ఆచరణలో విఫలమైందని ఆరోపించారు. కాంగ్రెస్ నేతలు రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ రాజీనామా చేయాలని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ విమర్శించారు.

# వివాదాల పరిష్కారంలో మధ్యవర్తిత్వమే మేలు

## చీఫ్ జస్టిస్ సూర్యకాంత్



**పనాజి, డిసెంబరు 26:** వివాదాల పరిష్కారంలో మధ్యవర్తిత్వం ఎంతో విజయవంతమైన, తక్కువ ఖర్చుతో కూడిన ప్రక్రియ అని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. ఇది కేసులోని ఇరుపక్షాలకూ గెలుపుగెలుపు పరిస్థితిని కల్పిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈరోజు గోవాలోని పనాజీలో మధ్యవర్తిత్వంపై అవగాహన కోసం ఏర్పాటు చేసిన పాదయాత్రలో పాల్గొన్న అనంతరం ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. మధ్యవర్తిత్వ ప్రక్రియలో మధ్యవర్తి ఎవరిపైనా తమ నిర్ణయాలను రుద్దరని సీజేఐ స్పష్టం చేశారు. వివాదంలో ఉన్న పక్షాలు కోరుకున్న పరిష్కారాన్నే దీని ద్వారా సాధించవచ్చని తెలిపారు. ఇది ఇరువర్గాల అంగీకారంతో జరిగే పరిష్కారం కాబట్టి, ఇద్దరికీ ప్రయోజనకరంగా ఉంటుందని వివరించారు. సుప్రీంకోర్టు ఖిదేశం కోసం మధ్యవర్తిత్వం అనే కార్యక్రమాన్ని ప్రారంభించిందని జస్టిస్ సూర్యకాంత్ వెల్లడించారు.

న్యాయవ్యవస్థలోని భాగస్వాములైన న్యాయవాదులు, న్యాయమూర్తులతో పాటు సాధారణ ప్రజలకు కూడా దీని ప్రాముఖ్యతను తెలియజేయడమే ఈ కార్యక్రమ ఉద్దేశమని పేర్కొన్నారు. మధ్యవర్తిత్వం ఒక విజయవంతమైన సాధనమని ప్రజలు గుర్తించినప్పుడు మంచి ఫలితాలు వస్తాయని ఆయన అన్నారు. కొన్ని ప్రత్యేక కేసులను మధ్యవర్తిత్వానికి పంపమని హైకోర్టులను, జిల్లా కోర్టులను ఒప్పించగలిగామని తెలిపారు. ఇది పాత, కొత్త కేసులకే కాకుండా, కోర్టుకు రాకముందు దశలో (ప్రీలిటిగేషన్) ఉన్న వివాదాలకు కూడా వర్తిస్తుందని, ఇది నిరంతర ప్రక్రియ అని ఆయన పేర్కొన్నారు.

# సీక్రెట్‌గా ఫోన్ వాడుతోందని భార్యను చంపి ఇంట్లోనే పూడ్చిపెట్టిన భర్త



**గోరఖ్‌పూర్, డిసెంబరు 26:** భార్య రహస్యంగా మొబైల్ ఫోన్ వాడుతోందన్న కోపంతో ఓ భర్త ఆమెను దారుణంగా హత్య చేసి మృతదేహాన్ని ఇంటి వెనుకే గొయ్యి తీసి పూడ్చిపెట్టి, ఆమె ఆత్మహత్య చేసుకుందని పోలీసులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశాడు. లూథియానాలో కూలీగా పనిచేసే అర్జున్, ఈ నెల 21న యూపి గోరఖ్‌పూర్‌లోని తన ఇంటికి తిరిగి వచ్చాడు. ఆ సమయంలో అతని భార్య ఖుష్బూ రహస్యంగా మొబైల్ ఫోన్ వాడటాన్ని గమనించాడు. ఈ విషయమై ఇద్దరి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. ఆగ్రహంతో ఊగిపోయిన అర్జున్, ఖుష్బూ గొంతు నులిమి హత్య చేశాడు. ఆ తర్వాత ఇంటి వెనుక ఆరడుగుల గొయ్యి తవ్వి, ఓ మడత మంచం సహా ఆమె మృతదేహాన్ని అందులో పూడ్చిపెట్టాడు. అనంతరం ఖుష్బూ ఎవరికీ చెప్పకుండా ఇంట్లోంచి వెళ్లిపోయిందని కుటుంబ సభ్యులను నమ్మించాడు. రోజులు గడుస్తున్నా ఆమె ఆచూకీ లభించకపోవడంతో ఖుష్బూ తండ్రి తన అల్లుడిపై అనుమానంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రంగంలోకి దిగిన పోలీసులు అర్జున్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా తన భార్య ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుందని, మృతదేహాన్ని నదిలో పడేశానని చెప్పాడు. పోలీసులను గ్రామ సమీపంలోని నదీ తీరానికి తీసుకెళ్లి గంటలపాటు తప్పుదోవ పట్టించాడు. నదిలో గాలింపు విఫలమవడంతో పోలీసులు తమదైన శైలిలో అర్జున్‌ను మరోసారి విచారించగా, అతను నేరాన్ని అంగీకరించాడు. నిందితుడు ఇచ్చిన సమాచారంతో ఇంటి వెనుక తవ్వకాలు జరపగా మృతదేహం లభ్యమైందని గోరఖ్‌పూర్ సర్కిల్ ఆఫీసర్ శిల్పా కుమారి తెలిపారు. వివాహేతర సంబంధంపై అనుమానంతోనే అర్జున్ ఈ హత్య చేసినట్లు పోలీసులు భావిస్తున్నారు. మృతురాలి సోదరుడి ఫిర్యాదు మేరకు నిందితుడిని అరెస్ట్ చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. రెండేళ్ల క్రితం వివాహం చేసుకున్న ఈ దంపతులకు పిల్లలు లేరు.

# ఢిల్లీలోనూ రూ.5లకే భోజనం

## అటల్ క్యాంటీన్ పేరుతో ప్రారంభం

## 45 ప్రాంతాల్లో ప్రారంభించిన ప్రభుత్వం



**న్యూఢిల్లీ, డిసెంబరు 26:** దక్షిణాది రాష్ట్రాల్లో పేదల కడుపు నింపుతున్న రూ.5లకే భోజనం పథకం తాజా గా దేశ రాజధాని ఢిల్లీ లోనూ అందు బాటులోకి వచ్చింది. సిఎం రేఖా గుప్త నేతృత్వంలోని ఢిల్లీ ప్రభుత్వం మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి జయంతిని పురస్కరించుకుని ఢిల్లీ నగర వ్యాప్తంగా 'అటల్ క్యాంటీన్' పేరుతో రూ.5లకే భోజన పథకానికి శ్రీకారం చుట్టింది. ఢిల్లీ నగరంలో 45 ప్రాంతాల్లో అటల్ క్యాంటీన్‌లను ప్రారంభించారు. త్వరలో 100 ప్రాంతాలకు విస్తరించాలని యోచిస్తున్నట్లు ముఖ్యమంత్రి రేఖా గుప్త తెలిపారు. దేశరాజధాని ఢిల్లీలో నివసిస్తున్న పేదలు చాలా మంది ఆహారం లేక ఇబ్బందులు పడుతున్నారు. తమ ఆదాయంలో ఎక్కువ మొత్తాన్ని ఆహారం కోసం ఖర్చు చేయాల్సి వస్తోంది. ఇతర మౌలిక అవసరాలకు వదులుకోవాల్సిన పరిస్థితి. ఈ సమస్యను దృష్టిలో పెట్టుకుని ఎవరూ ఆకలితో బాధపడకూడదనే లక్ష్యంతో రూ.5లకే భోజనం అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు సిఎం రేఖా గుప్త వివరించారు. అటల్ క్యాంటీన్ మెనూలో అన్నం, పప్పులు, కూరగాయలు, బ్రెడ్ వంటి పోషకాహార పదార్థాలుంటాయని తెలిపారు. వీటి ద్వారా పేదలు, కార్మికులు,

రోజువారీ వేతన జీవులు లబ్ధిపొందుతారని ఆశాభావం వ్యక్తం చేశారు.

అటల్ క్యాంటీన్‌లు ప్రారంభించిన అనంతరం కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్, ఢిల్లీ పట్టణాభివృద్ధి మంత్రి ఆశిష్ సూద్, బిజెపి నేతలతో కలిసి క్యాంటీన్‌లోనే భోజనం చేశారు.

# సంక్షిప్తంగా..

## 31న గిగ్ వర్కర్ల దేశవ్యాప్త సమ్మె

**న్యూఢిల్లీ, డిసెంబరు 26:** దేశవ్యాప్తంగా యాప్ ఆధారిత సంస్థల్లో పనిచేస్తున్న గిగ్ వర్కర్లు మరోసారి ఆందోళన బాట పట్టారు. తమ దీర్ఘకాలిక డిమాండ్ల సాధన కోసం నూతన సంవత్సర వేడుకల రోజైన డిసెంబర్ 31న దేశవ్యాప్త మెగా సమ్మెకు పిలుపునిచ్చారు. ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ యాప్‌బేస్డ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్, తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫామ్ వర్కర్స్ యూనియన్ వంటి ప్రధాన కార్మిక సంఘాలు ఈ సమ్మెకు నాయకత్వం వహిస్తున్నాయి. స్విగ్గీ, జొమాటో, బ్లింకిట్, జెప్టో, అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి ప్రముఖ సంస్థల డెలివరీ భాగస్వాములు ఈ సమ్మెలో పాల్గొననున్నారు. ఈనెల 31న తలపెట్టిన ఈ మెగా సమ్మెకు ముందు, క్రిస్మస్ పండుగ రోజైన 25న కూడా గిగ్ వర్కర్లు ఫ్లాష్ స్ట్రైక్ నిర్వహించారు. గురుగ్రామ్, హైదరాబాద్ వంటి నగరాల్లో ఈ సమ్మె ప్రభావం స్పష్టంగా కనిపించింది. గురుగ్రామ్‌లో ఫుడ్ డెలివరీ సేవలకు తీవ్ర అంతరాయం కలగగా, హైదరాబాద్‌లోని గచ్చిబౌలి, కొండాపూర్ ప్రాంతాల్లో 2,000 మందికి పైగా కార్మికులు బైక్ ర్యాలీ నిర్వహించారు.

## తిరువనంతపురం మేయర్‌గా బిజెపి అభ్యర్థి రాజేశ్



**తిరువనంతపురం, డిసెంబరు 26:** కేరళ రాజకీయాల్లో బీజేపీ సరికొత్త రికార్డు సృష్టించింది. తిరువనంతపురం కార్పొరేషన్ మేయర్‌గా బీజేపీ నేత వి.వి. రాజేశ్ (49) ఎన్నికయ్యారు. శుక్రవారం జరిగిన మేయర్ ఎన్నికల్లో ఆయన 51 ఓట్లతో విజయం సాధించారు. రాష్ట్ర చరిత్రలో ఒక బీజేపీ నేత మేయర్ పీఠాన్ని అధిరోహించడం ఇదే తొలిసారి కావడంతో ఇది ఒక చరిత్రాత్మక ఘట్టంగా నిలిచింది. ఈ ఎన్నికల్లో సీపీఎం నేతృత్వంలోని లెఫ్ట్ కూటమి (ఎల్‌డీఎఫ్) అభ్యర్థి ఆర్.పి. శివాజీకి 29 ఓట్లు రాగా, కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే కె.ఎస్. శబరినాథన్‌కు 19 ఓట్లు మాత్రమే లభించాయి. ఒక ఇండిపెండెంట్ కౌన్సిలర్ ఓటింగ్‌కు దూరంగా ఉన్నారు.

## టొరాంటో వర్సిటీలో భారతీయ విద్యార్థి హత్య!



**ఒట్టావా, డిసెంబర్ 26:** కెనడాలో మరో ఘోరం జరిగింది. ఇటీవల టొరంటోలో 30 ఏళ్ల భారతీయ మహిళ హిమాన్షి ఖురానా హత్య ఘటన మరువక ముందే మరో భారతీయ విద్యార్థి శివంక్ అవస్థి (20) హత్యకు గురయ్యాడు. దీంతో భారతీయుల్లో తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయి. టొరంటో విశ్వవిద్యాలయంలోని స్కార్‌బరో క్యాంపస్ సమీపంలో 20 ఏళ్ల భారతీయ విద్యార్థి శివాంక్ అవస్థిపై దుండగుడు కాల్పులు జరిపాడు. తీవ్ర గాయాలతో ఉండగా పోలీసులు గమనించారు. ఆసుపత్రికి తరలించే లోపే ప్రాణాలు కోల్పోయాడు. దీంతో పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుడి కోసం గాలిస్తున్నారు. ఈ ఏడాది టొరంటోలో జరిగిన 41వ హత్య కేసుగా పోలీసులు తెలిపారు.

## లాలూఫ్యామిలీకి షాక్.. ప్రభుత్వ బంగ్లా నుంచి వస్తువులు తరలింపు



**పాట్నా, డిసెంబర్ 26:** ఎట్టకేలకు లాలూ ప్రసాద్ యాదవ్ కుటుంబం ప్రభుత్వ బంగ్లాను ఖాళీ చేసింది. పాట్నాలోని 10 సర్క్యులర్ రోడ్‌లోని బంగ్లాలో 19 ఏళ్ల నుంచి నివాసం ఉంటున్నారు. అయితే ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఆర్జేడి ఘోర పరాజయం పాలైంది. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. దీంతో ప్రభుత్వ బంగ్లాను ఖాళీ చేయాలని లాలూ కుటుంబానికి నోటీసులు ఇచ్చింది. దీనిపై గత కొద్దిరోజులుగా రాజకీయ దుమారం కొనసాగుతోంది. ఖాళీ చేసేందుకు నిరాకరించింది. ముఖ్యమంత్రులుగా పని చేసిన తమకు బంగ్లాను కేటాయించారా? అని ఆర్జేడీ నిలదీసింది. పైగా లాలూ ప్రసాద్‌కు అనారోగ్యం కారణంగా ఇదే బంగ్లా కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. కానీ ప్రభుత్వం నిరాకరించింది.

## ప్రాథమిక స్థాయి నుంచి వార్తాపత్రికలు చదవాల్సిందే: యుపి సర్కార్

**లక్నో, డిసెంబరు 26:** విద్యార్థులు మొబైల్‌ఫోన్లకు బానిసలు కాకుండా చూడటంతోపాటు వారికి ప్రాపంచిక పరిజ్ఞానం మరింతగా పెంపొందించేదిశగా యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల విద్యార్థులు వార్తాపత్రికలు చదవడాన్ని తప్పనిసరిచేసింది. శుక్రవారం ఇందుకు సంబంధించి మార్గదర్శకాలు కూడా జారీచేసింది. విద్యార్థుల్లో పఠనాసక్తినిపెంచడం, డిజిటల్‌స్క్రీన్‌టైమ్‌ను తగ్గించాలన్న లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించింది. విద్యార్థులకోసం పాఠవాలల గ్రంథాలయాల్లో హిందీ, ఇంగ్లీషు పేపర్లను అందుబాటులో ఉంచనున్నారు. ఉదయం స్కూలు అసెంబ్లీలో కనీసం పదినిమిషాలు వార్తాపత్రిక చదవడానికి కేటాయించాలి. జాతీయ, అంతర్జాతీయ, క్రీడారంగాల అంశాలను విద్యార్థులు చదవాలి.

## పర్యాటక రంగం అభివృద్ధికి తీర ప్రాంతంలోని రహదారులను జాతీయ రహదారికి అనుసంధానించాలి

బాపట్ల,డిసెంబర్26,(ప్రభాతవార్త): పర్యాటక రంగం అభివృద్ధికి తీర ప్రాంతంలోని రహదారులను జాతీయ రహదారికి అనుసంధానించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. పర్యాటక రంగం అభివృద్ధి ప్రణాళికలో భాగంగా బాపట్ల, చీరాల, వేటపాలెం మండలాలలోని పొట్టి సుబ్బయ్య పాలెం, వాడరేవు, పాండురంగాపురం తదితర గ్రామాలలో



శుక్రవారం ఆయన పర్యటించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తీర ప్రాంతాలలో ఒక కిలోమీటర్ మేర ప్రభుత్వ భూములు, అసైన్డ్ భూములు, పట్టా భూములపై స్పష్టమైన వివరాలను నివేదించాలని అధికారులను ఆదేశించారు. అందుకు సంబంధించిన మ్యాప్ లు సిద్ధం చేయాలన్నారు. 167 ఏ జాతీయ రహదారికి అన్ని రహదారులను అనుసంధానించడం ద్వారా పర్యాటక రంగం మరింతగా అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. అందుబాటులో ఉన్న ఆర్ అండ్ బి రహదారులు, పంచాయితీ రాజ్ రహదారులు, ప్రభుత్వ అతిథి గృహాలు, బీచ్ ల వద్ద ప్రభుత్వ భూముల వివరాలను ఇవ్వాలన్నారు. మాస్టర్ ప్లాన్ రూపొందించి ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. పొట్టి సుబ్బయ్య పాలెం నుంచి వాడరేవు వరకు ఒక క్లస్టర్ గాను, వాడరేవు నుంచి పాండురంగాపురం వరకు రెండో క్లస్టర్ గా ప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు. హైదరాబాద్ సిటీ నుంచి ప్రజలు అత్యధికంగా బాపట్ల జిల్లాలోని బీచ్ లకు పర్యాటకులు అధికంగా వస్తున్నారని సర్వేలో తేలిందన్నారు. ఈ క్రమంలో రహదారులను మరింత అభివృద్ధి చేస్తే పర్యాటక ప్రాంతంగా బాపట్ల జిల్లా దినాభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు గ్లోరియా, చంద్రశేఖర్, ఆర్ అండ్ బి డి అరుణకుమారి, పి ఆర్ డిఈ రాజన్ బాబు, తహసిల్దార్లు, ఇంజినీర్లు, సర్వేయర్లు, తదితరులు ఉన్నారు.

## తెదేపా బలోపేతానికి కృషి చేయాలి : ఎమ్మెల్యే ధూళిపాళ్ళ

పొన్నూరు, డిసెంబర్ 26,ప్రభాతవార్త: జిల్లా పార్లమెంటరీ కమిటీలో స్థానం దక్కించుకున్న నాయకులు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ సూచించారు. పట్టణానికి చెందిన షేక్ బాజిసాహెబ్‌ను జిల్లా పార్లమెంటరీ కమిటి ఉపాధ్యక్షుడిగా నియమించిన సందర్భంగా ఆయనను ఎమ్మెల్యే అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ ం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ ఫలాలను ప్రజల్లోకి తీసుకెళ్ళేవిధంగా కమిటి సభ్యులు కృషి చేయాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే అజెండాగా ముందుకు సాగాలన్నారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ, కార్యకర్తల సంక్షేమాన్ని కూడా పట్టించుకోవాల్సిన అవసరాన్ని గుర్తించారు. టిడిపికి బలమైన క్యాడర్ ఉందన్నారు. ఈ క్యాడర్‌ను చెక్కు చెదరకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ సందర్భంగా బాజి సాహెబ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో తనను ఉపాధ్యక్షులుగా నియమించారని, శక్తివంచన లేకుండా



పార్టీ బలోపేతానికి, పార్టీ నిర్వహించే కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటానని చెప్పారు. తనకు పదవి రావడానికి కృషి చేసిన ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంజుమన్ కమిటి అధ్యక్షుడు మగ్బుల్‌బేగ్, నాయకులు పఠాన్ పిరోజ్‌ఖాన్, షేక్ బాజి, అబ్దుల్ ఖదీర్ తదితరులున్నారు.

## అనారోగ్యంతో మృతి చెందిన జిల్లా పోలీస్ జాగిలం టైగర్

### పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించిన జిల్లా పోలీసులు

బాపట్ల,డిసెంబర్26,ప్రభాతవార్త: పోలీసు భద్రతా విభాగంలో 2017 సంవత్సరం నుండి విశేష సేవలు అందించిన పోలీసు స్నిఫర్ జాగిలం టైగర్" (వయస్సు: 8 సంవత్సరాలు 11 నెలలు) అనారోగ్యంతో శుక్రవారం ఉదయం మృతి చెందింది. టైగర్" మృతి పట్ల జిల్లా ఎస్పీ శ్రీ బి. ఉమామహేశ్వర్ ఐపీఎస్ గారు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. స్థానికంగా వెదుళ్లపల్లి గ్రామంలో ఉన్న డాగ్ కెన్నెల్ భవనంలో ఉంచిన టైగర్" పార్థివ దేహానికి ఎస్పీ పూలమాల వేసి గౌరవ వందనం సమర్పించి ఘన నివాళులు అర్పించారు. అనంతరం పోలీసు లాంఛనాలతో ఘనంగా అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా పోలీస్ శాఖకు టైగర్" జాగిలం విశేష సేవలు అందించిందన్నారు. స్నిఫర్ విభాగంలో సుమారు మూడు సంవత్సరాల పాటు ఎనలేని సేవలు అందించి, అనారోగ్యంతో మృతి చెందడం బాధాకరమన్నారు. టైగర్" జాగిలాన్ని పోలీస్ కుటుంబ సభ్యులలో ఒకరిగా భావించామన్నారు. అనేక కీలక వీఐపీ, వీవీఐపీ బందోబస్తుల సమయంలో



పేలుడు పదార్థాలను గుర్తించడంలో చురుగ్గా, సమర్థవంతంగా పనిచేసిందన్నారు. "టైగర్" మృతి తీరని లోటని, అనారోగ్యంతో మరణించడం చాలా బాధ కలిగిస్తోందని విచారం వ్యక్తం చేశారు. వీఐపీ, వీవీఐపీ బందోబస్తుల సమయంలో పేలుడు పదార్థాలు, పరికరాలను గుర్తించడంలో, స్వాతంత్ర్య దినోత్సవం, గణతంత్ర దినోత్సవం వంటి వివిధ కార్యక్రమాలలో వీఐపీ లకు గౌరవ వందనం సమర్పించడంలో, వారికి బొకేలు అందించడంలో "టైగర్" విశేష గుర్తింపు పొందిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏ.ఆర్. డిఎస్పీ పి. విజయ సారథి, అడ్మిన్ ఆర్ఐ షేక్ మోలుద్దీన్, ఇతర పోలీస్ అధికారులు, డాగ్ హ్యాండ్లర్లు తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్పకు మహా కలశాభిషేకం

గుంటూరు కల్చరల్,డిసెంబరు 26,ప్రభాతవార్త : స్థానిక మల్లారెడ్డినగర్ శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్పస్వామి దేవాయం పాలకమండలి నిర్వహిస్తున్న 15వ మండలపూజా మహోత్సవాలు శనివారం మెట్ల పూజతో ముగుస్తాయని చైర్మన్ మెట్టు కృష్ణారెడ్డి ఆలయ ప్రాంగణంలో జరిగిన ఒక సమావేశంలో తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడు తూఐ శనివారం ఉదయం అష్టద్రవ్య మహాగణతి హోమం, నవకలశార్చన, అయ్యప్పకు మహాకలశాభిషేకం, మద్యాహ్నం



12గంటలకు విశేష అన్న ప్రసాద వితరణ,సాయంత్రం ప్రత్యేకంగా మెట్లపూజ,డప్పు శ్రీను చే అయ్యప్ప భజన,రాత్రి అయ్యప్పలకు భిక్ష కార్యక్రమంతో కార్యక్రమాలు ముగుస్తాయని తెలిపారు.



మాజీ ఎమ్మెల్యే వంగవీటి మోహనరంగ వర్ధంతి సందర్భంగా పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వెల్లటూరు డిస్ట్రిబ్యూటరీ కమిటి చైర్మన్ ఎర్రంశెట్టి కర్ణ శ్రీనివాసరావు (బట్టిప్రోలు సాగునీటి సంఘ అధ్యక్షులు
(తాడేపల్లి,డిసెంబరు 26,ప్రభాతవార్త )

## పేదల ఆశాకిరణం వంగవీటి

### రాష్ట్ర మైనార్టీ కమిషన్ సభ్యుడు షేక్ సైఫుల్లా

పొన్నూరు, డిసెంబర్ 26,ప్రభాతవార్త: పేద ప్రజల కోసం ప్రాణాలు త్యాగం చేసిన మహనీయుడు వంగవీటి మోహనరంగా అని రాష్ట్ర



మైనార్టీ కమిషన్ సభ్యుడు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువనాయకుడు షేక్ సైఫుల్లా అన్నారు. పట్టణ, మండల పరిధిలో వంగవీటి మోహనరంగా వర్ధంతి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలగపాలెం రామమందిరం వద్ద ఉన్న రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సైఫుల్లా మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల సమస్యల పరిష్కారం కోసం అహర్నిశలు పోరాడిన నేత వంగవీటి అన్నారు. ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని యువత ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. రంగా మృతి చెంది మూడు దశాబ్దాలు దాటినప్పటికీ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచారన్నారు. అనంతరం కొండముడి, చిన ఇటికంపాడు, కసుకర్రు, తాళ్ళపాలెం గ్రామాల్లోని వంగవీటి మోహనరంగా విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆకుల వెంకటేశ్వరరావు, అంబటి వెంకటేశ్వరరావు, ఎందేటి వెంకటసుబ్బయ్య, బోయిన శివనాగరాజు, వట్టిప్రోలు రంగారావు, అమిరినేని సాంబశివరావు, ఆకుల రామమోహన్, దేవరకొండ గోపి, చింతలపూడి మురళీకృష్ణ, ఆకిశెట్టి గాంధీ, షేక్ మహమ్మద్(మామ), ఆకుల చినవెంకటేశ్వరరావు, పుట్లా సంపత్, ఎస్ఎం బాషా, సూరా రామారావు తదితరులున్నారు.

## ముక్కోటి ఏకాదశి ఉత్సవాల్లో శ్రీరామావతారంలో శ్రీవారు

తెనాలి మున్సిపాలిటీ డిసెంబర్26 (ప్రభాతవార్త): పట్టణంలోని వైకుంఠపురంలో వేంచేసిన శ్రీ లక్ష్మీ పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం నందు గత ఆరురోజులుగా జరుగుతున్న ముక్కోటి ఏకాదశి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం 7వ రోజు,శ్రీవారు సీతారామ లక్ష్మణ సమేతంగా,



శ్రీరామావతారంలో భక్తులకు దర్శనమిచ్చినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి వి. అనుపమ ఒక ప్రకటనలో తెలిపారు. ముక్కోటి ఏకాదశి ఉత్సవాల్లో భాగంగా స్వామి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను శుక్రవారం ఉదయం పట్టణంలోని పురవీధుల గుండా గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా పట్టణానికి చెందిన లాస్య కూచిపూడి నాట్యాలయం బృందం వారిచే భరతనాట్యం నిర్వహించారు అనంతరం భక్తులు ఈ ముక్కోటి ఏకాదశి ఉత్సవాల్లో శ్రీవారు అమ్మవార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## ప్రజాపోరాటంలో "సిపిఐ" శతాబ్దిఉత్సవం


తెనాలి టౌన్ డిసెంబర్24(ప్రభాతవార్త): భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ)శతవార్షికోత్సవాల సందర్భంగా, శుక్రవారం పట్టణంలోని సిపిఐ కార్యాలయంలో వంద సంవత్సరాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించ్చారు. అనంతరం జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఐ పట్టణ కార్యదర్శి మద్దినేని కిరణ్ బాబు మాట్లాడుతూ,భారత



కమ్యూనిస్టు పార్టీ అమర జీవుల త్యాగాలతో ఎరుపెక్కిన ఎర్రజెండా పార్టీ అని, స్వాతంత్రానికి ముందు ఆవిర్భవించి నేటికి 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సిపిఐ పార్టీ,రైతులు,పేదలు, కార్మికులు,సమస్త కష్టజీవుల హక్కుల సాధనకు,మన రాజ్యాంగం మనకు ఇచ్చిన పౌరహక్కుల రక్షణకు,తొలి ప్రాధాన్యతను ఇస్తున్న పార్టీ సిపిఐ అని,నేడు దేశంలో దేశభక్తియుత లౌకికవాద మూలాల పరిరక్షణ కోసం, అన్ని వర్గాల ప్రజల హక్కుల సాధన కోసం,భారత కమ్యూనిస్టు పార్టీ పోరాటాలు నిర్వహిస్తుందని,బ్యాంకుల జాతీయకరణ,జమీందారీ, జాకీర్దారి వ్యవస్థల రద్దు, స్వదేశీ పరిశ్రమల రక్షణ,కార్మిక ఉద్యోగ వర్గాల హక్కుల పరిరక్షణ, లాభదాయకమైన వ్యవసాయ విధానాలు,పేద దళిత మైనారిటీ వర్గాల మహిళల అభ్యున్నతి కోసం బహుముఖ పోరాటా లు చేసి, ఎన్నో విజయాలను సాధించి, పెట్టిన పార్టీ సిపిఐ అన్నారు. ఈ కార్యక్రమంలో తెనాలి పట్టణ సిపిఐ నాయకులు, బొల్లిముంత కృష్ణ,చెరుకుమల్లి సింగారావు పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు.

## నగర అభివృద్ధి పనులకు రూ. 20.95 కోట్లు కేటాయిస్తూ స్టాండింగ్ కమిటీ సభ్యుల ఆమోదం : నగర మేయర్

గుంటూరు కార్పొరేషన్, డిసెంబర్ 26 ( ప్రభాత వార్త) : గుంటూరు నగరంలోని పలు ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు రూ. 20.95 కోట్లు కేటాయిస్తూ శుక్రవారం నగర



మేయర్ కోవెలమూడి నాని అధ్యక్షతన జరిగిన స్టాండింగ్ కమిటీ సభ్యుల సమావేశంలో సభ్యులు ఆమోదముద్ర వేశారు. ఈ సమావేశంలో కమిషనర్ పులి శ్రీనివాసులు, స్టాండింగ్ కమిటీ సభ్యులు, కార్పొరేషన్ లోని వివిధ విభాగాల అధిపతులు, పాల్గొని సుదీర్ఘంగా చర్చించారు. అత్యవసర పనుల నిమిత్తం స్టాండింగ్ కమిటీ అధ్యక్షులు, మేయర్ కోవెలమూడి రవీంద్ర వెల్లడించారు.

## ఆర్.వి.ఆర్ జె.సి. ఇంజనీరింగ్ కళాశాలలో ఘనంగా ప్రారంభమైన కొలరిడో2025" నేషనల్ ఫెస్ట్

గుంటూరు విద్య డిసెంబర్ 26 ప్రభాతవార్త : ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) భావనల సృష్టి నుండి స్వతంత్ర నిర్ణయాల వరకూ విస్తరిస్తూ మానవ మేధస్సుతో పోటీ పడగల స్థాయికి చేరుకుందని, ఇది అన్ని రంగాల్లో భవిష్యత్తును శాసించనుందని ఏ.పి. స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్




ఎడ్యుకేషన్ (ఏపీఎస్‌సీహెచ్ఈ) చైర్మన్ డా. కె. మధు మూర్తి పేర్కొన్నారు. స్థానిక చౌడవరంలోని ఆర్.వి.ఆర్ జె.సి. ఇంజనీరింగ్ కళాశాలలో డిసెంబర్ 26 27 న రెండు రోజుల పాటూ "కొలరిడో2025" పేరుతో జరుగుతున్న నేషనల్ లెవెల్ టెక్నికల్, కల్చరల్, స్పోర్ట్స్ ఫెస్ట్ లో భాగంగా ది: 26122025 న శుక్రవారం నాడు తొలి రోజున జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమానికి గౌరవ అతిథిగా ఏ.పి. స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ చైర్మన్ డా. మధు మూర్తి, ముఖ్యఅతిథిగా టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ సిఓఓ శ్రీ శి. రవి శంకర్ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డా.రీ. మధు మూర్తి మాట్లాడుతూ నూతన ఆవిష్కరణలే దేశ ప్రగతికి పునాదులు అని, విద్యార్థులు తమ సాంకేతిక విజ్ఞానంతో సమాజానికి ఉపయోగపడే అద్భుతాలను సృష్టించాలని సూచించారు. జనరేటివ్ ఏఐ కొత్త యుగానికి నాంది పలుకుతూ విద్య, పరిశ్రమలు, ఆరోగ్యం, వ్యవసాయం వంటి అన్ని రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తోందని తెలిపారు. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ రవి శంకర్ మాట్లాడుతూ సమస్యలకు పరిష్కార మార్గాలు చూపే శక్తి ఇంజనీరింగ్ విద్యార్థులకే ఉందని అన్నారు. డిజిటల్ ప్రపంచంలో నిరంతరం అభివృద్ధి చెందుతూ జెనరేటివ్ రూపంలో మానవ మేధస్సుతో పోటీ పడే స్థాయికి చేరిందని తెలిపారు. ప్రస్తుత ప్రపంచంలో జెనరేషన్ ఆల్ఫా (జెన్ ఆల్ఫా) సరికొత్త తరమని, స్టార్టప్ సంస్కృతి, ఇన్నోవేషన్, సోషల్ మీడియా ప్రభావం, ఏఐ ఆధారిత పరిష్కారాల్లో జెన్‌కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా భవిష్యత్ దృష్టితో ఆలోచనలు చేయాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో విశిష్ట అతిథులుగా పాల్గొన్న యువ నటీనటులు నందు, యామిని భాస్కర్ మాట్లాడుతూ, విద్యార్థి భవిష్యత్తును తీర్చిదిద్దే ప్రధాన వేదిక కళాశాలేనని, విద్యతో పాటు కళలు, సృజనాత్మక అభిరుచులపై కూడా ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. విద్యార్థులు సమాజ ప్రగతికి ఉపయోగపడే సాంకేతికత అభివృద్ధిపై దృష్టి పెట్టాలని కళాశాల అధ్యక్షులు డా. రాయపాటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు శ్రీ జాగర్లమూడి మురళీమోహన్, డా. జగదీష్ కె. మద్దినేని పేర్కొన్నారు. ఇలాంటి జాతీయ స్థాయి పోటీలు విద్యార్థుల్లో నూతన విజ్ఞానం, ఆత్మవిశ్వాసం, వినోదాన్ని పెంపొందిస్తాయని కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ శ్రీ రాయపాటి గోపాల కృష్ణ, ట్రెజరర్ డా. కొండబోలు కృష్ణ ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అతిథులను కళాశాల యాజమాన్యం ఘనంగా సత్కరించారు. కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వివిధ స్టాల్స్, భారీ సంఖ్యలో వివిధ కళాశాలల విద్యార్థుల సందడితో కళాశాల ప్రాంగణం కోలాహలంగా పండుగ వాతావరణాన్ని తలపించింది. ఈ కార్యక్రమంలో కళాశాల పాలకమండలి సభ్యులు జాగర్లమూడి సురేష్, పి. గోపీచంద్, కళాశాల ప్రిన్సిపాల్ డా.కొల్లా శ్రీనివాస్, కళాశాల అకడమిక్ అండ్ ఆర్ డి డైరెక్టర్ డా: కె.రవీంద్ర, కళాశాల డైరెక్టర్ ఫైనాన్స్ అడ్మినిస్ట్రేషన్ డా.ఎన్.వి. శ్రీనివాస రావు, కల్చరల్ కమిటీ ఇంచార్జి కన్వీనర్ రంగరాయ చౌదరి, మరియు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## పెదవడ్లపూడి జడ్పీ హైస్కూల్‌ను సందర్శించిన జిల్లా విద్యాశాఖ అధికారి

గుంటూరు విద్య డిసెంబర్ 26 ప్రభాతవార్త : గుంటూరు జిల్లా విద్యాశాఖ



అధికారి డాక్టర్ షేక్ సలీం భాష మంగళగిరి మండలంలోని పెదవడ్లపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు జరుగుతున్న 100 రోజుల ప్రణాళిక తీరును పరిశీలించి ప్రశ్నాపత్రాలు తనిఖీ చేశారు. పాఠశాలకు సక్రమంగా రాని పదవ తరగతి విద్యార్థుల ఇంటికి ప్రధానోపాధ్యాయునితో కలిసి వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడి పాఠశాలకు సక్రమంగా పంపించాలని అన్నారు. తప్పక పాఠశాలకు సక్రమంగా పిల్లలను పంపిస్తామని ఎలాంటి గైర్హా హాజరు లేకుండా చూసుకుంటామని తల్లిదండ్రులు జిల్లా విద్యాశాఖ అధికారికి తెలియజేశారు. గ్రామంలోని ప్రాథమిక పాఠశాల ను కూడా తనిఖీ చేసి పాఠశాలలో జరుగుతున్న 75 రోజుల ప్రణాళిక అమలు తీరును పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. పాఠశాలలో జరుగుతున్న ముస్తాబు కార్యక్రమమును పరిశీలించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రంగా వర్ధంతి సందర్భంగా జనసేన నేతల నివాళి

తెనాలి టౌన్ డిసెంబర్26(ప్రభాతవార్త): పేద,బడుగు బలహీన వర్గాల నాయకుడు,పోరాటయోధుడు,మాజీ ఎంఎల్ఏ స్వర్గీయ వంగవీటి మోహనరంగా 37 వర్ధంతిని శుక్రవారం స్థానిక రామలింగేశ్వరపేటలోని ఆయన విగ్రహానికి జనసేన నాయకులు,రంగా అభిమానులు కులాల మతాలకు అతీతంగా ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఆయన



చేసినటువంటి త్యాగాన్ని సేవా మార్గాన్ని విడువకుండా ప్రతి ఒక్క రంగా అభిమాని ఆయనను ఆయన నడిపిన ఆయన చూపిన బాటను కొనసాగించాలని అటువంటి నాయకుడు చనిపోయి 37 సంవత్సరాలు అయినా కూడా ఈరోజు వారికి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా ఉన్నాడని అటువంటి నాయకుని స్మరించుకోవటం చాలా సంతోషంగా ఉందని పిలుపునిచ్చారు. జనసేన పార్టీ సీనియర్ నాయకులు,మాజీ కౌన్సిలర్ హరిదాసు గౌరీశంకర్ ఆధ్వర్యంలో నిర్వహించినఈ కార్యక్రమంలో రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ పసుపులేటి మురళీకృష్ణ, రాష్ట్ర మైనారిటీ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ జాకిర్ హుస్సేన్, రాష్ట్ర వోక్స్ బోర్డుడైరెక్టర్ షేక్ ఇస్మాయిల్ బేగ్,రాష్ట్ర చిన్న తరహా పరిశ్రమల శాఖ డైరెక్టర్ బండారు రవికాంత్, సుబ్రహ్మణ్యం,గురుశెట్టి శ్రీనివాస్,తెనాలి అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ బొచ్చు శ్రీనివాస్,మట్టుపల్లి గోపాలకృష్ణ,బండారురమాకాంత్,పోలిశెట్టి సాయి, పసుపులేటి లీలా శంకర్, వెంకన్న,గోవాడ వీరయ్య ,ఎలిశెట్టి శరత్ కుమార్,యార్లగడ్డ రవికుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## రోటరీక్లబ్ ఆధ్వర్యంలో బాలికలకు ఉచితంగా సర్వేకల్ క్యాన్సర్ వ్యాక్సిన్

తెనాలి టౌన్ డిసెంబర్26(ప్రభాతవార్త): రోటరీక్లబ్ అఫ్ తెనాలి వైకుంఠపురం ఆధ్వర్యంలో,బాలికలకు ఉచితంగా,సర్వేకల్ క్యాన్సర్ వ్యాక్సిన్ వేయటానికి సన్నాహాలు చేస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా క్యాన్సర్ వ్యాధితో అనేక మరణాలు జరుగుతున్నాయి. కావున మన చుట్టుపక్కల ఉన్న మున్సిపల్ హై స్కూల్స్ మరియు జిల్లా పరిషత్ హై స్కూల్ లో ఉన్న9 సంవత్సరముల నుండి15 సంవత్సరాలలోపు ఉన్న ఆడపిల్లలకు ఉచితముగా వ్యాక్సిన్ వేయబడుతుంది. కావున వారి తల్లిదండ్రులకు రోటరీ తరుపున మీ పిల్లలకు ఈ వ్యాక్సిన్ వేయించమని దానిమీద సైడ్ ఎఫెక్ట్స్ ఉంటాయి అని అపోహలని వీడమని, వ్యాక్సిన్ వల్ల ఎటువంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవని తెలియజేయడమైనది. కావున తల్లిదండ్రులు తమ స్కూలు హెచ్ఎం లను పిలిచి అక్కడ ఉన్న అప్లికేషన్లు పూర్తి చేసి మీ పిల్లల పేరు నమోదు చేయవలసిందిగా కోరడమైనది. వ్యాక్సిన్ జనవరిలో ఒక డోసు



తదుపరి ఆరు నెలలకు రెండవ డోసు వేయించుకోవలసి ఉంటది. ఈ వ్యాక్సిన్ సుమారుగా 5000/రూపాయలు ఖరీదు చేస్తుంది. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు నల్లూరి వెంకటేశ్వరరావు, కార్యదర్శి జివి.నారాయణ రీజనల్ క్యాన్సర్ ఎవర్నెస్ చైర్మన్ కన్నెగంటి మురళీకృష్ణ, అసిస్టెంట్ గవర్నర్ ప్రాజెక్ట్ చైర్మన్ ఈదర వెంకట పూర్ణ చంద్, ప్రాజెక్ట్ సెక్రటరీ గుత్తా వెంకటరత్నం, ట్రెజరర్ వేంపటి హరిప్రసాద్, గుమ్మడి ప్రసాద్, పావులూరి రాంబాబు, ఆలపాటి వెంకట్రామయ్య, ఆలపాటి కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

## ముక్కోటి పర్వదినాన భక్తులకు సేవా కార్యక్రమాలు కొనసాగింపు

### సంఘం అధ్యక్షులు, చైర్మన్ పందేటి సాంబశివరావు

మంగళగిరి డిసెంబర్ 26, ప్రభాతవార్త: మంగళగిరి శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో ఈ నెల 30వ తేదీన జరగనున్న ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని, ఉత్తర ద్వారా దర్శనం చేసుకోనున్న భక్తులకు గంగా భగీరథ సగర సంక్షేమ సంఘం, భగీరథ



సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో భక్తులకు విస్తృతంగా ప్రసాదాల పంపిణీ నిర్వహించనున్నట్లు పందేటి సాంబశివరావు తెలిపారు. శుక్రవారం మంగళగిరి పట్టణంలోని గౌతమ్ బుద్ధ రోడ్డు వెంబడి గల సగర సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత 35 సంవత్సరాలుగా భక్తులకు ప్రసాదాల పంపిణీ కార్యక్రమం నిర్విరామంగా కొనసాగుతుంది. ఈ సేవా కార్యక్రమం మరోసారి భక్తుల మనసులు గెలుచుకోనుంది.. ముక్కోటి సందర్భంగా శంకుతీర్థానికి వచ్చే భక్తులకు చక్కర పొంగలి, పులిహార, దద్దోజనం, రవ్వకేసరి తో పాటు వాటర్ ప్యాకెట్లను ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు సగర సంఘం అధ్యక్షులు, చైర్మన్ పందేటి సాంబశివరావు తెలిపారు. ముక్కోటి ఏకాదశి వంటి పవిత్ర దినాల్లో శంకుతీర్థానికి వచ్చే భక్తులకు సేవ చేయడం తమకు లభించిన అదృష్టంగా భావిస్తున్నామన్నారు. గత 35 సంవత్సరాలుగా గంగ భగీరథ సగర సంక్షేమ సంఘం, భగీరథ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో నిరంతరంగా ఈ సేవా కార్యక్రమాలు కొనసాగుతున్నాయన్నారు. ముక్కోటి సందర్భంగా మాత్రమే కాకుండా మహాశివరాత్రి, మంగళగిరి శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి తిరునాళ్ల సమయంలోనూ భక్తులకు ప్రసాదాల పంపిణీ తో పాటు తాగునీరు అందజేస్తూ, ప్రతి నెల అమావాస్యనాడు శివాలయం మెట్ల మార్గం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో కర్నాటి శివ సత్యనారాయణ, కగ్గా శ్రీనివాసరావు, పందేటి శ్రీనివాసరావు, పెరుమాళ్ళ సుబ్రహ్మణ్యం, రెడ్డి వీర రాఘవులు, కటారి విష్ణుమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

## పేదలు వృద్ధులు వితంతువులకు దుప్పట్లు పంపిణీ

గుంటూరు విద్య డిసెంబర్ 26 ప్రభాతవార్త : గుంటూరు ఎల్ఐసి బ్రాంచ్ ఏజెంట్ల సంఘం అధ్యక్షులు పులివర్తి సుబ్బారావు వారి సతీమణి పులివర్తి సునీత ల ఆధ్వర్యంలో క్రీస్తు జన్మదిన కార్యక్రమాన్ని పురస్కరించుకొని కిష్కింద పాలెం తెలుగు బాప్టిస్ట్ చర్చిలో పేదలు, వృద్ధులు, వితంతువులకు దుప్పట్లు పంపిణీ కార్యక్రమం జరిపారు. కార్యక్రమంలో చర్చి పాస్టర్ మద్దాలి నిరీక్ష రాజు మాట్లాడుతూ ప్రేమ, శాంతి ,సహనం విలువలను అనుసరించి సమాజ హితానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని సూచించారు. కరుణామయుడైన ఏసుక్రీస్తు చూపిన మార్గమును అనుసరించాలని కోరారు. ఏసుక్రీస్తు జీవితం మానవాళికి ఆదర్శనీయమని ఉద్బోధించారు. క్రిస్మస్ వేడుకలలో క్రైస్తవ విశ్వాసులు పెద్ద ఎత్తున పాల్గొని దైవజనుల దీవెనలు ఆశీర్వాదాలు అందుకున్నారు. కార్యక్రమంలో భాగంగా పేదలకు వృద్ధులకు వితంతువులకు




చీరల పంపిణీ కార్యక్రమం జరిపారు. కార్యక్రమంలో పులివర్తి రజాకరరావు, కె. రవి, రావుల దేవ సహాయం, మునిపల్లి మార్క్స్, పులివర్తి చిన్న ఆనందం, పులివర్తి చిట్టయ్య, జి రాజు సంధ్యారాణి దంపతులు, రావుల రమేష్ మాజీ సర్పంచ్ కిస్కింద పాలెం, సంఘస్తులు, సంఘ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## తెదేపా లీగల్ సెల్ ఆధ్వర్యంలో క్యాలెండర్ ఆవిష్కరించిన ఎంఎల్సి ఆలపాటి

తెనాలి మున్సిపాలిటీ డిసెంబర్26(ప్రభాతవార్త): పట్టణంలోని రామలింగేశ్వరపేటలో గల తెనాలి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో,తెలుగుదేశం పార్టీ లీగల్ సెల్ ఆధ్వర్యంలో 2026 నూతన సంవత్సర క్యాలెండర్.ని శాసనమండలి సభ్యులు,తెనాలి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి ఆలపాటి రాజేంద్రప్రసాద్ చేతుల మీదగా ఆవిష్కరింపజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఆలపాటి న్యాయవాదులకు ముందస్తు,నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. రాబోయే నూతన సంవత్సరంలో ప్రతి ఒక్కరు ఆనందోత్సాహాలతో,సంతోషంగా జరుపుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో లీగల్ సెల్ అధ్యక్షులు ఇందుపల్లి రాజారాం,జనరల్ సెక్రటరీ తాడిశెట్టి వెంకట్రావు, సీనియర్ న్యాయవాదులు తాడిబోయిన శ్రీనివాసరావు, మద్ది మల్లికార్జునరావు,ఎం.ఎల్. జగదీశ్వరాంబ,షేక్ రెహమాన్, వి. లలిత కుమారి,ఎన్. మహేష్,గడ్డిపాటి రాంబాబు, శ్రీరామ్ సుభాష్ బాబు, పలువురు జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

## చెరగని ముద్ర వేసిన ప్రజా నాయకుడు, వంగవీటి మోహన రంగా

గుంటూరు వెస్ట్, డిసెంబర్ 26,ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్ రాజకీయ చరిత్రలో ఒక చెరగని ముద్ర వేసిన ప్రజా నాయకుడు, వంగవీటి మోహన రంగా అని ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దేగల ప్రభాకర్ అన్నారు.వంగవీటి మోహన రంగా వర్ధంతిని పురస్కరించుకొని నగరంలో నగరంపాలెం,గోరంట్ల,నెహ్రూనగర్,కొత్తపేట శనక్కాయల ఫ్యాక్టరీ,కొత్తపేట శివాలయం, వెంగళాయపాలెం తదితర ప్రాంతాలలో నిర్వహించిన వర్ధంతి వేడుకల్లో చైర్మన్ దేగల ప్రభాకర్ పాల్గొని వంగవీటి మోహన రంగా విగ్రహానికి పూలమాలలు వేసి ఘనమైన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా చైర్మన్ దేగల ప్రభాకర్ మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాలకు రంగా అండగా నిలిచారన్నారు.వంగవీటి రంగా మరణించి ఏళ్ళు గడిచిన ఆయనపై ప్రజలకు అభిమానం ఏ మాత్రం చెక్కుచెదరలేదని అన్నారు. పేదల కోసం జీవించి వారితో మమేకమై



బతికిన రంగా ప్రజల గుండెల్లో నిలిచిపోయారున్నారు. ఎమ్మెల్యేగా కొన్నాళ్లే పని చేసినా పేద ప్రజల సమస్యలపై ఆయన చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమన్నారు.బడుగు బలహీన వర్గాల అభివృద్ధి సంక్షేమం కోసం, అంశంపై బలంగా పోరాటం చేసి,ఇచ్చిన మాట కోసం ఎన్ని ఇబ్బందులు ఎదురైనా తుది వరకూ ఫలితం కోసం పోరాటం చేసిన వ్యక్తి వంగవీటి మోహన రంగా అని అన్నారు.వంగవీటి.మోహన్రంగా ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

## ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి పథకాలు ప్రజలకు తెలుపుతాం : ఎమ్మెల్యే వేగేశన

**పిట్టలవానిపాలెం,డిసెంబర్26,ప్రభాతవార్త:** బాపట్ల జిల్లా తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి డాక్టర్ గ్లోరి యానెట్ సోపాటి బాపట్ల జిల్లా కమిటీలో స్థానము కల్పించినందుకు శుక్రవారం గౌరవ శాసనసభ్యులు వేగేశన నరేంద్ర



వర్మ ను కలసి కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా శాసనసభ్యులు మాట్లాడుతూ పార్టీలో కష్టపడిన ప్రతి ఒక్కరికి గుర్తింపు ఉంటుందని తెలిపారు.సరైన సమయంలో సముచిత స్థానం కల్పించటం జరుగుతుందన్నారు. ఈ పదవితో సోపాటి యానెట్ బాధ్యత మరింత పెరిగిందన్నారు. మండల స్థాయి నుంచి జిల్లా స్థాయికి రావటం పార్టీ కోసం చేసిన కృషి కష్టంకి ఫలితమని భవిష్యత్తులో పార్టీ కోసం పని చేస్తూ మరెన్నో మంచి పదవులు అలంకరించాలన్నారు.ఈ సందర్భంగా డాక్టర్ గ్లోరీ మాట్లాడుతూ సామాన్య మహిళనైన నన్ను ఆదరించి అభిమానించి జిల్లా స్థాయి పదవి కి ఎంపిక చేసిన ఎమ్మెల్యే నరేంద్ర వర్మ కు ప్రత్యేక కృతజ్ఞతలు ఆదేవిధంగా జిల్లా తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధిగా నియమించిన జాతీయ అధ్యక్షులు,ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, శాసనసభ్యులు నరేంద్ర వర్మ, బాపట్ల మార్కెట్ యార్డ్ చైర్మన్ కావూరి శ్రీనివాస రెడ్డి,గురువర్యులు లక్ష్మం రాజు వెంకటపతి రాజు , సీనియర్ నాయకులు కనుమూరి సాంబమూర్తి రాజు సహకరించిన కూటమి నాయకులకు తెలుగుదేశం పార్టీ పెద్దలకు నాయకులకు కార్యకర్తలకు అభిమానులు అందరికీ మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ పదవితో బాధ్యత పెరిగిందని తెలుగుదేశం పార్టీ కోసం కష్టపడతానని బాపట్ల జిల్లాలో పార్టీ ప్రతిష్టతకు అహర్నిశలు శ్రమిస్తానని పార్టీలోని అన్ని క్యాడర్ నాయకులతో కలసి పనిచేస్తానని కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను జిల్లాలోని శాసనసభ్యులు వారితో మాట్లాడి సమస్యలు త్వరితగతిన పరిష్కరించుటకు కృషి చేస్తానని ప్రభుత్వ అభివృద్ధి మరియు సంక్షేమ పథకాలను జిల్లా ప్రజలలోనికి తీసుకొని పోతూ ప్రతిపక్షాల విమర్శలకు తీటైన సమాధానం ఇస్తానని ఈ సందర్భంగా తెలుపుతూ ఇప్పటివరకు నన్ను ఆదరించిన విధంగా ఇకనుంచి కూడా జిల్లా స్థాయి నాయకులు పెద్దలు కార్యకర్తలు అభిమానులు అందరూ నన్ను ఆదరించాలని అభిమానించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని ఆమె తెలిపారు.

## పోలీస్ సిబ్బందికి గ్రీవెన్స్

**గుంటూరు క్రైమ్,డిసెంబర్ 26,ప్రభాతవార్త :** ప్రతి శుక్రవారం గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించే "పోలీస్ స్టాఫ్ గ్రీవెన్స్" కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ పాల్గొని, జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లలో పని చేస్తున్న పోలీస్ సిబ్బందినుండి



వినతులు సమస్యలను నేరుగా స్వీకరించారు. ఎస్పీ సిబ్బంది సమస్యలను ఒక్కొక్కటి ఆలకించి, వాటి పరిష్కారానికి ప్రాధాన్యతా క్రమంలో చర్యలు తీసుకుంటానని తెలిపారు.అలాగే, శాఖాపరమైన చర్యల కారణంగా విధుల నుండి తాత్కాలికంగా దూరమైన సిబ్బందిని తగిన విచారణ అనంతరం తిరిగి విధుల్లోకి తీసుకుంటామని అన్నారు.పోలీస్ సిబ్బంది తమ వృత్తి పట్ల నిబద్ధత, నిజాయితీ, బాధ్యతతో పనిచేయాలి, ప్రజలకు ఉత్తమమైన సేవలు అందిస్తూ, పోలీస్ శాఖ పట్ల ప్రజల నమ్మకాన్ని పెంపొందించాలని సూచించారు. సిబ్బందికి అనుకూల వాతావరణం కల్పించేందుకు, వారు స్వేచ్ఛగా మరియు మనస్ఫూర్తిగా విధులు నిర్వర్తించేలా చర్యలు తీసుకుంటామని ఎస్పీ వెల్లడించారు.

## మహోన్నత వ్యక్తిత్వం మూర్తిభవించిన సిహెచ్ లక్ష్మీనారాయణ

### మాజీ రాష్ట్ర డిజిపి, ఆర్టీసీ ఎండి సిహెచ్ ద్వారకాతిరుమలరావు

**గుంటూరు విద్య డిసెంబరు 26 ప్రభాతవార్త:** ఉన్నత ఉద్యోగ విధి నిర్వహణలోను, కుటుంబాన్ని క్రమశిక్షణతో విలువలతో తీర్చిదిద్దిన మహోన్నత వ్యక్తిత్వం విశ్రాంత జిల్లా ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ అధికారి కీర్తిశేషులు చెంచు లక్ష్మీనారాయణ అని విశ్రాంత రాష్ట్ర డిజిపి, రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మేనేజింగ్ డైరెక్టర్ సిహెచ్ ద్వారకా తిరుమలరావు పేర్కొన్నారు.ప్రముఖ విద్యావేత్త, రచయిత్రి, విమర్శకురాలు ప్రొఫెసర్ సిహెచ్ సుశీలమ్మ తమ తండ్రి పేరును ఇస్తున్న "శ్రీ సిహెచ్ లక్ష్మీనారాయణ స్మారక సాహితీ పురస్కారం 2025" కు తెలంగాణ విశ్వవిద్యాలయం తెలుగు అధ్యయన శాఖ అధ్యక్షులు డాక్టర్ సిహెచ్ లక్ష్మణ చక్రవర్తికి అందించే కార్యక్రమం స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం పద్మావతి కళ్యాణ వేదికపై ఘనంగా నిర్వహించారు.




తొలుత జ్యోతి వెలిగించి కీర్తిశేషులు లక్ష్మీనారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించిన అనంతరం జరిగిన సభకు ప్రొఫెసర్ అండ్ మేనేజ్మెంట్ కన్సల్టెంట్ డాక్టర్ ఎంసీదాస్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మద్రాస్ విశ్వవిద్యాలయం తెలుగు శాఖ అధ్యక్షులు ఆచార్య విస్తాలి శంకరరావు మాట్లాడుతూ సాహిత్యం విలువలతో కూడిన సమాజ అభివృద్ధికి దోహదం చేసేలా ఉండాలన్నారు. సాహిత్యాన్ని సరైన మార్గంలో నడిపించేందుకు విమర్శ చికిత్స చేసే వైద్యునిగా ఉండాలన్నారు. గత ఆరు సంవత్సరాలుగా డాక్టర్ సుశీలమ్మ సాహిత్యంలో విమర్శనారంగాన్ని ఎంచుకొని తమ తండ్రి పేరు మీద ప్రముఖులను సత్కరించటం అభినందనీయమని చెప్పారు. పురస్కార గ్రహీత డాక్టర్ లక్ష్మణ చక్రవర్తి మాట్లాడుతూ సాహిత్య స్వర్ణోత్సవంలోకి అడిగిన డాక్టర్ సుశీలమ్మ గారి తండ్రి స్మారక పురస్కారం అందుకోవటం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నట్లు తెలియజేశారు.కార్యక్రమంలో విశ్రాంత అసిస్టెంట్ ఎక్సైజ్ కమిషనర్ షేక్ అహ్మద్ షరీఫ్, ప్రముఖ సాహితి వేత్తలు డాక్టర్ పాపినేని శివ శంకర్, పెనుగొండ లక్ష్మీనారాయణ, డాక్టర్ భూసురుపల్లి వెంకటేశ్వర్లు, బండ్ల మాధవరావు, డాక్టర్ ఓరుగంటి వెంకటరమణ, మోదుగుల రవికృష్ణ, డాక్టర్ వి.వి రామ్ కుమార్, పంచమర్తి సుశీల, డాక్టర్ వి నాగరాజ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.


## విజయవాడలో కేటీఎం 160 డ్యూక్ టెస్ట్ రైడ్

**విజయవాడ, డిశంబర్ 26, ప్రభాతవార్త :** కేటీఎం నిపుణుల పర్యవేక్షణలో కేటీఎం 160 డ్యూక్ డ్రైవింగ్ ప్రపంచంలోనే నంబర్ వన్ ప్రీమియం మోటార్‌సైకిల్‌గా పేరుగాంచిన రేసింగ్ బైక్ బ్రాండ్ అయిన కేటీఎం 160 డ్యూక్ బైక్ టెస్ట్ రైడ్ చేసే అవకాశాన్ని విజయవాడ నగర వాసులకు కల్పిస్తున్నట్లు బజాజ్ ఆటో లిమిటెడ్ ప్రొ బైకింగ్ హెడ్ మానిక్ నాంగియా తెలిపారు. ఈ మేరకు కెటిఎమ్ ఆరెంజ్ ఎక్స్‌పీ 160ను తమ రైడింగ్ నిపుణుల పర్యవేక్షణలో నడిపి చూడవచ్చని చెప్పారు. ఇందులో ఇప్పుడు 160సిసి నుండి 400సిసి వరకు నాలుగు మోటార్‌సైకిళ్లు ఉన్నాయని తెలిపారు.

## ఉండవల్లి సెంటర్ కూడలిలో రంగా విగ్రహం ఏర్పాటు చేస్తాం

### ననఏపిఎంఎస్ఐడిసి చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు

**తాడేపల్లి,డిసెంబరు 26,ప్రభాతవార్త :** పేద,బడుగు,బలహీర వర్గాల ఆశాజ్యోతి వంగవీటి మోహనరంగా 37వ వర్ధంతి సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా వాడవాడలా నివాళి కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా రాధా-రంగా మిత్రమండలి సభ్యులు,ఎన్డీఏ కూటమి నాయకలు ఆధ్వర్యంలో ఉండవల్లి సెంటర్‌లో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో ఏపిఎంఎస



ఐడిసి చైర్మన్,జనసేన పార్టీ మంగళగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి చిల్లపల్లి శ్రీనివాసరావు ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు.తొలుత రంగా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించిన అనంతరం సభనుద్దేశించి ఆయన మాట్లాడారు.రంగా మన మధ్య లేకపోయినా,ఆయన ఆశయాలు ఇప్పటికీ మనతోనే ఉన్నాయని,ఆయన స్ఫూర్తితో ఉప ముఖ్యమంత్రి ,జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ రంగా ఆశయ సాధన దిశగా ముందుకు సాగుతున్నారని పేర్కొన్నారు,కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నాయకులు,జనసేన పార్టీ కార్యకర్తలు,అభిమానులు పెద్దసంఖ్యలో పాల్గొని వంగవీటి మోహనరంగా సేవలను స్మరించుకున్నారు.

## పేద వర్గాల అభివృద్ధి కోసం పోరాడిన ఆదర్శ నాయకుడు వంగవీటి

**వట్టిచెరుకూరు రూరల్, డిసెంబర్ 26, ప్రభాతవార్త :** బడుగు, బలహీన వర్గాలకు అండగా నిలబడి వారి హక్కులకోసం నిరంతరం పోరాడిన పేదవర్గాల ఆదర్శ నాయకుడు దివంగతవంగవీటి మోహనరంగాను అని జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి వడ్రాణం మార్కండేయ బాబు, ప్రతిపాడు ఇన్చార్జి కొర్రపాటి నాగేశ్వరరావు, గుంటూరు నగర ఉపాధ్యక్షులు చింత రేణుక రాజు కొనియాడారు. వట్టిచెరుకూరు మండలంలోని మేజర్ పంచాయతీ గ్రామం ముట్లూరులో ఆ పార్టీ నేతలు వంగవీటి మోహనరంగా 37వ వర్ధంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జనసేన పార్టీ నేతలు వడ్రాణం మార్కండేయ బాబు, కొర్రపాటి నాగేశ్వరరావు, చింత రేణుక రాజు ముఖ్య అతిథులుగా హాజరై వంగవీటి మోహనరంగా విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వంగవీటి మోహన రంగా ఆశయ సాధనకు కృషి చేస్తామన్నారు. రంగా మరణించి 37సంవత్సరాలు గడిచిన ఇప్పటికి ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం ఏర్పాటు చేసుకున్నారని వివరించారు.ఆయన మంచి వ్యక్తిత్వం కలవారనే అభిమానులు ఊరూరా రంగా విగ్రహాలు ఏర్పాటు చేస్తున్నారని తెలియజేశారు. బడుగు,బలహీన వర్గాల ఆశాజ్యోతిగా,విజయవాడ తూర్పు శాసనసభ్యులుగా పేద ప్రజలకు విశేష సేవలు అందించిన ఘనత రంగాకే దక్కుతుందన్నారు.ఆయన ఆశయ సాధనకు రంగా అభిమానులు అందరూ కృషి చేయాలని కోరారు. పేద వర్గాల అభ్యున్నతికి ఎనలేని కృషి చేసిన రంగా కుల, మత, రాజకీయాలకు అతీతమైన గొప్ప నాయకుడని కొనియాడారు. కార్యక్రమంలో జనసేన పార్టీ మండల సీనియర్ నాయకులు ప్రత్తి పాపారావు, జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి వీరిశెట్టి జగన్మోహన్ రావు, బీరాల శ్రీనివాసరావు, మాజీ సొసైటీ అధ్యక్షులు అల్లం చిన్న, వట్టిచెరుకూరు



సుబ్బారావు, మాజీ ఎంపీటీసీ ఏనుముల రాంబాబు, నిమ్మగడ్డ శేషగిరిరావు,గోగినేని కళ్యాణ్, తుమ్మల రత్తయ్య,తుమ్మల. రాంబాబు, జాగర్లమూడి ప్రవీణ్, ఆకరంశెట్టి పిచ్చియ్య, అల్లం రంగా, తోటకూర పాపయ్య,ప్రత్తితంబీ, గంగిశెట్టి వెంకట్, అల్లం దశరథ రామయ్య, గుత్తికొండ నాగయ్య, పఠాన్ బాజి, సిహెచ్.ప్రవీణ్, పశ్యావుల సాయి, అల్లం సాంబయ్య, వేలాంగిణి, కిషోర్, గోపి,శంకర్,రాజేష్,చెంచు మరియు కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

### మంగళగిరి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో

## బాలికలకు ఉచిత హెచ్‌పీవీ టీకా


**మంగళగిరి డిసెంబర్ 26, ప్రభాతవార్త:** గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నుంచి బాలికలను రక్షించే ఉద్దేశంతో మంగళగిరి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత హెచ్‌పీవీ టీకా కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి అధ్యక్షులు ప్రెగడ రాజశేఖర్ తెలిపారు. శుక్రవారం వి.జె. జూనియర్ కాలేజి ఆవరణలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన ఈ వివరాలు వెల్లడించారు.ప్రభుత్వ, మున్సిపల్, ఐడెడ్, జిల్లా పరిషత్ పాఠశాలల్లో చదువుతున్న 9 నుంచి 14 సంవత్సరాల లోపు బాలికలకు మోతాదులుగా హెచ్‌పీవీ టీకా తీసుకోవడం అత్యంత అవసరమని వివరించారు.ఈ కార్యక్రమాన్ని సుమారు రూ.50 లక్షల వ్యయంతో, తల్లిదండ్రుల అనుమతితో పూర్తిగా ఉచితంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు .ప్రముఖ క్యాన్సర్ నిపుణులు, అనుభవజ్ఞులైన వైద్యులు, నర్సుల పర్యవేక్షణలో టీకా కార్యక్రమం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. భవిష్యత్తులో ఈ కార్యక్రమాన్ని మరింత విస్తరించి మంగళగిరి నియోజకవర్గంలోని అర్హత కలిగిన ప్రతి బాలికకు హెచ్‌పీవీ టీకా అందించడమే లక్ష్యంగా రోటరీక్లబ్



గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నుంచి రక్షణ కల్పించే క్వాడ్రివాలెంట్ హెచ్‌పీవీ టీకాను 2026 జనవరి 7న ఉచితంగా అందజేయనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సుమారు వెయ్యి మందికి పైగా బాలికలకు టీకా వేయనున్నట్లు పేర్కొన్నారు.ప్రపంచ ఆరోగ్య సంస్థ సర్వేల ప్రకారం ప్రపంచవ్యాప్తంగా ప్రతి రెండు నిమిషాలకు ఒక మహిళ గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ కారణంగా ప్రాణాలు కోల్పోతున్నారని ఆయన తెలిపారు. ఈ ప్రమాదకర వ్యాధి నివారణకు రెండు ఆఫ్ మంగళగిరి పనిచేస్తుందని ఆయన స్పష్టం చేశారు. తల్లి దండ్రులు ఈ అంశంపై అవగాహన పెంచుకొని తమ పిల్లలను ప్రాణాంతక వ్యాధి నుంచి కాపాడుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశంలో రోటరీ క్లబ్ కార్యదర్శి పారేపల్లి నిరంజన్ గుప్తా, ప్రాజెక్ట్ శక్తి చైర్మన్ ఇసునూరు అనిల్ చక్రవర్తి, ప్రాజెక్ట్ కార్యదర్శి గాజుల శ్రీనివాస్, సర్వీస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ చనుమోలు గోపాల్, రోటరీ సభ్యులు వడ్లమూడి శ్రీనివాస్, జొన్నాదుల బిక్షారావు తదితరులు పాల్గొన్నారు.

## పివిఎన్ మాధవ్‌ను కలసిన ఏపి పద్మశాలి సంఘ నాయకులు

**తాడేపల్లి,డిసెంబరు26,ప్రభాతవార్త :** భారతీయ జనతా పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు పి వి ఎన్ మాధవ్‌ని ఆంధ్రప్రదేశ్ పద్మశాలి సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా బిజేపి రాష్ట్ర కార్యాలయంలో కలసి వారికి ఏప్రిల్ నెలలో జరగబోయే ఆంధ్రప్రదేశ్ పద్మశాలి మహాసభ గురించి తెలియజేయడం జరిగింది.కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షులు జగ్గారపు శ్రీనివాస




రావు,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలుకోటి అంజిబాబు,రాష్ట్ర ఉపాధ్యక్షులు బండారు బెనర్జీబాబు,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింగరి లక్ష్మీనారాయణ, నెల్లూరు జిల్లా అధ్యక్షులు బాలాజీ,సోమ గోపాల్,రాష్ట్రకార్యదర్శి మునగాల గిరిధర్,పెండెం శ్రీనివాస్,చింతకింది సుబ్రహ్మణ్యం తదితర ఆంధ్రప్రదేశ్ పద్మశాలి సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## ప్రజా నాయకుడు వంగవీటి మోహనరంగా

### ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్

**పొన్నూరు, డిసెంబర్ 26,ప్రభాతవార్త:** ప్రజా నాయకుడిగా స్వర్గీయ వంగవీటి మోహనరంగా కీర్తి గడించారని ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్



అన్నారు. స్థానిక తెలగాపాలెం రామమందిరం వద్ద ఉన్న వంగవీటి మోహనరంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వంగవీటి మోహనరంగా వర్ధంతి సందర్భంగా జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే నరేంద్రకుమార్ మాట్లాడుతూ పేద ప్రజలకు వంగవీటి చేసిన సేవలను ఈ సందర్భంగా గుర్తు చేశారు. వంగవీటి మోహనరంగా లేని లోటు తీర్చలేనిదన్నారు. వంగవీటి మరణం పేదలకు తీరని లోటన్నారు. తొలుత రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అర్బన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ వడ్లాణం మార్కండేయబాబు, రాధా రంగ మిత్రమండలి అధ్యక్షుడు యస్వం నాయుడు, నాయకులు కత్తుల రవికిరణ్, మువ్వా వెంకటకృష్ణ, గోవాడ వెంకటకృష్ణారావు, బండ్లమూడి బాబూరావు, కలపాల విజయలక్ష్మి, శెట్టి లింగేశ్వరరావు, పఠాన్ ఫిరోజ్‌ఖాన్, తోట ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ

**పొన్నూరు, డిసెంబర్ 26,ప్రభాతవార్త:** స్థానిక టిడిపి కార్యాలయంలో శుక్రవారం ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పలువురు లబ్ధిదారులకు ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స చేయించుకోవడానికి ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. మండల పరిధిలోని జడవల్లి గ్రామానికి చెందిన చలమశెట్టి సీతారామయ్యకు రూ.20వేలు, కట్టెంపూడి గ్రామానికి చెందిన ఏపూరి వీర్రాజుకు రూ.21,986, కొండముది ఆదిశేషుకు రూ.42,450, చిన జబికలపాడుకు చెందిన కోట వెంకటనరేష్‌కు రూ.30,787, వడ్డిముక్కల గ్రామానికి చెందిన షేక్ హసీనా రూ.58,796, పతేళ్ల వెంకటేశ్వర్లుకు రూ.81వేలు, మామిళ్ళపల్లి గ్రామానికి చెందిన మేడికొండ చిన్న నాగరాజుకు రూ.32,527, షేక్ కరిమాకు రూ.30వేలు, ములుకుదురు గ్రామానికి చెందిన కందుల శివరామకృష్ణకు రూ.42,114, వెల్లలూరు గ్రామానికి చెందిన దైవుల జస్వంత్‌సాయికి రూ.25,688, పట్టణంలోని 21వ వార్డుకు చెందిన షేక్ గౌహర్‌జాన్‌కు రూ.63,933, 19వ వార్డుకు చెందిన ఏనుగు సత్యవతికి రూ.25,166, 14వ వార్డుకు చెందిన కోట వెంకటసాయిలక్ష్మికి



రూ.1,08,916, 2వ వార్డుకు చెందిన కర్నాటి పాపారావుకు రూ.42,450, 5వ వార్డుకు చెందినో ఓలేటి లక్ష్మికి రూ.58,796 చెక్కులను పంపిణీ చేశారు. మండలంలో పది మందికి రూ.3,85,348, పట్టణంలో ఐదుగురికి రూ.3,04,21 పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాదల వెంకటేశ్వరరావు, బొర్రు రామారావు, బండ్లమూడి బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

## గోతాలస్వామి ఆశ్రమం సేవలకు అభినందనలు

### అర్బన్ సిఐ లావూరి వీరానాయక్

**పొన్నూరు, డిసెంబర్ 26,ప్రభాతవార్త:** ఆదరణకు నోచుకోని వృద్ధులకు విశేష సేవలందిస్తున్న గోతాలస్వామి ఆశ్రమ సేవలు అభినందనీయమని అర్బన్ సిఐ లావూరి వీరానాయక్ అన్నారు.



నిడుబ్రోలు వడ్డిముక్కల రోడ్డులోని గోతాలస్వామి ఆశ్రమంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గత ఐదు సంవత్సరాల క్రితం ఆశ్రమంలో ఆశ్రయం పొందిన నలుగురు మతి స్థిమితం లేని మహిళలను పోలీసులు చేర్పించారు. ఇక్కడి ప్రభుత్వ వైద్యులతో వైద్య సేవలు పొంది ఆరోగ్యం మెరుగు పడడంతో తిరిగి బంధువులకు అప్పగించారు. ఈ క్రమంలో శుక్రవారం ప్రత్యేక అంబులెన్స్ ద్వారా నలుగురు మహిళలను స్వస్థలమైన ముంబాయికి పోలీసుల సమక్షంలో పంపించారు. ఈ కార్యక్రమంలో శ్రద్ధా ఫౌండేషన్ ప్రతినిధి బాలకృష్ణ, ఆశ్రమం డాక్టర్ శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

## వాసవిక్లబ్ అధ్యక్షుడిగా పోలిశెట్టి విజయ్‌కుమార్

**పొన్నూరు, డిసెంబర్ 26,ప్రభాతవార్త:** వాసవిక్లబ్ నూతన కార్యవర్గ సమావేశం శుక్రవారం స్థానిక కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా 2026సంవత్సరానికి




నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పోలిశెట్టి విజయ్‌కుమార్, కార్యదర్శిగా వెల్లంపల్లి ప్రవీణ్, కోశాధికారిగా భయ్యా సురేంద్ర ఎన్నికయ్యారు. వీరిని పలువురు సభ్యులు అభినందించారు. నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ వాసవిక్లబ్ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. వాసవిక్లబ్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించి సమాజ హితం కోసం పాటుపడతామని చెప్పారు. నూతన కమిటి సభ్యులను జోన్ చైర్మన్ కిషోర్, ప్రసన్న, గోద్రేజ్ శివ, భావనారాయణ, రూపేష్, సృజన్, వంశీకృష్ణ తదితరులున్నారు.

## మాదక ద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉండాలి

### అర్బన్ సిఐ లావూరి వీరానాయక్

**పొన్నూరు, డిసెంబర్ 26,ప్రభాతవార్త:** విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని అర్బన్ సిఐ లావూరి వీరానాయక్ సూచించారు. నిడుబ్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో



శుక్రవారం జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సంకల్పం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ వీరానాయక్ మాట్లాడుతూ విద్యార్థులు గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు అలవాటుపడి జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. విద్యార్థులు చక్కగా, శ్రద్ధగా చదివి తల్లిదండ్రుల ఆశయాలను, ఆకాంక్షలను నెరవేర్చేవిధంగా ఆలోచన చేయాలన్నారు. ప్రతి నిత్యం కొద్ది సేపు యోగా లాంటి కార్యక్రమాలను చేయడం ద్వారా మనస్సు ప్రశాంతంగా ఉండి చదవుపై ధ్యాస పెంచుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. అనంతరం విద్యార్థులచే ప్రతిజ్ఞచేయించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై లక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రామీణులు సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి ఉండాలి : రూరల్ ఎస్సై వాగాల శ్రీహరి

**పొన్నూరు, డిసెంబర్ 26,ప్రభాతవార్త:** గ్రామీణులు సైబర్ నేరాల పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలని రూరల్ ఎస్సై వాగాల శ్రీహరి సూచించారు. మండల పరిధిలోని చింతలపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం సైబర్ నేరాల



పట్ల అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఎస్సై శ్రీహరి మాట్లాడుతూ వివిధ కంపెనీల పేర్లతో సైబర్ నేరగాళ్ళు ఫోన్లు చేసి మీకు లాటరి తగిలిందని....లేక మీరు బహుమతి గెలుచుకున్నారని...ఓటీపి పంపమని ఫోన్ చేసి సైబర్ నేరానికి పాల్పడతారన్నారు.ఇలాంటి వారి పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. విద్యార్థులు గంజాయి, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. మాదక ద్రవ్యాలకు బానిసై మీ జీవితాలను నాశనం చేసుకోవద్దని ఎస్సై సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## విజ్ఞాన్స్‌లో రెండు అత్యాధునిక పరిశోధనా కేంద్రాలు ప్రారంభం

**చేబ్రోలు(పొన్నూరు),డిసెంబర్26,ప్రభాతవార్త:** చేబ్రోలు మండల పరిధిలోని వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో శాస్త్రీయ పరిశోధనలకు మరింత ఊతమిచ్చే విధంగా రెండు అత్యాధునిక పరిశోధనా కేంద్రాలను ప్రారంభించామని వర్సిటీ చాన్స్‌లర్ కల్నల్, ప్రొఫెసర్ పి.నాగభూషణ్ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన



మాట్లాడుతూ నానో సైన్స్, ఎనర్జీ మెటీరియల్స్, సెన్సార్ టెక్నాలజీ రంగాల్లో పరిశోధనలను ప్రోత్సహించే లక్ష్యంతో రామన్ సెన్సార్ సెంటర్, డాక్టర్ లావు రత్తయ్య సెంటర్ ఫర్ ఎనర్జీ మెటీరియల్స్(డాక్టర్ లారా-సీఈఎం) కేంద్రాలను ప్రారంభించామని తెలిపారు. రామన్ సెన్సార్ సెంటర్(స్మార్ట్ ఇంజనీరింగ్ ఇన్ నానో సైన్స్ ఫర్ ఎమర్జింగ్ రీసెర్చ్) ద్వారా నానో సైన్స్‌ను సాంకేతిక అనువర్తనాలుగా మార్చే దిశగా విస్తృత పరిశోధనలు సాగనున్నాయని చెప్పారు. ఈ కేంద్రంలో ఆధునిక సెన్సార్ టెక్నాలజీలు, నానో డివైసెస్, స్మార్ట్ ఇంజనీరింగ్ అంశాలపై పరిశోధనలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఆరోగ్య సంరక్షణ,పర్యావరణ పరిరక్షణ, పరిశ్రమల భద్రత వంటి కీలక రంగాల్లో వినూత్న సాంకేతిక పరిష్కారాల అభివృద్ధికి ఈ కేంద్రం దోహదపడనుందని వెల్లడించారు. డాక్టర్ లావు రత్తయ్య సెంటర్ ఫర్ ఎనర్జీ మెటీరియల్స్(డాక్టర్ లారా-సీఈఎం) ద్వారా ఎనర్జీ సంబంధిత పదార్థాలు, పునరుత్పాదక శక్తి వనరులు, బ్యాటరీ టెక్నాలజీ, ఎనర్జీ స్టోరేజ్ మెటీరియల్స్‌పై లోతైన పరిశోధనలు చేపట్టనున్నట్లు తెలిపారు. సస్టెయినబుల్ ఎనర్జీ పరిష్కారాల అభివృద్ధితోపాటు పరిశ్రమల అవసరాలకు అనుగుణమైన అధునాతన మెటీరియల్స్ తయారీపై ఈ కేంద్రం ప్రత్యేక దృష్టి సారించనుందన్నారు. ఈ రెండు పరిశోధనా కేంద్రాల ప్రారంభంతో విజ్ఞాన్స్ యూనివర్సిటీ పరిశోధన, ఆవిష్కరణల రంగంలో మరో కీలక ముందడుగు వేసిందన్నారు.జాతీయ అంతర్జాతీయ స్థాయిలో పరిశోధనా సహకారాలు, అవకాశాలు మరింత విస్తరించనున్నాయని వైస్ చాన్స్‌లర్ చెప్పారు. ఈ కార్యక్రమంలో విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, వైస్ చైర్మన్, పార్లమెంట్ సభ్యుడు లావు శ్రీకృష్ణదేవరాయలు, చాన్స్‌లర్ డాక్టర్ పావులూరి సుబ్బారావు, సీఈవో డాక్టర్ మేఘన కూరపాటి, రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంవీ రావు, ఆయా విభాగాల డీన్లు, విభాగాధిపతులు, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## డ్వాక్రా గ్రూపు సభ్యులు బ్యాంకు రుణాల ద్వారా ఆర్థిక పరిస్థితిని మెరుగు పర్చుకోవచ్చు : డిఆర్‌డిఏ ఎపిఎం రమాదేవి

**కొల్లిపర, డిసెంబర్ 26 (ప్రభాతవార్త) :** డ్వాక్రా గ్రూపు సభ్యులు బ్యాంకు రుణాల ద్వారా ఆర్థిక పరిస్థితి మెరుగు పర్చుకోవచ్చునని డిఆర్‌డిఏ ఎపిఎం రమాదేవి అన్నారు. శుక్రవారం స్థానిక శ్రీశక్తి భవనంలో డ్వాక్రా మహిళలతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ డ్వాక్రా గ్రూపు సభ్యులు పొదుపును సక్రమంగా చేసుకుంటే అధికంగా రుణాలు పొందవచ్చునన్నారు. బ్యాంకు రుణాలను ఆదాయ అభివృద్ధి కార్యక్రమాలకు మాత్రమే వినియోగించుకోవాలన్నారు. స్వయం సహాయక సంఘాల సభ్యులు ప్రతి నెలా సమావేశాన్ని ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. అలా ఏర్పాటు చేసుకోవడం వల్ల సంఘాలు మరింత బలోపేతం అవుతాయన్నారు. సమావేశంలో సిసిలు టి.మధు, వి.విజయ్‌కుమార్, ఎస్.ప్రమీల, ప్రమీలాదేవి, బుజ్జిబాబు, ఎం.ఎస్.ఏ.సీతామహాలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.



27-12pg10 12 VJA_27-12pg10.qxd 26/Dec/25 10:41 PM Page 1



# విజయ్ హజారే ట్రోఫీలో.. అత్యధిక పరుగుల హీరోలు


అంకిత్ బావ్నే


దినేష్ కార్తిక్


మనీష్ పాండే


మయాంక్ అగర్వాల్


ప్రియాంక్ పంచల్

## అసాధారణ ప్రదర్శనలో బ్యాట్స్‌మన్

**న్యూఢిల్లీ:** ఈ మధ్య విజయ్ హజారే ట్రోఫీ వార్తల్లో నిలుస్తోంది. టీమిండియాకు చెందిన ఇద్దరు స్టార్ ఆటగాళ్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి ఈ టోర్నమెంట్‌లో ఆడుతున్నారు. ఇద్దరూ తమ తొలి మ్యాచ్‌లలో సెంచరీలు సాధించి, టోర్నమెంట్ ఉత్సాహాన్ని పెంచారు. కానీ ఈ టోర్నమెంట్ చరిత్రలో టాప్ ఐదుగురు అత్యధిక పరుగులు చేసిన ఆటగాళ్లు ఉన్నారు. ఈ జాబితాలో మహారాష్ట్ర బ్యాట్స్‌మన్ అంకిత్ బావ్నే అగ్రస్థానంలో ఉన్నాడు. అతను 95 మ్యాచ్‌ల్లో 56 సగటుతో 4,055 పరుగులు చేశాడు. అయితే అంకిత్ భారత సీనియర్ జట్టు తరపున ఏ ఫార్మాట్‌లోనూ ఒక్క మ్యాచ్ కూడా ఆడలేదు. లిస్ట్ ఎ క్రికెట్‌లో, అతను 127 మ్యాచ్‌ల్లో 4,695 పరుగులు చేశాడు. భారత మాజీ వికెట్ కీపర్ బ్యాట్స్ మాన్ దినేష్ కార్తీక్ రెండవ స్థానంలో ఉన్నాడు. అతను 79 ఈ ట్రోఫీ మ్యాచ్‌ల్లో 56 సగటుతో 3,433 పరుగులు చేశాడు. దినేష్ 260 మ్యాచ్‌లు ఆడి 7,603 పరుగులు చేసిన విస్తృతమైన లిస్ట్ ఎ క్రికెట్ అనుభవాన్ని కూడా కలిగి ఉన్నాడు. ఇక టీమిండియా మాజీ ఆటగాడు మనీష్ పాండే మూడో స్థానంలో ఉన్నాడు. అతను 103 హజారే ట్రోఫీ మ్యాచ్‌ల్లో 3,403 పరుగులు చేశాడు. సగటున 45. లిస్ట్ ఎ క్రికెట్‌లో అతను 192 మ్యాచ్‌ల్లో 6,310 పరుగులు చేశాడు. సగటున 45 కంటే కొంచెం ఎక్కువ. గుజరాత్‌కు చెందిన ప్రియాంక్ పంచల్ ఈ జాబితాలో నాల్గవ స్థానంలో ఉన్నాడు. ఈ ట్రోఫీలో అతను 83 మ్యాచ్‌ల్లో 3,395 పరుగులు చేశాడు, సగటున 43. లిస్ట్ ఎ క్రికెట్‌లో, అతను 97 మ్యాచ్‌లు ఆడి 3,672 పరుగులు చేశాడు. సగటున 41. ఆసక్తికరంగా, అంకిత్ లా ప్రియాంక్ కూడా భారతదేశం తరపున ఏ ఫార్మాట్‌లోనూ ఆడలేదు. చివరిగా మయాంక్ అగర్వాల్ ఐదో స్థానంలో ఉన్నాడు. విజయ్ హజారే ట్రోఫీలో 72 మ్యాచ్‌ల్లో 3,390 పరుగులు చేశాడు. సగటున 52. మయాంక్ ఐదు వన్డేలతో సహా మొత్తం 124 లిస్ట్ ఎ మ్యాచ్‌లు ఆడాడు. లిస్ట్ ఎ క్రికెట్‌లో దాదాపు 50 సగటుతో 5,670 పరుగులు చేశాడు మరియు 18 సెంచరీలు కూడా చేశాడు.



## న్యూజిలాండ్ వన్డే సిరీస్‌కు.. కెప్టెన్‌గా శుభ్‌మన్ గిల్

**న్యూఢిల్లీ:** స్వదేశంలో న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్‌కు భారత్ జట్టును జనవరి మొదటి వారంలో భారత్ క్రికెట్ కంట్రోల్ బోర్డు ప్రకటించనుంది. అజిత్ ఆగార్కర్, గౌతమ్ గంభీర్ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ జనవరి 3 లేదా 4న వర్చువల్‌గా సమావేశం కానుంది. ఇందులో కివీస్‌తో వన్డేల కోసం భారత్ జట్టును ఖరారు చేయనుంది. కాగా గాయం కారణంగా దక్షిణాఫ్రికాతో వన్డే సిరీస్‌కు దూరమైన కెప్టెన్ శుభ్‌మన్ గిల్ తిరిగి రీ ఎంట్రీ ఇవ్వడం దాదాపు ఖాయమైంది. కివీస్‌తో వన్డే సిరీస్‌లో జట్టును నడిపించేందుకు గిల్ సిద్ధమైనట్లు సమాచారం. సౌతాఫ్రికాతో టెస్టు సిరీస్ మధ్యలో గాయం కారణంగా వైదొలగిన గిల్ వన్డేలకు దూరమయ్యాడు. దీంతో అతడి స్థానంలో కేఎల్ రాహుల్ జట్టు పగ్గాలను చేపట్టాడు. అనంతరం గిల్ తిరిగి టి20 సిరీస్‌కు అందుబాటులో వచ్చాడు. అయితే నాలుగో టి20కి ముందు గిల్ మరోసారి గాయం బారిన పడ్డాడు. దీంతో చివరి రెండు టి20లకు కూడా అతడు దూరమయ్యాడు. అనంతరం టి20 వరల్డ్ కప్ 2026 జట్టులో గిల్ చోటు దక్కించుకోలేకపోయాడు. కానీ గిల్ మాత్రం ప్రస్తుతం పూర్తి ఫిట్‌నెస్ సాధించాడు. ఇప్పుడు విజయ్ హజారే ట్రోఫీ కోసం మొహాలీలో తీవ్రంగా శ్రమిస్తున్నాడు. అయితే వన్డే జట్టు పగ్గాలను చేపట్టాక గిల్ పెద్దగా రాణించలేకపోయాడు. ఆసిస్‌తో వన్డే సిరీస్‌లో గిల్ విఫలమయ్యాడు. దీంతో తన రీ ఎంట్రీలో న్యూజిలాండ్‌పై సత్తా చాటాలని శుభ్‌మన్ ఉవ్విళ్లూరుతున్నాడు. న్యూజిలాండ్‌తో వన్డేలకు భారత్ జట్టులో శుభమన్ గిల్ (కెప్టెన్), యశస్వి జైస్వాల్, రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి, రుతురాజ్ గైక్వాడ్, కెఎల్ రాహుల్ (వికెట్ కీపర్), రవీంద్ర జడేజా, హర్షిత్ రాణా, కుల్దీప్ యాదవ్, అర్షదీప్ సింగ్, ప్రసిద్ధ్ కృష్ణ, రిషబ్ పంత్, నితీష్ కుమార్‌రెడ్డి, అక్షర్‌పటేల్, తిలక్ వర్మ ఉండొచ్చనే అంచనాలు ఉన్నాయి.

## ఇంగ్లండ్, ఆస్ట్రేలియా సిరీస్‌లో.. నిప్పులు చెరిగిన బౌలర్లు

### ఒకే రోజు 20 వికెట్లు



**న్యూఢిల్లీ:** ప్రతిష్టాత్మక యాషెస్ సిరీస్‌లో భాగంగా ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ మధ్య మెల్‌బోర్న్ వేదికగా జరుగుతున్న నాలుగో టెస్ట్‌లో బౌలర్లు నిప్పులు చెరిగారు. శుక్రవారం ప్రారంభమైన ఈ బాక్సింగ్ డే టెస్ట్‌లో ఇరు జట్ల పేసర్లు చెలరేగడంతో తొలి రోజే 20 వికెట్లు నేలకూలాయి. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన ఇంగ్లండ్ బౌలింగ్ ఎంచుకోగా, ముందుగా బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 45.2 ఓవర్లలో 152 పరుగులకు ఆలౌటైంది. మైఖెల్ నెసర్(35), ఉస్మాన్ ఖవాజా(29), అలెక్స్ క్యారీ(20) టాప్ స్కోరర్లుగా నిలిచారు. ఇంగ్లండ్ బౌలర్లలో జోష్ టంగ్(5/45) 5 వికెట్లతో చెలరేగగా, గస్ అట్కిన్సన్(2/20) 2 వికెట్లు పడగొట్టాడు. బెన్ స్టోక్స్, బ్రైడన్ కార్స్‌కు చెరో వికెట్ దక్కింది. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన ఇంగ్లండ్ 29.5 ఓవర్లలో 110 పరుగులకు ఆలౌటైంది. హ్యారీ బ్రూక్(41), బెన్ స్టోక్స్(16), గస్ అట్కిన్సన్(28) మినహా అంతా సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. జాక్ క్రాలీ(5), బెన్ డకెట్(2), జాకోబ్ బెతెల్(1), జో రూట్(0), జేమీ స్మిత్(2), విల్ జాక్స్(5), బ్రైడన్ కార్స్(4) తీవ్రంగా నిరాశపర్చారు. ఆస్ట్రేలియా బౌలర్లలో మైఖెల్ నెసర్(4/45) 4 వికెట్లు తీయగా, మిచెల్ స్టార్క్(2/23) 2 వికెట్లు పడగొట్టాడు. స్కాట్ బోలాండ్(3/30) 3 వికెట్లు తీయగా, కామెరూన్ గ్రీన్ ఒక వికెట్ పడగొట్టాడు. 42 పరుగుల స్వల్ప ఆధిక్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆసీస్ తొలి రోజు ఆట ముగిసే సమయానికి ఒక ఓవర్‌లో వికెట్ నష్టపోకుండా 4 పరుగులు చేసింది. కాగా ఇప్పటికే ఈ సిరీస్‌ను ఆసీస్ 3-0తో కైవసం చేసుకుంది. చివరి రెండు టెస్ట్‌లను కూడా గెలిచి క్లీన్ స్వీప్ చేయాలనే లక్ష్యంతో ఉంది.





## గుజరాత్‌పై కోహ్లి 77, రోహిత్ గోల్డెన్ డక్

**న్యూఢిల్లీ:** విజయ్ హజారే ట్రోఫీ ఎలైట్ గ్రూప్ సి మ్యాచ్‌లో ఉత్తరాఖండ్‌తో జరిగిన ముంబై ఇన్నింగ్స్ తొలి ఓవర్‌లోనే భారత మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ గోల్డెన్ డక్‌గా అవుటయ్యాడు. శుక్రవారం జరిగిన మ్యాచ్ మొదటి ఓవర్ చివరి బంతికి కుడిచేతి వాటం మీడియం పేసర్ ఆకాష్ మధ్వాల్ బోరా బౌలింగ్‌లో రోహిత్ డీప్ ఫైన్ లెగ్ వద్ద క్యాచ్ పొందాడు. జగ్మోహన్ నాగర్కోటి తన తొలి ప్రయత్నాన్ని విఫలమైన తర్వాత రెండోసారి క్యాచ్‌ను పట్టుకున్నాడు. ఇంతకు ముందు ముంబై తరఫున ఏడు సంవత్సరాల తర్వాత ఆడిన తొలి విజయ్ హజారే ట్రోఫీ మ్యాచ్‌లో రోహిత్ సిక్కింపై 62 బంతుల్లో సెంచరీ సాధించి, దేశీయ క్రికెట్‌లోకి సంచలనాత్మక పునరాగమనం చేశాడు. ముంబై జట్టు విజయవంతమైన ఛేజింగ్‌లో అతను 98 బంతుల్లో 155 పరుగులు చేశాడు. అయితే ఈ సారి విఫలం చెందాడు.

మరోవైపు, విజయ్ హజారే ట్రోఫీలో ఢిల్లీ తరఫున తన అద్భుతమైన ఫామ్‌ను కొనసాగించిన విరాట్ కోహ్లి బెంగళూరులో గుజరాత్ ఎలైట్ గ్రూప్ డి మ్యాచ్‌లో 77 పరుగులు చేశాడు. కోహ్లి ఇన్నింగ్స్ 14 బౌండరీలతో నిండి ఉంది. అర్పిత్ రాణాతో కలిసి రెండో వికెట్‌కు 72 పరుగుల భాగస్వామ్యాన్ని, నితీష్ రాణాతో కలిసి 24 పరుగుల భాగస్వామ్యాన్ని, ఆ తర్వాత రిషబ్ పంత్‌తో కలిసి 10 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. ఆ తర్వాత 22వ ఓవర్‌లో విశాల్ జైస్వాల్‌కు బలయ్యాడు. ఇంతకు ముందు మ్యాచ్‌లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ఆంధ్రప్రదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో ఢిల్లీ తరఫున ఆడుతున్న కోహ్లి, జట్టు 299 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో తన మొదటి పరుగుతో 16 వేల లిస్ట్ ఎ పరుగుల మైలురాయిని చేరుకున్నాడు.

## వరల్డ్ టెన్నిస్ లీగ్‌లో.. విజయానికి చేరువలో ఆస్ట్రేలియన్



**న్యూఢిల్లీ:** దక్షిణేశ్వర్ సురేష్ నాయకత్వంలో ఆస్ట్రేలియన్ మావెరిక్స్ కైట్స్ జట్టు వరల్డ్ టెన్నిస్ లీగ్ విజయానికి చేరుకుంది. అలాగే తెలంగాణ ప్లేయర్ భమిడిపాటి శ్రీవల్లి ఆకట్టుకునే ప్రదర్శన చేసింది. శుక్రవారం జరిగిన వరల్డ్ టెన్నిస్ లీగ్ యొక్క నాల్గవ ఎడిషన్‌ను ఎఒఎస్ ఈగల్స్‌ను 22-19 తేడాతో ఓడించి గెలుచుకున్న ఆస్ట్రేలియన్ మావెరిక్స్ కైట్స్ తరపున దక్షిణేశ్వర్ కీలకమయ్యాడు. ముందు ఆస్ట్రేలియన్ మావెరిక్స్‌కు చెందిన భారత ఆటగాడు దక్షిణేశ్వర్ తన స్వదేశీయుడు సుమిత్ నాగల్‌తో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లోకి అడుగుపెట్టాడు. దక్షిణేశ్వర్ తన జట్టుకు 15-13 ఆధిక్యానికి చేర్చే బాధ్యతను తీసుకున్నాడు. 25 ఏళ్ల ఈ యువకుడు చక్కటి సెట్‌ను ఆడటంతో టైబ్రేక్‌తో నాలుగు పాయింట్లకు గెలిచింది. కాగా దక్షిణేశ్వర్ ఆడిన మూడు మ్యాచ్‌లలో రెండింటిలో గెలిచాడు. మొదటి రెండు రౌండ్ రాబిన్ మ్యాచ్‌లలో ఓడిపోయిన తర్వాత తక్కువ తేడాతో ఫైనల్‌లోకి ప్రవేశించిన జట్టును తన ఆధిక్యంలో ఉంచుకున్నాడు. కాగా మహిళల విభాగంలో మరో భారత్ క్రీడాకారిణి భమిడిపాటి శ్రీవల్లి ఈగల్స్ తరఫున ఆకట్టుకునే ప్రదర్శన చేసింది. మార్తా కోస్ట్యుక్‌తో జరిగిన ఆమె సింగిల్స్ పోటీలోను, డబుల్స్‌లోను ఫ్రెంచ్‌కు చెందిన గేల్ మోన్‌ఫిల్స్‌తో కలిసి కోస్ట్యుక్ మరియు దక్షిణేశ్వర్‌లతో జరిగిన పోటీలో ఆమె ఆకట్టుకుంది.

# ఐటి, ఆటో రంగాల్లో భారీ అమ్మకాలు

### వారాంతంలో సెన్సెక్స్, నిఫ్టీలకు నష్టాలు




**ముంబయి డిసెంబరు 26:** ఐటీ, ఆటో రంగాల షేర్లలో అమ్మకాల ఒత్తిడికారణంగా దేశీయ స్టాక్ మార్కెట్లు వారాంతంలో నష్టాల్లోనే ముగిసాయి. సూచీలపై ప్రతికూల ప్రభావం చూపింది. ట్రేడింగ్ ముగిసే సమయానికి, సెన్సెక్స్ 367.25 పాయింట్లు నష్టపోయి 85,041.45 వద్ద స్థిరపడింది. నిఫ్టీ కూడా 99.80 పాయింట్లు క్షీణించి 26,042.30 వద్ద ముగిసింది. సెలవుల కారణంగా ఈ వారం ట్రేడింగ్ సెషన్లు తక్కువగా ఉండటం, మార్కెట్‌ను నడిపించే బలమైన సానుకూల సంకేతాలు లేకపోవడంతో ఇన్వెస్టర్లు అప్రమత్తంగా వ్యవహరించారు. దీంతో పాటు సెన్సెక్స్ డెరివేటివ్‌ల గడువు ముగియడం కూడా మార్కెట్ సెంటిమెంట్‌ను బలహీన పరిచింది. బీఎస్‌ఈలో టైటన్, ఎన్టీపీసీ, హిందుస్థాన్ యూనిలీవర్ షేర్లు లాభపడగా, బజాజ్ ఫైనాన్స్, ఏషియన్ పెయింట్స్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ వంటి షేర్లు నష్టపోయాయి. ఎన్ఎస్ఈలో టైటన్, హిందాల్కో, నెస్లే ఇండియా లాభపడిన వాటిలో ఉన్నాయి. ఏషియన్ పెయింట్స్, శ్రీరామ్ ఫైనాన్స్, బజాజ్ ఫైనాన్స్ నష్టాలను చవిచూశాయి. స్మాల్, మిడ్ క్యాప్ మార్కెట్ లోనూ అమ్మకాల ఒత్తిడి కనిపించింది. నిఫ్టీ మిడ్ క్యాప్ 100 ఇండెక్స్ 0.23 శాతం, స్మాల్ క్యాప్ 100 ఇండెక్స్ 0.08 శాతం మేర నష్టపోయాయి. రంగాల వారీగా చూస్తే, నిఫ్టీ ఐటీ ఇండెక్స్ 1.03 శాతం, ఆటో ఇండెక్స్ 0.52 శాతం పతనమయ్యాయి. అయితే, దీనికి భిన్నంగా మెటల్ షేర్లు రాణించడంతో నిఫ్టీ మెటల్ ఇండెక్స్ 0.59 శాతం లాభపడింది.

# జీవనకాల గరిష్టానికి వెండి, బంగారం ధరలు

### తులం బంగారం రూ.1.40 లక్షలు

### కిలో వెండి రూ.2.40 లక్షలు



**ముంబయి, డిసెంబరు 26:** భారత బులియన్ మార్కెట్‌లో శుక్రవారం బంగారం, వెండి ధరలు సరికొత్త చరిత్ర సృష్టించాయి. మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసిఎక్స్)లో ట్రేడింగ్ ప్రారంభమైన కొద్దిసేపటికే ధరలు ఆకాశమే హద్దుగా దూసుకుపోయాయి. హైదరాబాద్‌లో 10 గ్రాముల బంగారం ధర తొలిసారిగా రూ.1,40,000 వద్ద ఆల్ టైమ్ గరిష్ఠాన్ని తాకింది. మరోవైపు, వెండి ధర కూడా ఊహించని రీతిలో పెరిగి కిలోకు రూ.2.40లక్షల వద్ద జీవితకాల గరిష్ఠ స్థాయికి చేరింది. ఈ ధరల పెరుగుదల వెనుక పలు అంతర్జాతీయ పరిణామాలు ఉన్నాయి. ముఖ్యంగా, అమెరికా ఫెడరల్ రిజర్వ్ 2026లో వడ్డీ రేట్లను తగ్గిస్తుందన్న బలమైన అంచనాలు ప్రధాన కారణంగా నిలుస్తున్నాయి. వడ్డీ రేట్లు తగ్గితే, బంగారం వంటి వడ్డీరహిత ఆస్తులపై పెట్టుబడిపెట్టేందుకు చేసేందుకు ఇన్వెస్టర్లు మొగ్గుచూపుతారు. దీనికి తోడు రష్యాఉక్రెయిన్ యుద్ధం, అమెరికావెనిజులా మధ్య ఉద్రిక్తతలు, నైజీరియాలో అమెరికా సైనిక చర్యలు వంటి భౌగోళిక రాజకీయ అనిశ్చితి వల్ల సురక్షితమైన పెట్టుబడిగా బంగారం వైపు డిమాండ్ భారీగా పెరిగింది. డాలర్ బలహీనపడటం కూడా పసిడి, వెండి ధరల పెరుగుదలకు దోహదపడింది. రిలయన్స్ సెక్యూరిటీస్ సీనియర్ రీసెర్చ్ అనలిస్ట్ జిగర్ త్రివేది మాట్లాడుతూ పెరుగుతున్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల కోత అంచనాల నేపథ్యంలో సురక్షితమైన పెట్టుబడి సాధనంగా బంగారానికి డిమాండ్ పెరిగింది. దీంతో శుక్రవారం ప్రపంచ మార్కెట్లో ఔన్సు బంగారం ధర 4,500 డాలర్ల స్థాయిని చేరిందని వివరించారు. ధరలు రికార్డు స్థాయిలో పెరగడంతో దేశీయంగా రిటైల్ మార్కెట్‌లో అమ్మకాలు దారుణంగా పడిపోయాయి. గత 15 రోజుల్లో అమ్మకాలు 50 శాతానికి పైగా తగ్గాయని జెమ్ అండ్ జ్యువెలరీ డొమెస్టిక్ కౌన్సిల్ (జెఅండ్‌జె) మాజీ ఛైర్మన్ అనంత పద్మనాభన్ తెలిపారు. క్రిస్మస్, నూతన సంవత్సర సెలవులు, ఎన్నారైల రాక ఉన్నప్పటికీ మార్కెట్‌లో పెద్దగా కదలిక లేదని ఆయన పేర్కొన్నారు. అహ్మదాబాద్ జ్యువెలర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జిగర్ సోనీ మాట్లాడుతూ, ప్రస్తుత ధరల వద్ద వినియోగదారులు చాలా జాగ్రత్తగా ఉంటున్నారు. పెళ్లిళ్ల కోసం కూడా 22 క్యారెట్ల బంగారానికి బదులుగా 14 లేదా 18 క్యారెట్ల ఆభరణాలను కొనుగోలు చేస్తున్నారు. చాలా మంది కొత్త బంగారం కొనడానికి బదులుగా తమ వద్ద ఉన్న పాత బంగారాన్ని మార్చుకోవడానికే ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. బంగారంతో పోలిస్తే వెండి ధర మరింత వేగంగా పెరిగింది. దీనికి పారిశ్రామిక డిమాండ్ ఒక ముఖ్య కారణం. ఎలక్ట్రిక్ వాహనాలు , సోలార్ ప్యానెల్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ హార్డ్‌వేర్ రంగాల్లో వెండి వినియోగం విపరీతంగా పెరిగింది. సరఫరా కంటే డిమాండ్ ఎక్కువగా ఉండటంతో వరుసగా నాలుగో ఏడాది కూడా వెండి లోటును ఎదుర్కొంటోంది. ఈ కారణంగానే ఈ ఏడాది వెండి ధర ప్రపంచవ్యాప్తంగా దాదాపు 158 శాతం పెరిగింది. మార్కెట్ నిపుణుల అంచనాల ప్రకారం, ఈ బులియన్ ర్యాలీ ఇప్పట్లో ఆగేలా కనిపించడం లేదు. 2026 ప్రథమార్థంలో ఔన్సు బంగారం ధర 5,000 డాలర్లకు, వెండి 90 డాలర్లకు చేరే అవకాశం ఉందని ఒవాండా సీనియర్ మార్కెట్ అనలిస్ట్ కెల్విన్ వాంగ్ అంచనా వేశారు. దేశీయంగా తులం బంగారం రూ.1,50,000, కిలో వెండి రూ.2,50,000 స్థాయిలను తాకే అవకాశం ఉందని అంచనా.




## నెదర్లాండ్స్ టాటాస్టీల్‌పై పోరాటం

### రూ.14,370 కోట్లు చెల్లించాలంటూ పిటిషన్

**ఆమ్‌స్టర్‌డామ్, డిసెంబరు 46:** టాటా గ్రూప్‌కు చెందిన టాటా స్టీల్ నెదర్లాండ్ యూనిట్‌పై అక్కడి స్వచ్ఛంద సంస్థ న్యాయపోరాటానికి దిగింది. కంపెనీ కార్యకలాపాల వల్ల స్థానిక ప్రజల ఆరోగ్యానికి ముప్పు వాటిల్లుతోందని, పర్యావరణానికి తీవ్ర నష్టం జరుగుతోందని ఆరోపిస్తూ నెదర్లాండ్స్‌లోని నార్త్ హాలెండ్ డిస్ట్రిక్ట్ కోర్టులో దావా దాఖలు చేసింది. పరిహారంగా 1.6 బిలియన్ డాలర్లు, అంటే భారత కరెన్సీలో సుమారు రూ.14,370 కోట్లను చెల్లించాలని డిమాండ్ చేసింది. టాటా స్టీల్ అధికారికంగా ఈసమాచారం వెల్లడించింది. నెదర్లాండ్స్‌లోని వెల్సన్‌నూర్డ్ ప్రాంతంలో ఉన్న ఐజ్మెయిడన్ బీవీ ప్లాంట్ నుంచి వెలువడే కాలుష్యకారకాలు స్థానికుల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయని ఆ స్వచ్ఛంద సంస్థ ఆరోపిస్తోంది. కాలుష్య ప్రభావంతో ప్రజలు నిరంతర భయాందోళనల్లో జీవించాల్సి వస్తోందని, ఇంట్లో ప్రశాంతంగా గడపలేకపోతున్నారని, ఆ ప్రాంతంలోని ఆస్తుల విలువ కూడా పడిపోయిందనేది ఎన్‌జీవో వాదనగా ఉంది. ఈ ఆరోపణలను టాటా స్టీల్ తీవ్రంగా ఖండించింది. ఎన్‌జీవో చేసిన ఆరోపణలకు ఎలాంటి ఆధారాలు లేవని స్పష్టం చేసింది. తమ కార్యకలాపాలు నిబంధనలకు అనుగుణంగానే సాగుతున్నాయని, పర్యావరణ పరిరక్షణ విషయంలో తమకు అనుకూలంగా బలమైన ఆధారాలు ఉన్నాయని టాటా స్టీల్ రెగ్యులేటరీ ఫైలింగ్‌లో పేర్కొంది. ఈ కేసు విచారణ రెండు దశల్లో కొనసాగుతుందని, ఒక్కో దశ పూర్తయ్యేందుకు కనీసం రెండు నుంచి మూడు సంవత్సరాల వరకు సమయం పట్టే అవకాశం ఉందని తెలిపింది. అందువల్ల ఇప్పట్లో పరిహారం చెల్లించే అంశం తలెత్తే అవకాశమే లేదని టాటా స్టీల్ స్పష్టం చేసింది. మరోవైపు, నెదర్లాండ్స్ ప్రభుత్వంతో కలిసి పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించేందుకు ఇప్పటికే పలు చర్యలు చేపట్టామని, ఉద్గారాలను నియంత్రించే దిశగా పెట్టుబడులు పెట్టి ఆధునిక సాంకేతికతను అమలు చేస్తున్నామని టాటా స్టీల్ పేర్కొంది.

## ఉద్యోగుల సంక్షేమంపై సిఇఒ ఉదారత

## రూ.2155 కోట్లు సిబ్బందికి పంపిణీ



**లూసియానా, డిసెంబరు 26:** ఉద్యోగుల సంక్షేమానికి తన విశాల హృదయం చాటుకున్న సిఇఒపై ప్రపంచస్థాయిలో ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. ఫైబర్‌బాండ్ సిఇఒ గ్రాహం వాకర్ తాను స్థాపించిన కంపెనీని అమ్మిన తర్వాత వచ్చిన లాభాల్లో ఏకంగా 240 మిలియన్ డాలర్లు అంటే సుమారు రూ. 2,155 కోట్లు తన ఉద్యోగులకు పంచిపెట్టి ఆయన తన ఉదారతను చాటుకున్నారు. లూసియానాకు చెందిన గ్రహం వాకర్, ఎలక్ట్రికల్ పరికరాల కోసం ఎన్‌క్లోజర్‌లను తయారుచేసే ఫైబర్‌బాండ్ అనే తన కుటుంబ వ్యాపారాన్ని ఈటన్ కార్పొరేషన్‌కు 1.7 బిలియన్ డాలర్లకు అంటే సుమారు రూ. 15,265 కోట్లకు విక్రయించారు. ఈ ఒప్పందం కుదుర్చుకోవడానికి ముందే ఆయన ఒక ముఖ్యమైన షరతు పెట్టారు. కంపెనీ అమ్మకం ద్వారా వచ్చే మొత్తంలో 15 శాతాన్ని తన 540 మంది ఉద్యోగులకు చెల్లించాలని స్పష్టం చేశారు. ఈ షరతుకు కొనుగోలుదారులు అంగీకరించడంతో ఒప్పందం ఖరారైంది. ఈ ఏడాది జూన్ నుంచి ఉద్యోగులకు చెల్లింపులు ప్రారంభమయ్యాయి. దీని ప్రకారం, ఒక్కో ఉద్యోగికి సగటున 4.43 లక్షల డాలర్లు మన కరెన్సీలో సుమారు రూ. 3.70 కోట్లు అందనున్నాయి. ఈ మొత్తాన్ని ఐదేళ్ల పాటు, వారు కంపెనీలో కొనసాగే ప్రాతిపదికన చెల్లిస్తారు. కష్టకాలంలో, ముఖ్యంగా 1998లో ఫ్యాక్టరీ కాలిపోయినప్పుడు, డాట్‌కామ్ సంక్షోభం సమయంలోనూ ఉద్యోగులు కంపెనీకి అండగా నిలిచారని, వారి విధేయతకు కృతజ్ఞ తగా ఈ నిర్ణయం తీసుకున్నానని వాకర్ తెలి పారు. అనూహ్య బోనస్‌తో ఉద్యోగుల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. చాలామంది ఈ డబ్బుతో తమ అప్పులు, ఇంటి లోన్లు తీర్చుకున్నారు. మరికొందరు కార్లు కొనుగోలు చేయగా, తమ పిల్లల ఉన్నత విద్య కోసం, రిటైర్మెంట్ కోసం పొదుపు చేసుకుంటున్నారు. వాకర్ తీసుకున్న ఈ నిర్ణయంపై నెటిజన్లు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.

## అమ్మకాలు పెరిగినా 'జెప్టో'కు తప్పని నష్టాలు..

## ఐపిఒతో ఆర్థికపరిపుష్టికి కంపెనీ నిర్ణయం



**ముంబయి, డిసెంబరు 26:** క్విక్ కామర్స్ సంస్థ జెప్టో 2024-25 ఆర్థిక సంవత్సరంలో అమ్మ కాల్లో అద్భుతమైన వృద్ధిని సాధించినప్పటికీ, నష్టాలు భారీ స్థాయిలో పెరిగాయి. కంపెనీ నివేదికల ప్రకారం అమ్మకాలు రెట్టింపు కాగా, నష్టాలు అంతకుమించి పెరిగాయి. 2024-25 ఆర్థిక సంవత్సరంలో జెప్టో మొత్తం అమ్మకాలు రూ. 9,668.8 కోట్లుగా నమోదయ్యాయి. గత ఆర్థిక సంవత్సరంలో ఇవి రూ. 4,223.9 కోట్లుగా ఉండగా, ఏకంగా 129 శాతం వృద్ధి కనిపించింది. అదే సమయంలో కంపెనీ నికర నష్టం 177 % పెరిగి రూ. 3,367.3 కోట్లకు చేరింది. గత ఆర్థిక సంవత్సరంలో ఈ నష్టం రూ. 1,214.7 కోట్లు మాత్రమే. మార్కెట్లో పోటీ తీవ్రతరం కావడంతో కార్యకలాపాల విస్తరణ, కొత్త డార్క్ స్టోర్ల ఏర్పాటు, కస్టమర్లను ఆకర్షించడం కోసం భారీగా ఖర్చు చేయాల్సి రావడమే ఈ నష్టాలకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. టర్నోవర్‌తో పోలిస్తే నష్టాల వాటా 2024లో 29 శాతంగా ఉండగా, 2025 నాటికి అది 35 శాతానికి పెరిగింది. ఇలాంటి ఆర్థిక ఫలితాల నేపథ్యంలోనే జెప్టో పబ్లిక్ మార్కెట్లలోకి అడుగుపెట్టేందుకు సిద్ధమవుతోంది. ఈరోజు ఐపీఓ కోసం రహస్యంగా ముసాయిదా పత్రాలను దాఖలు చేయనుందని సమాచారం. ఈ నెల 23న జరిగిన వాటాదారుల సమావేశంలో కంపెనీ వ్యవస్థాపకులు ఆదిత్య పాలిచా, కైవల్య వోహ్రా, సీఎఫ్ఓ రమేశ్ బఫ్నాలను పూర్తికాల డైరెక్టర్లుగా నియమిస్తూ బోర్డులో కీలక మార్పులు చేశారు.

## అగర్‌బత్తీలకు బిఐఎస్ బార్‌కోడ్ తప్పనిసరి: రసాయన వినియోగాలపై ఆంక్షలు

**న్యూఢిల్లీ, డిసెంబరు 26:** వినియోగదారుల భద్రతను దృష్టిలో ఉంచుకుని అగర్‌బత్తీలకు కేంద్రం కొత్తప్రమాణాలు జారీచేసింది. హానికర రసాయనాల వినియోగంపై నిషేధం ప్రకటించింది. వినియోగదారుల భద్రత, ఇండోర్ గాలి నాణ్యత పర్యావరణంపై ప్రభావంతోపాటు సువాసన సమ్మేళనాలు రసాయనాలపై అంతర్జాతీయంగా ఉన్న ఆంక్షలను దృష్టిలో పెట్టుకుని అగర్‌బత్తీలకోసం ఐఎస్ 19412ః 2025 ప్రమాణాన్ని బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ బిఐఎస్ హాల్‌మార్క్ తప్పనిసరి చేసింది. దీనితో కొనుగోలుదారులు నమ్మకంతో కొంటారని కేంద్ర వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వశాఖ వెల్లడించింది. అలెత్రిన్, పెర్మెత్రిన్, సైపర్‌మెత్రిన్, డెల్టామెత్రిన్, ఫిప్రోనిల్ వంటి రసా యనాలు వినియోగించడాన్ని కేంద్రం నిషేధించింది. బెంజైల్ సైనేడ్; ఇథైల్ అక్రిలేట్, డైఫి నైలమైన్ వంటి సింథటిక్ సుగంధ పదార్థాల విని యోగంపైనా ఆంక్షలు విధించింది. ప్రస్తుతం ఏటా రూ.8వేలకోట్ల అగర్‌బత్తీలవ్యాపారంజరుగుతోంది. అమెరికా, మలేసియా, నైజీరియా, బ్రెజిల్,మెక్సికోవంటి దేశాలకు రూ.1200 కోట్లకుపైగానే మన అగర్‌బత్తీ ఎగుమతులు జరుగుతున్నాయి.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No. 64861/96 , Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14